www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★




రూ.5 లక్షల కోట్ల భూ కుంభకోణం

కెటిఆర్ చెప్పేవి పచ్చి అబద్ధాలు 03

ఐబొమ్మ రవిపై ఐదు కేసులు..

సంపుటి 08, సంచిక: 351 | శనివారం | 22-11-2025 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## బూటకపు ఎన్‌కౌంటర్లు నిలిపివేసి

# శాంతి చర్చలు జరపండి

- మోదీ, షాలు ఊచకోతకు పాల్పడుతుంటే సుప్రీంకోర్టు మౌనం బాధాకరం
- నక్సల్స్‌పై హత్యాకాండను నిరసిస్తూ సంతకాల సేకరణ చేపడతాం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడి
- లిబర్టీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష, రాజకీయపార్టీలు, మేధావులు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల ప్రతినిధుల నిరసన ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మనుషుల ఉచకోతకు పాల్పడుతుంటే, సుప్రీంకోర్టు మౌనంగా ఉండడం బాధాకరమని, ఇప్పటికైనా బూటకపు ఎన్‌కౌంటర్లను న్యాయ వ్యవస్థ సుమోటోగా స్వీకరించి సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టనున్నట్టు వెల్లడించారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తానని ప్రకటించిన కేంద్ర మంత్రి అమిత్‌షా, ముందుగా దేశంలోని అవినీతిని, నిరుద్యోగాన్ని, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని అంతం చేయడం సవాల్‌గా తీసుకోవాలని సూచించారు. ''మావోయిస్టులను బిజెపి ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా

తరువాయి 2లో

మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఓ కట్టుకథ
మావోయిస్టులు లేఖ విడుదల 03

## కార్మికశక్తిపై

# సమ్మెట పోటు



- నాలుగు లేబర్‌కోడ్‌ల అమలు
- ఇకపై పాత 29 కార్మిక చట్టాలుండవు
- కార్పొరేట్ యాజమాన్యాలు చెప్పిందే వేదం

### కార్మిక సంస్కరణల పేరుతో హక్కుల కోత

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అదును చూసి దెబ్బకొట్టింది. ప్రతి కార్మికుడికి గౌరవాన్ని కల్పించాలన్న పేరుతో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ శుక్రవారం నుండి దేశంలో నాలుగు కార్మిక స్మృతులను (లేబర్ కోడ్‌లను) అమలులోకి తెచ్చినట్లు ప్రకటించింది. దీంతో ప్రస్తుతం అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలు రద్దవుతాయి. పాత చట్టాలను హేతుబద్ధీకరిస్తామని చెప్పడం ఒక సాకుమాత్రమే. ఇకముందు కార్పొరేట్ యాజమాన్యాలు చెప్పిందే వేదం కానున్నది. కార్మిక సంస్కరణల పేరుతో హక్కులకు కోతపడనున్నది. వేతనాల కోడ్2019, పారిశ్రామిక సంబంధాల కోడ్2020, సామాజిక భద్రత కోడ్ 2020, వత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్2020 అనే నాలుగు కార్మిక కోడ్‌ల పేరిట సరికొత్త కార్మిక నిబంధలను తీసుకువచ్చింది. ఈ కొత్త కార్మిక చట్టాలు పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైనవిగా ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తిన విషయం విదితమే. పైగా ఎఐటియుసితో సహా పది కేంద్ర కార్మిక సంఘాలు ఈ కోడ్‌లను వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. బిహార్ ఎన్నికల విజయంతో ఏ చట్టాలు అమలు చేసినా తిరుగులేదన్న భావంతో బిహార్‌లో ప్రభుత్వం ఏర్పడిన రెండోరోజే ఈ నాలుగు కార్మిక కోడ్‌లను అమల్లోకి తెచ్చింది. కాగా, ఈ కార్మిక కోడ్‌లను తక్షణమే వెనక్కి తీసుకోవాలని 10 కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఇలా దొడ్డిదారిన అమలు చేయడం కార్మికులకు విద్రోహం చేయడమేనని వ్యాఖ్యానించాయి. వీటి అమలును అడ్డుకుంటామని, దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించాయి.

కార్మిక నిబంధనలను ఆధునీకరించడం, కార్మికుల సంక్షేమాన్ని మెరుగుపరచడం, అభివద్ధి చెందుతున్న పని ప్రపంచంతో కార్మిక పర్యావరణ వ్యవస్థను సమలేఖనం చేయడం ద్వారా, నేటి శ్రామిక శక్తిని భవిష్యత్ కోసం తయారు చేయడమే ఈ కోడ్‌ల లక్ష్యమని, ఆత్మనిర్భర్ భారత్ కోసం కార్మిక సంస్కరణలను నడిపించే బలీయమైన పరిశ్రమలకు ఈ కోడ్‌లు పునాది వేస్తుందని కార్మిక శాఖ ఈ సందర్భంగా పేర్కొంది.

కార్మికులకు మరిన్ని హక్కులను కల్పించడం, మహిళా కార్మికులకు నైట్ షిఫ్ట్ పనితోపాటు మరింత భద్రత చేకూర్చడం, 40 ఏళ్లు దాటిన కార్మికులకు ఉచిత వార్షిక ఆరోగ్య తనిఖీలు, పాన్‌ఇండియా ఇఎస్‌ఐ కవరేజి పేరుతో ప్రమాదకర ప్రాసెసింగ్ యూనిట్లకూ ఇఎస్‌ఐసిని వర్తింపజేయడం, కంపెనీలకు సింగిల్ రిజిస్ట్రేషన్, లైసెన్స్,

తరువాయి 2లో

### 26న నిరసనలకు కేంద్ర కార్మిక సంఘాల పిలుపు

బానిసత్వం దిశగా దేశం అడుగులు వేస్తోందని, లేబర్ కోడ్ల అమలులో భావితరాల ఆశలు, ఆకాంక్షలు ఆవిరవుతాయని, వినాశకర పరిణామాలు తప్పబోవని కేంద్ర కార్మిక సంఘాలు హెచ్చరించాయి. కార్మిక కోడ్లను తక్షణమే రద్దు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. వీటిని అమలు చేయడం శ్రామిక వర్గంపై యుద్ధం ప్రకటించడమే అవుతుందని, దీనికి నిరసనగా కార్మికశ్రామిక వర్గం పోరు బాట పట్టాలని పిలుపునిచ్చాయి. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు (సిటియులు) శుక్రవారం ఐక్య ప్రకటన విడుదల చేశాయి. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాస్తూ, బానిసత్వంలోకి కార్మికులను నెట్టే విధంగా నాలుగు కోడ్ల అమలునకు కేంద్రం సిద్ధమైందని దుయ్యబట్టాయి. లేబర్ కోడ్ల అమలును వ్యతిరేకిస్తూ ఈనెల 26న రైతులతో కలిసి పోరాటానికి పిలుపునిచ్చాయి. కార్మిక లోకం గర్జన తప్పబోదని సూచించాయి. పోరాటంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, కోడ్‌ల రద్దునకు బిగ్గరగా డిమాండ్ చేయాలని కార్మిక వర్గానికి ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్‌ఇడబ్ల్యూఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్,

తరువాయి 2లో



## నగరానికి రాష్ట్రపతి

ద్రౌపది ముర్ముకు బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనస్వాగతం

ప్రజాపక్షం/హైదరాబాద్

సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవాన్ని (రెండవ ఎడిషన్) ప్రారంభించడానికి హైదరాబాద్‌కు వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా స్వాగతం పలికింది. బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛాలందించి దుశ్వాలువాతో ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి బి.శివధర్ రెడ్డితో పాటు త్రివిధ దళాల అధికారులు, నగర ప్రముఖులు రాష్ట్రపతికి స్వాగతం పలికారు.

## 25న కేబినేట్ భేటీ

రిజర్వేషన్లకు చెందిన డెడికేషన్ కమిషన్ సిఫార్సులకు ఆమోదం..?

ప్రజాపక్షం/హైదరాబాద్

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్లకు సంబంధించి బూసాని వెంకటేశ్వర రావు నేతృత్వంలోని డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను ఈ నెల 25న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోద ముద్ర వేయనుంది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అంశంపై న్యాయపరమైన వివాదాలు ఉన్నందన , 50 శాతానికి రిజర్వేషన్లు మించ కుడా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే రిజర్వేషన్లను 50 శాతానికి మించకుండా సిఫార్స్ చేయాలని మంత్రివర్గం డెడికేటెడ్ కమిషన్ సూచించింది. దీంతో కమిషన్ బిసి,ఎస్‌సి,ఎస్‌టి కోటాన్ని ఖరారు చేస్తూ సిఫార్సులు చేసింది. దీనిపైన మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. కాగా ఈ నెల 24న హైకోర్టు విచారణ జరగనున్న నేపథ్యంలో కోర్టు తీసుకునే నిర్ణయంపైన కూడా మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఉత్సవాలు, అందులో చేపట్టే కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరల పంపిణీ , తెలంగాణ రేజింగ్ 2047 విజన్ తదితర అంశాలపైన మంత్రివర్గంలో చర్చించనున్నారు.



## దేశంపై మతోన్మాద భూతం

- తరిమికొట్టాల్సిన బాధ్యత ఎర్రజెండాలదే
- మరో వందేళ్లు కూడా ప్రజలతో మమేకం : కూనంనేని, చాడ

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

దేశంపై మతోన్మాద భూతం రాజ్యమేలుతోంది, ఎర్రజెండాలన్నీ ఏకమై ఆ కాషాయి భూతాన్ని తరిమికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంత ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్‌లో ప్రారంభమైన బస్సు జాతా మహబూబాబాద్ జిల్లా మీదుగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు రాజీవ్‌నగర్ వద్ద ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా ఇల్లెందు పట్టణంలోకి చేరుకుంది. పాతబస్టాండ్ సెంటర్ వద్ద సభ నిర్వహించారు. అనంతరం కొత్తగూడెం సమీపంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్‌కు జాత చేరుకోవడంతో పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. అక్కడ్నుంచి ర్యాలీగా బయలుదేరి పాల్వంచకు చేరుకుంది.అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం కిన్నెరసాని రోడ్‌లో భారీ బహిరంగ సభ జరిగింది. రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని, చాడా మాట్లాడుతూ మతాలు, కులాల పేరుతో కాషాయం పార్టీ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రజల మాన, ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు. కమ్యూనిస్టులు లేకుండా చేయాలనే కుట్రతో కేంద్రంలోని పాలకులు యోచిస్తున్నారని, అందుకే మావోయిస్టులను సైతం డెడ్‌లైన్ పెట్టి మరీ చంపుతున్నారని మండిపడ్డారు. అడవుల్లో నిక్షిప్తమై ఉన్న అపార ఖనిజ సంపదను కాజేసేందుకు అధికారాన్ని అడ్డుపెట్టుకుని

తరువాయి 12లో



## మతఛాందసవాద అడ్డుకట్టకు కమ్యూనిస్టుల

# ఐక్యత అనివార్యం

అటవీ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే ఎన్‌కౌంటర్లు

సాంబశివరావు, బాల నర్సింహ్మా, ఎమ్మెల్సీ నెల్లికంటి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

మతోన్మాద ఆగడాలను అడ్డుకట్ట వేయకుంటే దేశం అదోగతి పాలవుతుందని, మితిమీరుతున్న మత ఛాందస వాదాన్ని నిలువరించేందుకు కమ్యూనిస్టుల ఐక్యత అనివార్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నర్సింహ్మా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలునిచ్చారు. సిపిఐ శతవసంత ఉత్సవాలను పురస్కరించుకుని జోగులాంబ గద్వాల్ నుండి ప్రారంభమైన ప్రచార జాతా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలురుపాడు మండలంలోనికి ప్రవేశించింది. నాయకులగూడెం వద్ద తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొమారి రామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించిన అనంతరం సుజాతనగర్ మండలం మీదుగా కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కొత్తగూడెం పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ ప్రదర్శన సాగింది. అనంతరం పోస్టాఫీస్ సెంటర్లో జరిగిన బహిరంగ సభలో కూనంనేని, బాల నర్సింహ్మా నెల్లికంటి మాట్లాడారు. దేశప్రజలపై మతజోక్యం నానాటికీ పెరిగిపోతోందని, భిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమైన భారతావనిలో కులమతాల చిచ్చు రేపుతూ ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ఓట్లచోరీకి పాల్పడుతూ బిజెపి అధికార

తరువాయి 12లో



## 'సుప్రీం' తీర్పు పున:పరిశీలించాలి

బిల్లులకు కాలపరిమితి లేదన్న కోర్టు వ్యాఖ్యలపై సిపిఐ అసంతృప్తి

**న్యూఢిల్లీ:** బిల్లులకు గవర్నర్ల ఆమోదం, రాష్ట్రపతికి సిఫార్సులకు సంబంధించి కాలపరిమితి లేదని సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తాజా తీర్పుపై సిపిఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యం, సహకార సమాఖ్యవాదం బలోపేతం దృష్ట్యా ఈ నిర్ణయాన్ని పున:పరిశీలించాలని పార్టీ జాతీయ కార్యదర్శి వర్గం శుక్రవారం ఒక ప్రకటనలో కోరింది. దేశ ఫెడరల్ వ్యవస్థపై మచ్చలు పడుతూ... కేంద్రీకరణ పెరుగుతున్న తరుణంలో ఇలాంటి తీర్పుతో జవాబుదారీతనానికి హామీ లేకుండా పోతుందని పేర్కొంది. విధానపరమైన నిర్ణయాలను, శాసనసభ తీర్మానాలను నిలుపుదల చేసే అవకాశం ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఉంటుందని హెచ్చరించింది. కాల పరిమితి లేకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాల తీర్మానాలకు గవర్నర్ల ఆమోదం, రాష్ట్రపతికి సిఫార్సుల విషయంలో నిష్క్రియాత్మకత వైఖరి పెరగవచ్చని సిపిఐ

తరువాయి 2లో



## 42 శాతం రిజర్వేషన్ల అమలుకు

# రాజ్యాంగాన్ని సవరించాల్సిందే

- పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిల్లు పెట్టాలి
- పార్టీపరంగా కాకుండా చట్టబద్ధంగా బిసి రిజర్వేషన్లు అమలు చేయాలి
- బిసి జెఎసి విస్తృత స్థాయి సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ఈ పార్లమెంట్ సమావేశాలలోనే రాజ్యాంగ సవరణ చేయాలని, పార్టీ పరంగా కాకుండా చట్టబద్ధంగా బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని పలువురు వక్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లు, సర్పంచ్ ఎన్నికలతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై కాచిగూడలోని ఓ హోటల్‌లో శుక్రవారం బిసి జెఎసి విస్తృతస్థాయి సమావేశం

తరువాయి 12లో

## పర్యావరణ సమతుల్యానికి

# అధిక నిధులు కేటాయించాలి

కాప్ 30లో భారత్ సూచన... ముగిసిన సదస్సు



**బెలేం (బ్రెజిల్):** పర్యావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు అధికంగా నిధులు కేటాయించాలని భారత్ సూచించింది. ఈనెల 10వ తేదీన ఇక్కడ ప్రారంభమైన కాప్30 సదస్సు శుక్రవారం (నవంబర్ 21) ముగిసింది. భారత్ తరపున సదస్సుకు హాజరైన కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ వాతావరణ అనుకూలత కోసం దేశీయ స్థాయిలో కట్టుబడి పనిచేస్తున్నదని అన్నారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఈ విషయంలో పెరుగుతున్న అంతరాన్ని దృష్టిలో ఉంచుకుంటే 'వాతావరణ అనుకూల' నిధులను భారీగా పెంచడం అత్యవసరమని యాదవ్ అన్నారు. 'వాతావరణ అనుకూలత అనేది ఐచ్ఛికం కాదు.. అత్యవసర పెట్టుబడి' అనే స్పష్టమైన రాజకీయ సందేశాన్ని కాప్30 అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 'అడాప్షన్ గ్యాప్ రిపోర్ట్' 2025ని అనుసరించి, వాతావరణ పరిరక్షణ చర్యల కోసం అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారీగా నిధులు అవసరం. 2035 నాటికి ఈ దేశాలకు, సంవత్సరానికి 310 నుంచి 365 బిలియన్ల డాలర్లు కావాల్సి వస్తుంది. కానీ ప్రస్తుత నిధుల ప్రవాహం కేవలం 26 బిలియన్ డాలర్లకు మాత్రమే పరిమితమైంది. ఈ అంశాలను యాదవ్ ప్రస్తావిస్తూ, గ్లాస్గో వేదికగా 2019లో పర్యావరణ సదస్సులో పర్యావరణ అనుకూలత నిధులను 2025 చివరి నాటికి రెట్టింపు చేయాలని తీర్మానించినప్పటికీ, ఈ లక్ష్యం నెరవేరే పరిస్థితులు కనిపించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బెలేం రోడ్‌మ్యాప్‌లో పేర్కొన్న 1.3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరడానికి ప్రపంచం మొత్తం కలిసి పని చేయాలి అని అన్నారు. వాతావరణ పరిరక్షణకు అభివృద్ధి చెందుతున్న దేశాలు

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## దక్షిణ నేపాల్‌లో కర్ఫ్యూ ఎత్తివేత

**ఖట్మండు :** హింసాత్మక సంఘటనల నేపథ్యంలో బుధవారం విధించిన కర్ఫ్యూను శుక్రవారం ఎత్తివేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ, అదుపులోనే ఉందని అధికారులు ప్రకటించారు. మార్కెట్లు, విద్యా సంస్థలు తెరుచుకున్నాయని, రవాణా సేవలు కూడా మొదలుకావడంతో జనజీవనం సాధారణమైందని పేర్కొన్నారు. బుధవారం సిమరా విమానాశ్రయంలో శాంతియుతంగా నిరసన చేస్తున్న 'జెన్ జి' (జెన్ జెడ్) యువకులపై ముగ్గురు సిపిఎన్–యుఎంఎల్ కార్యకర్తలు దాడి చేసినట్లు ఆరోపణలు రావడంతో ఉద్రిక్తత చెలరేగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 'జెన్ జి'లు, పదవీచ్యుతుడైన మాజీ ప్రధాని కెపి శర్మ ఓలి పార్టీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు చెరేగాయి. కనీసం పది మంది గాయపడ్డారు. యుఎంఎల్ నాయకులు శంకర్ పొఖ్రెల్, మహేష్ బస్నేత్‌ల సందర్శనకు వ్యతిరేకంగా ఈ యువకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరు 8న జరిగిన అణచివేతలో 76 మంది మరణాలకు ఆ పార్టీదే బాధ్యత అని వారు ఆరోపిస్తున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అధికారులు కర్ఫ్యూ విధించారు. ఇప్పుడు పరిస్థితి అదుపులో ఉందని, అందుకే కర్ఫ్యూ ఎత్తివేస్తున్నామని పోలీస్ అధికారులు ప్రకటించారు.

## వైట్‌హౌస్‌కు ఒక 'కమ్యూనిస్టు' వస్తున్నారు

### వైట్ హౌస్ ప్రెస్ సెక్రెటరీ లెవిట్ వ్యాఖ్య



**న్యూయార్క్ / వాషింగ్టన్ :** న్యూయార్క్ సిటీ కొత్త మేయర్‌గా ఎన్నికలైన జోహ్రాన్ మమ్దానిపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలైన్ లెవిట్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'వైట్‌హౌస్‌కు ఒక కమ్యూనిస్టు వస్తున్నారు' అని ఆమె వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎవరితోనైనా మాట్లాడేందుకు సిద్ధంగా ఉంటారని కొసమెరుపునిచ్చింది. నవంబర్ 4న ఎన్నికల్లో గెలిచిన తర్వాత, ట్రంప్‌ను కలుసుకోవడానికి మమ్దాని శుక్రవారం వైట్‌హౌస్‌కు వస్తారన్న వార్తపై లెవిట్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో అతిపెద్ద నగరానికి కమ్యూనిస్టు మేయర్‌ను ఎన్నుకున్నారంటూ ఆమె డెమోక్రాట్లపై విమర్శలు గుప్పించారు. అయితే, ట్రంప్ రాజకీయ భేదాలను పక్కనపెట్టి, 'బ్లూ స్టేట్స్', 'రెడ్ స్టేట్స్' అనే తేడా లేకుండా, ఎక్కడి ప్రజలకైనా సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటారని లెవిట్ అన్నారు. ఆ క్రమంలోనే మమ్దానితో ట్రంప్ భేటీ అవుతారని చెప్పిన ఆమె, సమావేశంలో ఏఏ అంశాలపై చర్చ జరుగుతుందనే వివరాలను మాత్రం వెల్లడించలేదు.

అంతకు ముందు మమ్దాని మీడియాతో మాట్లాడుతూ ట్రంప్‌తో అనే విషయాల్లో విభేదిస్తున్నప్పటికీ, న్యూయార్క్ ప్రజలకు ఉపయోగపడే అంశాల్లో, ఆయనతో కలిసి పనిచేస్తానని అన్నారు. న్యూయార్క్ నగరంలోని ఎనిమిదిన్నర మిలియన్ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడానికి ఎవరితోనైనా చర్చిస్తానని, కలిసి సంప్రదింపులు చేస్తానని ఆయన అన్నారు. దేశాధ్యక్షుడిని న్యూయార్క్ మేయర్ కలుసుకోవడం ఒక సంప్రదాయమని కూడా చెప్పారు. భారతీయ మూలాలున్న మమ్దాని న్యూయార్క్ మేయర్ పదవిని గెలుచుకోవడం ద్వారా, అమెరికాలో అతిపెద్ద నగరాన్ని నడిపే తొలి దక్షిణాసియా, తొలి ముస్లిం నాయకుడిగా చరిత్ర సృష్టించారు.

# నిన్న వైద్యం.. నేడు విద్య

### ట్రంప్ మరో వివాదాస్పద నిర్ణయం



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. వైద్య రంగానికి భారీగా నిధుల కోత విధించి, వేలాది మంది ఉద్యోగులపై వేటు వేసిన ట్రంప్ ఈసారి విద్యాశాఖకు సంబంధించిన ఓ ప్రణాళికను సిద్ధం చేశారు. 'దేశంలోని విద్యా వెనుకబాటుతనాన్ని నివారించడానికి ఏకైక పరిష్కారం' అంటూ ట్రంప్ చేపట్టిన మార్పుల వల్ల విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేసే ప్రమాదం ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకే వ్యవస్థకు భిన్నంగా వేరువేరు శాఖలు కలిసి పనిచేయాల్సి రావడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతాయని కొందరు విమర్శిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై ప్రభావం పడితే, దేశ సమాఖ్య వ్యవస్థ దెబ్బతింటుందని, విద్యా వ్యవహారాలు మరింత సంక్లిష్టమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంబంధిత వ్యవహారాల్లో ఎక్కువ భాగాన్ని శ్రమ, ఆరోగ్యం, విదేశాంగం అంతర్గత వ్యవహారాల శాఖలకు బదిలీ చేయాలన్నది ట్రంప్ కొత్త నిర్ణయంలోని ప్రధానాంశం. విద్యాశాఖ వైఫల్యాల కారణంగా, బాధ్యతలను ఇతర శాఖలకు కూడా అప్పగించాల్సి వస్తున్నదని ట్రంప్ ప్రభుత్వ వాదన. అయితే, ఈ నిర్ణయం వల్లఫెడరల్ ప్రభుత్వంతో సమన్వయం దెబ్బతింటుందని కొన్ని రాష్ట్రాలు అభిప్రాయపడుతున్నాయి. కాగా, విద్యాశాఖకు సంబంధించిన ట్రంప్ కొత్త ప్రణాళికపై రాజకీయంగా విభిన్న ప్రతిస్పందనలు వచ్చాయి. ఈ నిర్ణయం ఆర్థికంగా వెనుకబాటును ఎదుర్కొంటున్న విద్యార్థులకు తీవ్ర నష్టమని డెమోక్రాట్లు విమర్శించారు. అయితే, రిపబ్లికన్లు మాత్రం ఈ ప్రణాళికలను అధికార యంత్రాంగంపై ప్రభుత్వం సాధించిన గొప్ప విజయంగా అభివర్ణిస్తున్నారు. ఇలావుంటే, అధికార రిపబ్లికన్ పార్టీలోనే ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్య విద్యాశాఖను అనిశ్చితిలోకి నెడుతుందని పలువురు రిపబ్లికన్లు హెచ్చరిస్తున్నారు. కాగా, విద్యాశాఖ వైఫల్యాల కారణంగానే కొత్త నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని మంత్రి లిండా మెక్‌మహన్ చెబుతున్నారు. అయితే, పాత వ్యవస్థను మెరుగుపరిచే బదులు కొత్త నిర్ణయాలతో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారని విమర్శకులు ధ్వజమెత్తుతున్నారు. విద్యాశాఖ చట్టాలు, నిధుల సూత్రాలు వంటి సంక్లిష్ట విషయాల్లో నిపుణుల సలహాలు, సూచనలను ఇక ముందు అందుతాయో లేదనని పాఠశాల అధికారులు ఆందోళన చెందుతున్నారు. కొత్త శాఖలకు భారీ సంఖ్యలో విద్యా కార్యక్రమాలను నిర్వహించే సామర్థ్యం ఉందా? అన్న సందేహాలు కూడా ఉన్నాయి. శ్రమ శాఖకి 18 బిలియన్ డాలర్ల విలువైన టైటిల్ I కార్యక్రమాన్ని బదిలీ చేయడం వల్ల జిల్లాల్లో కల్లోలం సృష్టించవచ్చని మాజీ అధికారులు హెచ్చరిస్తున్నారు. అనేక పాఠశాలలు నిధులతో వచ్చే కొత్త నిబంధనలు ఏవో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అనేక ఫెడరల్ శాఖల్లో చెల్లాచెదురుగా ఉన్న విద్యా కార్యక్రమాలను ఏకీకృతం చేయడానికి 1979లో ప్రత్యేకంగా విద్యాశాఖ ఏర్పాటైంది. ఇప్పుడు ట్రంప్ నిర్ణయం కారణంగా పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ కొత్త ప్రణాళిక దేశ విద్యా వ్యవస్థను మెరుగుపరుస్తుందా లేదా మరింత గందరగోళంలోకి నెడుతుందా అన్నది ఇంకా స్పష్టంగా తెలియలేని పరిస్థితి.



## ఢాకాను వణికించిన భూకంపం

### నలుగురు మృతి.. దెబ్బతిన్న పలు భవనాలు

**ఢాకా :** బంగ్లాదేశ్ రాజధాని ఢాకా, దాని పరిసర ప్రాంతాలను శుక్రవారం భూకంపం వణికించింది. దీని తీవ్రత రిక్టార్ స్కేల్‌పై 5.7 మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. ఈ భారీ భూకంపంలో, ఒక నవజాత శిశువు సహా కనీసం నలుగురు మరణించారు. పలు భవనాలు దెబ్బతిన్నాయి, కొన్ని ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించాయి. ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అధికారుల సమాచారం ప్రకారం, ఢాకాలో ముగ్గురు, నారాయణ్‌గంజ్‌లో ఒకరు మరణించారు. దేశవ్యాప్తంగా కనీసం 50మందికి పైగా గాయపడ్డారని స్థానిక మీడియా తెలిపింది. బంగ్లాదేశ్ వాతావరణ విభాగం ప్రకారం, శుక్రవారం ఉదయం 10:38కి సంభవించిన భూకంపాన్ని ఎపిసెంటర్ ఢాకా ఈశాన్య అంచులోని నర్సింగ్‌డి ప్రాంతంలో, 10 కిలోమీటర్ల లోతులో చోటుచేసుకున్నట్టు గుర్తించారు.




# జూనియర్ అధికారికి అప్పగించే ప్రసక్తి లేదు

### జి20 అధ్యక్షత బాధ్యతను ఇవ్వడానికి నిరాకరిస్తున్న దక్షిణాఫ్రికా

**జోహాన్నెస్‌బర్గ్ :** అమెరికా నుంచి వచ్చిన జూనియర్ అధికారి చేతిలో జి20 అధ్యక్షత బాధ్యత అప్పగించబోమని దక్షిణాఫ్రికా తేల్చిచెప్పింది. రెండు రోజుల జి20 సదస్సు శనివారం ప్రారంభం కానుండగా, అమెరికా తరఫున మార్క్ డిలార్డ్ నేతృత్వంలో ఒక బృందం హాజరవుతున్నది. అయితే, ఒక జూనియర్ అధికారికి అధ్యక్ష బాధ్యతను ఎలా అప్పగిస్తామని దక్షిణాఫ్రికా వ్యాఖ్యానించారు. ఆ విధంగా చేయడం అంతర్జాతీయ ప్రోటోకాల్‌కు విరుద్ధమని అధ్యక్షుడు సిరిల్ రామఫోసా తరఫున ప్రతినిధి తెలిపారు. కాగా, ఈ వివాదం అమెరికా–దక్షిణాఫ్రికా మధ్య తాజా ఉద్రిక్తతలకు దారితీసింది. ఇటీవల కాలంలో రెండు దేశాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురించి రామఫోసా అవివేకంగా మాట్లాడుతున్నారంటూ వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అంతకు ముందు ట్రంప్ ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, దక్షిణాఫ్రికాలో తెల్లజాతి రైతులపై హింసాకాండ పెరుగుతున్నదని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను దక్షిణాఫ్రికా ప్రభుత్వంతోపాటు, నాయకులు కూడా ఖండించారు. ఇలావుంటే, అమెరికా ప్రతినిధి బృందం జి20 చర్చల్లో పాల్గొనకుండా 2026 సదస్సుకు అధ్యక్షత వహించనున్న కారణంగా, ఆ బాధ్యతను స్వీకరించడానికి మాత్రమే కింది స్థాయి అధికారి నేతృత్వంలో ఒక బృందం జోహాన్నెస్‌బర్గ్ చేరుకుంది. ఈ విషయాన్ని లెవిట్ ధ్రువీకరించారు. జోహాన్నెస్‌బర్గ్‌కు అమెరికా గైర్హాజరు కావాలని తొలుత నిర్ణయించుకుంచుకుందని దక్షిణాఫ్రికా వర్గాలు అంటున్నాయి.

అయితే, ఎవరూ రాకపోతే, ఖాళీ కుర్చీకే తదుపరి సదస్సు అధ్యక్ష బాధ్యతను అప్పగిస్తానని రామఫోసా స్పష్టం చేయడం వల్లే, పరువు దక్కించుకోవడానికి అమెరికా ఒక బృందాన్ని పంపిందని వ్యాఖ్యానిస్తున్నాయి. కానీ, ఆ బృందానికి అధికారాన్ని అప్పగించే ప్రసక్తి లేదని స్పష్టం చేస్తున్నాయి.

## కార్మిక సంఘాల పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

యూటీయూసీ సంయుక్తంగా పిలుపునిచ్చాయి. కార్మిక వ్యతిరేకయాజమాన్యం అనుకూల లేబర్ కోడ్లను ఏకపక్షంగా రుద్దే ప్రయత్నం... కార్మిక వర్గానికి కేంద్రం చేసిన మోసమని దుయ్యబట్టాయి. సంక్షోభంగా మారుతున్న నిరుద్యోగం, దిగిరాని ద్రవ్యోల్బణం పరిస్థితుల్లో ఇలాంటి నోటిఫికేషన్లు ఇవ్వడం శ్రామికులపై యుద్ధాన్ని ప్రకటించడమేనని వ్యాఖ్యానించాయి. ఆశ్రిత పెట్టుబడిదారులతో కుమ్మక్కై దేశాన్ని బానిసత్వం వైపునకు సర్కారు తీసుకెళుతోందని కార్మిక సంఘాలు విమర్శించాయి. లేబర్ కోడ్లు అమలు చేయొద్దంటూ డిమాండ్ ఉన్నప్పటికీ లెక్కచేయకుండా బీహార్ ఎన్నికల్లో విజయం మత్తులో ఎన్డీయే ప్రభుత్వం జోగుతోందని పేర్కొన్నాయి. ఈనెల 13, 20 తేదీల్లో కార్మిక సంఘాలు చేసిన విజ్ఞప్తులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశాయి. లేబర్ కోడ్లతో పాటు శ్రమ్ శక్తి నీతి2025 రద్దునకు డిమాండ్‌తో ఈనెల 26న తలపెట్టిన ఎస్‌కేఎంసీటీయూల ఉమ్మడి పోరు జయప్రదానికి పిలుపునిచ్చాయి. నిరసన తెలిపేందుకు నల్ల బ్యాడీలతో విధులకు హాజరు కావాలని కార్మికులకు సంఘాలు సూచించాయి. సోమవారం నుంచి గేట్ మీటింగులు, వీధి కూడళ్లలో సమావేశాలు వంటివి యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ సంక్షేమాన్ని తుంగలో తొక్కి బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నాలను ప్రతిఘటించాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. 20 కేంద్ర కార్మిక చట్టాలను రద్దు చేసి 'రాక్షస' కోడ్లను అమలు చేయడాన్ని ఖండించాయి. వీటి అమలు కార్మికుల జీవితాలు, జీవనోపాధిని చంపేయడమే అవుతుందని కార్మిక సంఘాలు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించాయి.

# 'తెలంగాణ - నార్త్ ఈస్ట్ కనెక్ట్' చిత్రోత్సవం

### తెలంగాణ - ఈశాన్య రాష్ట్రాల సినీ బంధానికి నాంది

### గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా.. 'తెలంగాణ - నార్త్ ఈస్ట్ కనెక్ట్' చిత్రోత్సవం ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రసాద్ ఐమ్యాక్స్‌లో 'టెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్' పేరుతో రెండు రోజుల చిత్రోత్సవం హైదరాబాద్ మహానగరంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరయ్యారు. ఆయన చిత్రోత్సవాన్ని ప్రారంభించి, త్రిపుర చిత్రమైన 'యార్వింగ్' తొలి ప్రదర్శనను వీక్షించారు. ఈ చిత్రానికి జాతీయ పురస్కార గ్రహీత ఫాదర్ జోసెఫ్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సాంస్కృతిక, సాంకేతిక, యువశక్తి, మహిళా సాధికారత, ఐటీ, ఆరోగ్య రంగాల్లో తెలంగాణ ఈశాన్య రాష్ట్రాల మధ్య మరింత సుదీర్ఘ భాగస్వామ్యానికి ఈ వేదిక దోహదం చేస్తుందని తెలిపారు. ఈశాన్య భారత వైవిధ్యం, తెలంగాణ చైతన్యం కలిస్తే మరింత బలోపేతమైన జాతీయ ఐక్యత సాధ్యమవుతుందని చెప్పారు. సినిమా సరిహద్దులు లేని భాష అని, అది ప్రాంతాలు, భాషలు దాటి మనుషులను ఏకం చేస్తుంది అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. డిజిటల్ మీడియా కారణంగా దూర అడవి ప్రాంతాల వరకూ తెలుగు సినిమాలు చేరుతున్నాయని, ఇది సినీ ప్రభావానికి నిదర్శనమన్నారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్. ప్రియాంక అతిథులను స్వాగతించి, టిజిఎఫ్‌డిసి లక్ష్యాలు, కార్యక్రమాల గురించి వివరించారు.

ఈ చిత్రోత్సవం 'తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్' కార్యక్రమంలో కీలక భాగమని, త్రిపుర, మణిపూర్, అస్సాం, మెఘాలయ, సిక్కిం, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 12 చిత్రాలను ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నట్టు వెల్లడించారు. జాతీయ అవార్డులు పొందిన చిత్రాలతో పాటు, తెలంగాణ గ్రామీణ జీవనశైలి, కళారూపాలు, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే తెలుగు చిత్రాలను క్యూరేట్ చేసి ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. రెండు రోజులపాటు 12 చిత్రాలు ప్రదర్శించనున్నారు. ఈశాన్య రాష్ట్రాల నుండి తారా (సిక్కిం నెపాలీ), కుకి (హిందీ), ఓనాతా (ఖాసీ మెఘాలయ), ఈఖోయిగి యుమ్ (మణిపూర్), రాడార్, పక్షులు (అస్సాం) ఉన్నాయి. తెలంగాణ నుండి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రశంసలు పొందిన నా బంగారుతల్లి, పొట్టేల్, మల్లేశం, బలగం చిత్రాలు ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమములో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, టిజిఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దానా కిషోర్, ఐ అండ్ పిఆర్ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్, ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులు, దర్శకులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

## పున:పరిశీలించాలి

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించింది. అదే పరిస్థితే వస్తే ప్రజల సార్వభౌమాధికారంతో పాటు రాష్ట్రాల విశేషాధికారాలు దెబ్బతింటాయని పేర్కొంది. ఎవరి నుంచి జవాబుదారీతనాన్ని కోరేందుకు ఆస్కారం ఉండబోదని సిపిఐ తెలిపింది. తమిళనాడు రాష్ట్ర గవర్నర్ దీర్ఘకాలం బిల్లులు పెండింగ్ పెట్టి, రాష్ట్రపతికి సిఫార్సు చేయడాన్ని గుర్తు చేసింది. సుప్రీం కోర్టు వైఖరి మారకపోతే ఎన్నికైన ప్రతినిధుల ద్వారా ప్రజల అభిప్రాయాలు, వారి హక్కులు, ఆకాంక్షలకు కీలకమైన న్యాయ రక్షణ బలహీనమవుతుందని పేర్కొంది. విధానపరమైన జాప్యం/విచక్షణాత్మక నిష్క్రియకు అవకాశం ఇవ్వొద్దని కోరింది. తాజా తీర్పును పున:పరిశీలించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని సిపిఐ విజ్ఞప్తి చేసింది.

## శాంతి చర్చలు జరపండి

(మొదటి పేజీ తరువాయి)

చంపడాన్ని'' ఖండిస్తూ 'బూటకపు ఎన్‌కౌంటర్ల వ్యతిరేక పోరాట కమిటీ' ఆధ్వర్యంలో వామపక్ష, రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల ప్రతినిధులు హైదరాబాద్ లిబర్టీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ''ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని, కగార్ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా పోరాడాలని, ఎన్‌కౌంటర్లను ఆపాలని, అటవీ సంపదను కాపాడాలని'' వారు ప్లకార్డులను ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే తాము దేశ ద్రోహులమా?, లేదా ప్రజాధనాన్ని, ఖనిజ సంపదను కొల్లగొట్టే పాలకులు, వేల కోట్ల రూపాయలకు ఎదిగే అంబానీలు, అదానీలు దేశ భక్తులా అని ఆయన నిలదీశారు. మావోయిస్టులను చంపినంత మాత్రానా సమస్య పరిష్కారం కాదని, ముందుగా వారు పోరాటం చేస్తున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్ల పట్ల చాలా మంది ఆవేదనకు ప్రతీకగా తాము నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వ అరాచకం తాండవిస్తోందని, రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రశ్నించినందుకు తనపై బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల సోషల్ మీడియాలో స్పందిస్తూ, తనను కూడా చంపాలంటూ పోస్టులు పెడుతున్నారన్నారు. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహాలో ప్రజలే మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు.

టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామిక స్వభావానికి బూటకపు ఎన్‌కౌంటర్లు ఒక గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. కార్పొరేట్ శక్తులకు కేంద్రం మితిమీరిన లాభాలను కల్పిస్తుందని, దీనిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? అని మండిపడ్డారు. రాజ్యాంగానికి, చట్టానికి విరుద్ధంగా బూటకపు ఎన్‌కౌంటర్ చేసినందుకు అధికారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ మావోయిస్టులను చంపేస్తామనడం రాజ్యాంగం, చట్టానికి వ్యతిరేకమన్నారు. మనుషులను చంపే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఎవరిచ్చారని ఆయన నిలదీశారు. కేంద్రం వెంటనే కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసి, ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు చనిపోయారని, అలాంటిది పోలీసులకు ఎందుకు గాయాలు కాలేదని, ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో బుల్లెట్ గాయాలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శివర్గ సభ్యులు సాధినేని వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ దేశంలో మావోయిస్టులను మట్టుపెట్టడం కాకుండా ముందుగా దేశంలో అవినీతి, ఆకలి లేకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని, అందులో భాగంగానే అడవులలోని ఆదివాసులకు అండగా ఉన్న మావోయిస్టులను హత్య చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో హత్యాకాండను, మానవ వేటను కొనసాగిస్తోందని మండిపడ్డారు.

ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగం, చట్టం ప్రకారం ప్రాణాలు తీసే అధికారం రాజ్యానికి లేదన్నారు. ఒక కేంద్ర మంత్రిగా మావోయిస్టులను చంపేస్తామనడం ఏ రాజ్యభాష అని నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్ అవుతారా? అని నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునే బాధ్యత కమ్యూనిస్టులు, ప్రజాతంత్ర వాదులు, ప్రజాస్వామికవాదులు, పౌర సమాజంపై ఉందన్నారు.

హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ ఎన్‌కౌంటర్‌పై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఖనిజాలు కలిగిన 1600 ఎకరాల భూమిని కేంద్ర ప్రభుత్వం కేవలం ఒక రూపాయికే అప్పగించిందన్నారు. కేంద్రం టార్గెట్ పెట్టాల్సింది పేదరికం, అవినీతి, రైతుల ఆత్మహత్య నివారణపై అని సూచించారు.

ప్రొఫెసర్ లక్ష్మణ్, ఎస్‌యుసిఐ(కమ్యూనిస్టు) నాయకులు మురహరి, సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, సిపిఐ(ఎంఎల్) చంద్రన్న గ్రూప్ నాయకులు భాస్కర్ మాట్లాడుతూ ప్రశ్నించే వారికి పౌర సమాజం మద్దతుగా నిలువకపోతే భవిష్యత్తులో అధికారంలో ఉన్నవారిని ప్రశ్నిస్తే ఇంట్లోనే ఎన్‌కౌంటర్లు జరిగే ప్రమాదం పొంచివుంటుందని హెచ్చరించారు. ఇప్పటివరకు పట్టుకన్న మావోయిస్టులను తక్షణమే కోర్టులో హాజరుపర్చి చట్టపరంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ అధ్యక్షత వహించగా, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, ఆర్.అంజయ్య నాయక్, ఎస్.చాయాదేవి, నేదునూరి జ్యోతి, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ, కార్యదర్శి బి.వెంకటేశం, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చలపతిరావు, పిఒడబ్ల్యు నాయకురాలు వి.సంధ్య, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెట పోటు

(మొదటి పేజీ తరువాయి)

రిటర్న్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టడం వంటి ఎన్నో సంస్కరణలు ఇందులో ఉన్నాయని కార్మిక శాఖ ప్రకటించింది. భారతదేశంలోని అనేక కార్మిక చట్టాలు స్వాతంత్రానికి ముందు, స్వాతంత్ర్య ప్రారంభదశలో అంటే 1930–1950 మధ్య రూపొందాయని, ఆ సమయంలో ఆర్థిక వ్యవస్థ, పని ప్రపంచం ప్రాథమికంగా భిన్నంగా ఉన్నాయని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ వెల్లడించిన నివేదిక పేర్కొంది. ఇటీవలి దశాబ్దాలలో చాలా ప్రధాన ఆర్థిక వ్యవస్థలు తమ కార్మిక నిబంధనలను నవీకరించి, ఏకీకతం చేసినప్పటికీ, భారతదేశం 29 కేంద్ర కార్మిక చట్టాలలో విస్తరించి ఉన్న విచ్ఛిన్నమైన, సంక్లిష్టమైన, అనేక భాగాలలో పాత నిబంధనల కింద పనిచేయాల్సి వస్తున్నదని తెలిపింది. అందుకే వీటన్నింటినీ క్రోడీకరించి, నాలుగు కొత్త స్మృతులుగా తీసుకువస్తున్నట్లు వివరించింది. పాత చట్టాలు మారుతున్న ఆర్థిక వ్యవస్థల వాస్తవాలకు, అభివద్ధి చెందుతున్న ఉపాధి రూపాలకు అనుగుణంగా లేవని, కార్మికులు, పరిశ్రమ రెండింటికీ అనిశ్చితిని, భారాన్ని పెంచుతున్నాయని తెలిపింది. నాలుగు కార్మిక కోడ్‌ల అమలు వలసరాజ్యాల యుగం నిర్మాణాలను దాటి ఆధునిక ప్రపంచ ధోరణులకు అనుగుణంగా ఉండవలసిన ఈ దీర్ఘకాల అవసరాన్ని పరిష్కరిస్తుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ కోడ్‌లు కార్మికులు, సంస్థలు రెండింటినీ శక్తివంతం చేస్తాయని, రక్షిత, ఉత్పాదక, అభివద్ధి చెందుతున్న పని ప్రపంచంతో అనుసంధానం చేసి సరికొత్త శ్రామిక శక్తిని నిర్మిస్తాయని, మరింత పోటీతత్వంతో, స్వావలంబనతో కూడిన దేశానికి మార్గం సుగమం చేస్తాయని మంత్రిత్వ శాఖ చెప్పుకొచ్చింది. దేశ స్వావలంబన కోసమే : మంత్రి మాండవీయ కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, ఎక్స్‌లో ఒక పోస్ట్ చేస్తూ, ప్రతి కార్మికుడికి గౌరవం కల్పించేందుకు నేటి నుండి, దేశంలో కొత్త కార్మిక కోడ్‌లు అమలులోకి వచ్చాయని, ఇది ప్రభుత్వ హామీ అని పేర్కొన్నారు. కార్మికులందరికీ సకాలంలో కనీస వేతనాల హామీ, యువకులకు నియామక పత్రాల అందజేత, మహిళలకు సమాన వేతనం, గౌరవ హామీ, 40 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత హామీ, ఒక సంవత్సరం ఉద్యోగం తర్వాత స్థిరకాలిక ఉద్యోగులకు గ్రాట్యుటీ హామీ, 40 ఏళ్లు పైబడిన కార్మికులకు ఉచిత వార్షిక ఆరోగ్య పరీక్షల హామీ, ఓవర్‌టైమ్‌కు రెట్టింపు వేతనాల హామీ వంటి ఎన్నో హామీలు ఈ కోడ్‌లు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. దానితో పాటు, ప్రమాదకర రంగాలలోని కార్మికులకు 100 శాతం ఆరోగ్య భద్రత, అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం కార్మికులకు సామాజిక న్యాయం హామీని కూడా ఈ కోడ్‌లు నిర్ధారిస్తాయని మాండవీయ చెప్పారు. ఈ సంస్కరణలు కేవలం సాధారణ మార్పులు మాత్రమే కాదని, శ్రామిక శక్తి సంక్షేమం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న ప్రధాన అడుగు అని ఆయన ఆయన నొక్కి చెప్పారు.

''ఈ కొత్త కార్మిక సంస్కరణలు స్వావలంబన భారతదేశం వైపు ఒక ముఖ్యమైన అడుగు. 2047 నాటికి అభివద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యానికి కొత్త ఊపునిస్తాయి'' అని అన్నారు. ద్విసభ్య ట్రిబ్యునల్స్ ద్వారా వివాదాల సత్వర పరిష్కారానికి యంత్రాంగం, భద్రత ప్రమాణాల పరిశీలనకు జాతీయ వత్తి భద్రత, ఆరోగ్య (ఓఎస్‌హెచ్) బోర్డు ఏర్పాటు వంటి అంశాలూ ఇందులో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం సవివరమైన నిబంధనలు, పథకాల రూపకల్పనకు సంప్రదింపులను ప్రారంభిస్తుందని, ఈ క్రమంలో అవసరమైన చోట ప్రస్తుతం అమల్లో ఉన్న పాత చట్టాలే వర్తిస్తాయని చెప్పారు. అయితే పాత చట్టాలు రద్దయినట్లేనని కార్మిక శాఖ ప్రకటనలో స్పష్టంగా ఉంది. సామాజిక భద్రత కవరేజి 2015లో 19 శాతం ఉండగా, 2025లో అది 64 శాతానికి పెరిగిందని మంత్రి మాండవీయ తెలిపారు.

**కార్మికులకు గొప్ప శక్తినిస్తుంది :**

ప్రధాని మోదీప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ కార్మిక కోడ్‌లపై వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. ''నేడు, మన ప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేసింది. ఇది స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అత్యంత సమగ్రమైన, ప్రగతిశీల కార్మికఆధారిత సంస్కరణలలో ఒకటి. ఇది మన కార్మికులకు గొప్పగా శక్తినిస్తుంది. ఇది పనినీ, పని సంస్కతిని గణనీయంగా సులభతరం చేస్తుంది. అదే సమయంలో వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహిస్తుంది (ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్) అని మోదీ పేర్కొన్నారు.

ఈకోడ్‌లు సార్వజనీన సామాజిక భద్రతకు బలమైన పునాదినిస్తుందన్నారు. సకాలంలో వేతనాల చెల్లింపు, సురక్షితమైన పని ప్రదేశాలను కల్పించడంతోపాటు మన ప్రజలకు, ముఖ్యంగా నారీ శక్తి, యువ శక్తికి వేతన అవకాశాలకు బలమైన పునాదిగా పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు. ''ఇది కార్మికుల హక్కులను పరిరక్షించే, భారతదేశ ఆర్థిక వద్ధిని బలోపేతం చేసే భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తుంది. ఈ సంస్కరణలు ఉద్యోగ సష్టిని పెంచుతాయి. ఉత్పాదకతను పెంచుతాయి. వికశిత్ భారత్ వైపు మన ప్రయాణాన్ని వేగవంతం చేస్తాయి'' అని ప్రధాన మంత్రి అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నేడు ‘తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర సదస్సు’

గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు తెలంగాణ గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గౌరవ అతిథులుగా మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్ రెడ్డి పాల్గొంటారని ఆయన గురువారం తెలిపారు.

# రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణం

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపణలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హెచ్‌ఐఎల్‌టిపి) పేరుతో సిఎం రేవంత్ రెడ్డి రూ.5 లక్షల కోట్ల విలువైన భూకుంభకోణానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపి మాలోతు కవితతో కలిసి కెటిఆర్ మాట్లాడుతూ హెచ్‌ఐఎల్‌టిపి పాలసీ కింద భూమి కొనుగోలు చేసే పారిశ్రామికవేత్తలు భవిష్యత్తులో తీవ్రమైన న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటారని, ఈ లావాదేవీలు నిలబడవన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలోనికి వస్తే ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, క్రమబద్ధీకరణను రద్దు చేసి, పూర్తి స్థాయి విచారణ జరిపించి, కుంభకోణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామని, ఈ స్కామ్‌లో పాల్గొనే ఎవరినీ వదిలిపెట్టబోమని కెటిఆర్ హెచ్చరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండే రాజకీయ మధ్యవర్తులు, బంధువులు, రియల్ ఎస్టేట్ గ్రూపులకు లబ్ధి చేకూర్చేందుకే హెచ్‌ఐఎల్ టిపిని రూపొందించారన్నారు. పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ, మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్‌ఐఎల్‌టిపి వేలాది ఎకరాల పారిశ్రామిక భూములను అత్యంత తక్కువ ధరకు బహుళ ఉపయోగ విలువైన రియల్ ఎస్టేట్‌గా మార్చేందుకు రూపొందించారని ఆరోపించారు. ఇది కేవలం పాలసీ కాదని, రూ.5 లక్షల కోట్ల స్కామ్ కోసం రూపొందించిన బ్లూప్రింట్ అని అన్నారు. బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, అజామాబాద్‌తో సహా హైదరాబాద్‌లోని కీలకమైన పారిశ్రామిక క్లస్టర్లలో ఉన్న సుమారు 9,292 ఎకరాల విలువైన భూమిని క్రమబద్ధీకరించేందుకు ఈ పాలసీ ప్రయత్నిస్తోందన్నారు. ఆ భూములను రేవంత్ కేవలం ప్రభుత్వ విలువలో 30 శాతానికే అప్పగించాలని చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు, ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100 శాతం నుండి 200 శాతం అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశామన్నారు. ఉద్యోగాల కల్పన, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు పారిశ్రామిక భూములను చాలా తక్కువ ధరలకు లేదా ఉచితంగా కేటాయించారని కెటిఆర్ అన్నారు. ఈ పాలసీని ప్రభుత్వం ఆమోదించే వేగం అత్యంత అనుమానాస్పదంగా ఉందని అన్నారు. లక్షల కోట్ల విలువైన భూముల అంశంలో ఎందుకీ తొందర? ఎందుకీ వేగవంతమైన ప్రక్రియ? అని కెటిఆర్ ప్రశ్నించారు. పాలన కంటే రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకే సిఎం ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు.

# కెటిఆర్ చెప్పేవి పచ్చి అబద్ధాలు

ఆ భూములకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించింది
ఇంపాక్ట్ ఫీజు వసూలు చేస్తాం
ఆ డబ్బంత ప్రభుత్వ ఖజానాలోకి వెళ్తుంది.. ఇందులో కుంభకోణం ఎక్కడ?: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశ్రామిక భూముల కన్వర్షన్ కోసం ఇంపాక్ట్ ఫీజు వసూలు చేయాలని నిర్ణయిస్తే దానిని రూ.5 లక్షల కోట్ల కుంభకోణంగా చిత్రీకరిస్తూ కెటిఆర్ దుష్ప్రచారం సాగిస్తున్నారని ఐటి, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండిపడ్డారు. ప్రభుత్వం పరిశ్రమలకు లీజుకిచ్చిన భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ ‘ఫ్రీహోల్డ్ రైట్స్’ పేరిట 2023 ఆగస్టులో మూడు జిఓలు ఇచ్చింది వారి ప్రభుత్వ హయాంలో కాదా అని ఆయన ప్రశ్నించారు. సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ ఆరోపణలను ఆధారాలతో తిప్పికొట్టారు. కెటిఆర్ చెబుతున్న 9,292 ఎకరాల భూమిలో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసి కేటాయించినది 4740 ఎకరాలే. మిగిలిన భూమి రోడ్లు, డ్రెయినేజి లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించడం జరిగిందన్నారు. ఆజమాబాద్, కూకట్‌పల్లి, హఫీజ్‌పేటల్లోని పరిశ్రమల భూములను ఫ్రీ హోల్డ్ పేరిట యాజమాన్య హక్కులు కల్పించినది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. కూకట్‌పల్లి, ఆజమాబాద్, హఫీజ్ పేట భూములకు సంబంధించి ఇండస్ట్రీస్, కామర్స్ డిపార్టుమెంట్, జిఒ ఎంఎస్ 19, 20, 21లను 2023 ఆగస్టు 29న జారీ చేసిందని స్పష్టం చేశారు. ఇప్పుడు ఆ భూములకు కన్వర్షన్ అవకాశం కల్పిస్తున్నామన్నారు. 30, 50 శాతం స్లాబులతో ఇంపాక్టు ఫీజు నిర్ణయిస్తూ ఈనెల 17న జరిగిన కేబినెట్‌లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. 2023లో ఎన్నికలకు నాలుగు నెలల ముందు ఫ్రీహోల్డ్ బిఆర్‌ఎస్ ప్రభుత్వం హక్కులు కల్పించారు. అప్పుడు ఎన్ని లక్షల కోట్లు వసూలు చేసుకున్నారో చెప్పాలన్నారు. ఆ జిఒల విషయం దాచిపెట్టి ప్రభుత్వంపై నిరాధార నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. అసలు కుంభకోణమో, స్కామో జరిగి ఉంటే వారి హయాంలోనే జరిగి ఉండాలన్నారు. పరిశ్రమల యజమానులు హక్కులు పొందాలంటే రిజిస్ట్రేషన్ విలువపై 100 శాతం చెల్లించాలని, అవి చేతులు మారితే 200 శాతం కట్టాలని జిఒలు ఇచ్చారు. ఆ భూములు మరొకరి పరమైతే హక్కులు ఎలా కల్పిస్తారో వారికే తెలియాలన్నారు. వారిచ్చిన యాజమాన్య హక్కులు ఉన్నవారికి భూ వినియోగ మార్పిడి చేసుకునే అవకాశం మాత్రమే మేం కల్పించామన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పరిశ్రమల కమిషనర్లు పరిశ్రమల సంఘాలతో పలు దఫాలుగా చర్చలు జరిపిన మీదట 30 శాతం, 50 శాతం స్లాబులను ప్రతిపాదించారు. సిఎం సోదరులు అగ్రిమెంట్లు చేసుకున్నారని నోటికొచ్చినట్లు మాట్లాడారు. వారెవరూ ప్రభుత్వంలో లేరు. పదేండ్లు మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా అభూత కల్పనలు ప్రచారం చేయడం దుర్మార్గం. ఆధారాలేవైనా బయటపెడితే ప్రభుత్వం ఏమి చేయాలో అది చేస్తుంది. ఇప్పటికైనా ఆయన ఆలోచనల్లో మార్పు రావాలని కోరుకుంటున్నాం. కన్వర్షన్ ఇంపాక్ట్ ఛార్జీల వల్ల రూ.4 వేల నుంచి రూ.5వేల కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్నాం. అది కూడా అందరూ దరఖాస్తు చేసుకుంనే.యాజమాన్య హక్కులు లేని వారు కన్వర్షన్ కు దరఖాస్తు చేసుకోలేరన్నారు. ఒఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలను వెలుపలకు తరలిస్తామని మొదటి నుంచి చెబుతున్నాం. గాలి, నీరు కాలుష్యం లేకుండా చేయడానికి పరిశ్రమలను బయటకు తరలిస్తున్నాం. పరిశ్రమలను ఆకర్షించడానికి కొన్ని రాష్ట్రాలు ఎకరం భూమిని 99 పైసలకే కేటాయించడం చూస్తున్నాం. విద్యుత్తు, పన్ను రాయితీలను 20 ఏళ్ల పాటు ఇస్తున్నారు. మన దగ్గర భూముల విలువ ఎక్కువ, లభ్యత కూడా తక్కువ. అయినా పరిశ్రమలకు అనుకూలమైన ఎకోసిస్టం ఉండాలని అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. పరిశ్రమలు, ఐటి కంపెనీలు వస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. రాష్ట్రం కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది.


# ఏడాదిన్నరలో ‘చేనేత’కు రూ.వెయ్యి కోట్లు

కొండా లక్ష్మణ్ బాపూజీ కీర్తి ప్రతిష్ఠలు పెరిగేలా ఐఐహెచ్‌టి
ఐఐహెచ్‌టి ప్రయోగశాల ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ ఐఐహెచ్‌టిని తీర్చిదిద్దుతామని మంత్రి తుమ్మల ప్రకటించారు. నాంపల్లి చేనేత భవన్‌లో శుక్రవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ సంస్థ ప్రయోగశాలలను చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వెంకటగిరిలో ఐఐహెచ్‌టి ఉంది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ చేనేత రంగానికి మేలు జరిగేలా కేంద్ర ప్రభుత్వంతో సీఎం రేవంత్ రెడ్డి ఒప్పించి ఐఐహెచ్‌టి మన రాష్ట్రానికి సాధించారు. పూజ్యులు కొండా లక్ష్మణ్ బాపూజీ గౌరవార్థం ఐఐహెచ్‌టి పేరును ఆయన పేరున పెట్టామని, బాపూజీ కీర్తి ప్రతిష్ఠలు పెరిగేలా ఐఐహెచ్‌టి దేశంలోనే మంచి ఇన్స్టిట్యూట్‌గా నిలవాలని అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేనేత రంగానికి మహర్దశ పట్టనుందని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఏడాదిన్నరలోనే వెయ్యి కోట్లు చేనేత రంగానికి నిధులు విడుదల చేశారు. ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్‌తో చేనేత కార్మికులు పని కోసం ఎదురు చూడకుండా చేతినిండా పని కల్పించినట్లు తెలిపారు. రూ.50 కోట్లతో వేములవాడలో యార్న్‌డిపో ఏర్పాటు చేసి ఇప్పటికే 2368 మెట్రిక్ టన్నుల నూలు మరమగ్గాల సంఘాలకు సరఫరా చేయడం జరిగినది, రూ.168 కోట్లతో చేనేత అభయ హస్తం పథకంలో భాగంగా నేతన్న పొదుపు, నేతన్న భరోసా పథకాలను అమలు చేయడం జరుగుతుంది. నేతన్న పొదుపు కింద రూ.304 కోట్లు, మరమగ్గాల కార్మికులకు పొదుపు కింద రూ.68 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. మరమగ్గాల కార్మికులకు నూలు సబ్సిడీ పథకం కింద ఉన్న బకాయిలు రూ.40 కోట్లు చెల్లించడం జరిగింది. చేనేత కార్మికుల వ్యక్తిగత రుణమాఫీ రూ.33 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఐబొమ్మ రవిపై ఐదు కేసులు..






**ప్రజాపక్షం/హైదరాబాద్:** సినిమా పైరసీ వ్యవహారంలో ప్రధాన నిందితుడైన ఐబొమ్మ రవికి సైబర్ క్రైమ్ పోలీసులు భారీ షాక్ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఒక కేసులో అరెస్టు చేసి విచారిస్తున్న పోలీసులు, అతడిపై నమోదైన మిగతా నాలుగు కేసుల్లోనూ అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు తాజాగా కోర్టులో పిటి వారెంట్ దాఖలు చేశారు. పైరసీ సెల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు రవిని మొదట అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ కేసులో అతడిని ఐదు రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే పలువురు సినీ నిర్మాతలు రవిపై ఫిర్యాదు చేయడంతో మరో నాలుగు కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా పైరసీతో పాటు బెట్టింగ్ యాప్‌ల ప్రమోషనల్ వ్యవహారంలోనూ రవిపై కేసు నమోదైంది.

**రెండో రోజు కస్టడీలో..** ఐదు రోజుల పోలీసు కస్టడీలో భాగంగా, రెండో రోజు రవిని సైబర్ క్రైమ్ పోలీసులు విచారిస్తున్నారు. ఈ పైరసీ కార్యకలాపాలకు ఎవరు సహకరించారు, అతడి వెనుక ఎవరైనా కీలక వ్యక్తులు ఉన్నారా, లేదా అతనే ఈ వ్యవహారాన్ని మొత్తం నడిపాడా వంటి కోణాల్లో లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ వ్యవహారంలో అతడికి సాంకేతిక సహకారం అందించిన వ్యక్తుల వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. మిగతా కేసుల్లోనూ త్వరలో అరెస్టు చేసి, ఈ మొత్తం పైరసీ నెట్‌వర్కును ఛేదించాలని పోలీసులు భావిస్తున్నారు. తొలి రోజు కస్టడీలో ఆదాయం, నెట్‌వర్కు సోర్స్ లాంటి సాంకేతిక విషయాలపై వివరాలు రాబట్టిన విషయం తెలిసిందే.

# ‘ధరణి’ దాష్టీకాలతో రైతులు సతమతం

రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ధరణి’ దాష్టికాల వల్లనే భూ సమస్యలతో రైతులు సతమతమయ్యారని, సమస్యల పరిష్కారానికి మార్గం లేక కోర్టులు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో జరిగిన తప్పిదాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైన రుద్దడం తగదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి సంబంధించి భూ రికార్డులను, ఆధార్ కార్డులను, బ్యాంకు ఖాతా నంబర్లను అమెరికా కంపెనీకి (టేరాసా) అప్పగించారని గుర్తు చేశారు. ధరణి స్థానంలో భూ భారతి చట్టం తెచ్చి, యుద్ధ ప్రాతిపదికన ఆ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారని, తద్వారా కంప్యూటర్ల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతాంగం వద్దకే, రెవెన్యూ అధికారులను పంపించి, వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారన్నారు. సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించి, అప్పటి ప్రభుత్వం పరిష్కారాన్ని గాలికి వదిలేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతిలో ఈ విషయాన్ని చేర్చడంతో పాటు హైకోర్టు స్టే ఎత్తివేసేలా కృషి చేసిందని, సాదాబైనామా క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించిందని కోదండరెడ్డి వివరించారు. ప్రైవేట్ చేతుల్లో ఉన్న ధరణి పోర్టల్‌ను ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌ఐసికి అప్పగించిందని కోదండరెడ్డి అన్నారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఎప్పటికప్పుడు చట్టం అమలులో ప్రభుత్వానికి తగిన సలహాలు సూచనలు ఇస్తుందన్నారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, ఒక తహసిల్దార్ హత్యకు గత ప్రభుత్వం కారణమైందన్నారు.

# ‘భూమేత’గా మారిన భూ భారతి

మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అవినీతి, అక్రమాలు, అడ్డగోలు వసూళ్లతో భూ భారతి ‘భూ మేత’గా మారిందా అని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. ‘ధరణి’పై అడ్డగోలుగా మాట్లాడి, ‘భూ భారతి’ని తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, భూముల సమస్యలు పరిష్కరించడంలో ఎందుకు విఫలమైందని ప్రశ్నించారు. భూ భారతి, భూ హారతిగా మారి కాంగ్రెస్ నాయకులకు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు మంగళ హారతి అయిందా అని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూముల రికార్డులు సరిచేస్తామని, రైతుల హక్కులు కాపాడతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, రెండేళ్లుగా కుంటి సాకులు చెబుతూ రిజిస్ట్రేషన్లు చేయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటుందని హరీశ్‌రావు ఆరోపించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. తహసిల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ కార్యాలయాల్లో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

# ఉత్సాహభరితంగా తెలంగాణ నార్త్ ఈస్ట్ స్పోర్ట్స్ ఫెస్టివల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ–నార్త్ ఈస్ట్ కనెక్ట్ కార్యక్రమా భాగంగా నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్టివల్ తెలంగాణలో ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది. గోపీచంద్ అకాడమీలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలకు గవర్నర్ విష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. తెలంగాణ వర్సెస్ నార్త్ ఈస్ట్ జట్ల మధ్య బాయ్స్, గరల్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాలు, తెలంగాణకు గ్రామీణ క్రీడలకు ఉన్న బలమైన నేపథ్యం, రెండు ప్రాంతాల క్రీడా సంస్కృతికి సామీప్యతను సూచిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, గోపీచంద్ అకాడమీ సిబ్బంది, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.తదనంతరం గచ్చిబౌలి స్టేడియంలో నార్త్ ఈస్ట్–తెలంగాణ స్పోర్ట్స్ ఎంటర్ ప్రెన్యూర్స్, క్రీడా జర్నలిస్టుల సమావేశం నిర్వహించబడింది. అదేవిధంగా ఈశాన్య రాష్ట్రాల అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతల ఆధ్వర్యంలో ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, సెపక్ తక్రా, టెన్నిస్ తదితర క్రీడా విభాగాల్లో స్పెషల్ కోచింగ్ క్లినిక్స్ నిర్వహించారు. గచ్చిబౌలి మెయిన్ స్టేడియంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీలలో, మహిళల విభాగంలో తెలంగాణ జట్టు 2–0 గోల్స్‌తో ఈశాన్య రాష్ట్రాల జట్టుపై విజయం సాధించింది. పురుషుల విభాగంలో ఈశాన్య రాష్ట్రాల జట్టు 2–0 తో తెలంగాణపై విజయం నమోదుచేసింది. ఈ పోటీలను ఇండియన్ ఫుట్‌బాల్ లెజెండ బూటియా, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి ప్రారంభించారు. విజేతలకు మిజోరం క్రీడా శాఖ మంత్రి లౌలింగ్ లోవా హమారా, క్రీడల సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ఈశాన్య రాష్ట్రాల అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు బహుమతులు అందజేశారు.

# రాష్ట్రంలో 32 మంది ఐపిఎస్‌ల బదిలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం 32 మంది ఐపిఎస్‌లను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఐపిఎస్ అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి.

| అధికారి పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| దేవేంద్ర సింగ్ చౌహాన్ | మల్టీజోన్ II | అదనపు డిజి పర్సనల్ |
| జె.పరిమళ హన నూతన్ | హైదరాబాద్ జాయింట్ సిపి | సిఐడి డిఐజి |
| డాక్టర్ చేతన మైలాబతుల | ఎస్‌పి ఉమెన్ సేఫ్టీ | పోలీసు అకాడమీ |
| కె.నారాయణ రెడ్డి | ఎస్‌పి వికారాబాద్ | మహేశ్వరం డిసిపి |
| పి.వి.పద్మజ | డిసిపి మల్కాజిగిరి | ఎస్‌పి ఎర్నోటిక్స్ బ్యూరో |
| డా.పి.ఎస్.ఎస్.గణపత్‌రావు | ఎస్‌పి సిఐడి | ఎస్‌పి నాగర్ కర్నూల్ జిల్లా |
| ఖరే కిరణ్ ప్రభాకర్ | ఎస్‌పి భూపాలపల్లి | సౌత్‌జోన్ డిసిపి హైదరాబాద్ |
| చెన్నూరి రూపేష్ | ఎస్‌పి నార్కోటిక్స్ బ్యూరో | డిసిపి ఐటి హైదరాబాద్ |
| డా.శబరీష్ పి | ఎస్‌పి ములుగు | ఎస్‌పి మహబూబాబాద్ |
| నితికా పంత్ | టిఎస్ఎస్‌పి కమాండెంట్ | ఎస్‌పి ఆసిఫాబాద్ |
| ఆర్. గిరిధర్ | ఎస్‌పి వనపర్తి | ఎస్‌పి నార్కోటిక్స్ బ్యూరో |
| స్నేహమెహ్రా | డిసిపి సౌత్ జోన్ | ఎస్‌పి వికారాబాద్ |
| గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ | వెయిటింగ్ | టాస్క్‌ఫోర్స్ డిసిపి |
| కేకన్ సుధీర్ రామ్‌నాథ్ | వెయిటింగ్ | ఎస్‌పి ములుగు |
| సిరిశెట్టి సంకీర్త్ | ఎడిసి గవర్నర్‌గా | ఎస్‌పి జయశంకర్ |
| పాటిల్ కాంతిలాల్ సుభాష్ | వెయిటింగ్ | ఎడిసి గవర్నర్ |
| బి.రాంరెడ్డి | ఎస్‌పి సిఐడి | డిసిపి పెద్దపల్లి |
| శ్రీధర్ | ఎస్‌పి ఇంటెలిజెన్స్ | డిసిపి మల్కాజ్‌గిరి |
| అవినాష్ కుమార్ | ఎస్‌డిపిఒ భైంసా | అదనపు ఎస్‌పి కొత్తగూడెం |
| కాజల్ | ఎస్‌డిపిఒ ఉట్నూర్ | అదనపు ఎస్‌పి అదిలాబాద్ |
| కంకాల రాహుల్ రెడ్డి | ఎస్‌డిపిఒ భువనగిరి | అదనపు ఎస్‌పి భువనగిరి |
| శేషాద్రిని రెడ్డి సూరుకొంటి | ఎస్‌డిపిఒ వేములవాడ | అదనపు ఎస్‌పి జగిత్యాల |
| శివమ్ ఉపాధ్యాయ | ఎస్‌డిపిఒ ఏటూరునాగారం | అదనపు ఎస్‌పి ములుగు |
| రాజేష్ మీనా | అదనపు ఎస్‌పి నిర్మల్ | ఎస్‌డిపిఒ భైంసా |
| పి.మౌనిక | అదనపు ఎస్‌పి దేవరకొండ | అదనపు ఎస్‌పి అదిలాబాద్ |
| మనన్ భట్ | ఎఎస్‌పి గ్రేహౌండ్స్ | ఎస్‌డిపిఒ ఏటూరు నాగారం |
| పత్తిపాక సాయికిరణ్ | ఎఎస్‌పి గ్రేహౌండ్స్ | అదనపు ఎస్‌పి నిర్మల్ |
| రుత్విక్ సాయికొట్టె | ఎఎస్‌పి గ్రేహౌండ్స్ | అదనపు ఎస్‌పి వేములవాడ |
| యాదవ్ వసుంధర | ఎఎస్‌పి గ్రేహౌండ్స్ | ఎసిపి సత్తుపల్లి |
| ఎస్.శ్రీనివాస్ | వెయిటింగ్ | ఎస్‌పి ట్రాన్స్‌కో |
| డి.సునీత | వెయిటింగ్ | ఎస్‌పి వనపర్తి |
| కె. గుణశేఖర్ | వెయిటింగ్ | డిసిపి క్రైమ్స్ రాచకొండ |

# విశ్వగురువుగా భారత్ నిలవాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విశ్వ గురువు భారత్‌గా నిలవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నెంబర్ వన్ దేశంగా నిలుస్తుందన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి కార్యాలయంలో శుక్రవారం ఆత్మనిర్భర్ భారత్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో రామచంద్రరావు, బిజెపి నేతలు చంద్రశేఖర్ తివారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ ప్రజలు తమ దినచర్యలో వాడే ప్రతి వస్తువు కూడా స్వదేశీ అయ్యేలా, చేనేత కళాకారులు, చేతి వృత్తుల వారిని ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమాలలో చెప్పిన ప్రతి అంశాన్ని జిల్లా స్థాయి, మండల స్థాయిలకు తీసుకెళ్లాలని, ప్రజల్లో స్వదేశీ ప్రాముఖ్యతపై అవగాహన కలిగించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. చైనా, అమెరికా తమ ఉత్పత్తులను పెంచి, ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయని విమర్శించారు.


**బిజెపిలో చేరిన వాల్మీకి మెతార్ సమాజం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌లాల్**


ఈ వర్క్‌షాప్‌లో రాంచందర్ రావు సమక్షంలో వాల్మీకి మెతార్ సమాజానికి చెందిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌లాల్ బిజెపి పార్టీలో చేరారు. వాల్మీకి సమాజం షెడ్యూల్ కులాలలో అత్యంత ఆచారవంతమైన, కఠినంగా హిందూ సంప్రదాయాలను పాటించే సమాజమన్నారు. తమ ధర్మాన్ని మార్చుకోకుండా హిందూ మతాన్ని కాపాడిన సముదాయం వారందరిని రాంచందర్ రావు ప్రశంసించారు.



# మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఓ కట్టుకథ

హిడ్మాను పట్టుకుని కాల్చి చంపారు
23న దేశ వ్యాప్త నిరసన దినం
లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ





**ప్రజాపక్షం/ఖమ్మం :** మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఓ కట్టుకథ అని పోలీసులు అరెస్టు చేసి నిరాయుధులను పట్టుకొచ్చి కాల్చి చంపారని భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు ఆరోపించింది. ఈ మేరకు కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఒక లేఖను విడుదల చేసింది. దేశంలో ఫాసిస్టు దమనకాండ కొనసాగుతుందని హత్యలతో ప్రజలను భయకంపితులను చేసి కార్పొరేట్ ప్రయోజనాలను నెరవేరుస్తున్నారని లేఖలో ఆరోపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలో ఎస్ఐబి నవంబర్ 15న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారుణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హిడ్మాను ఆయన భార్య రాజేను మరికొంతమంది చికిత్స నిమిత్తం విజయవాడ వెళ్లగా అదుపులోకి తీసుకున్నారని లేఖలో పేర్కొన్నారు. ఒక ద్రోహి అందించిన సమాచారం మేరకే హిడ్మాను అరెస్టు చేశారని ఆ తర్వాత మారేడుమిల్లి తీసుకువచ్చి కాల్చి చంపారని ఎన్‌కౌంటర్ జరిగిందనేది అతిపెద్ద అబద్ధమని మావోయిస్టు పార్టీ లేఖలో పేర్కొంది. తుది వరకు పోరాడి ఉద్యమ స్ఫూర్తిని సిద్ధాంత పటిమను చూపించిన హిడ్మాకు మావోయిస్టు పార్టీ శిరస్సు వంచి శ్రద్ధాంజలి ఘటిస్తుందన్నారు. ఉద్యమ అభివృద్ధి క్రమంలో ప్రజల అవసరాలను తెలుసుకుని మసులుకున్న నాయకునిగా కీర్తి గడించారని లేఖలో పేర్కొన్నారు. పాలకవర్గ మీడియా కొంతమంది గోదీ మేధావులు హిడ్మాను దుర్మార్గుడిగా చిత్రీకరణ చేశారని హత్య చేసిన తర్వాత కూడా హిడ్మాపై అసత్య ప్రచారం చేస్తున్నారని లేఖలో తెలిపారు. ప్రజల హృదయాల్లో హిడ్మా స్థానం చెరిగిపోనిదని కొమరం భీం, గేంది సింగ్, గుండాదూర్ లతో పాటు అనేక మంది యోధుల మాదిరే హిడ్మా కూడా చరిత్రలో నిలిచిపోతాడని లేఖలో పేర్కొన్నారు. హిడ్మా సహ పలువురు మావోయిస్టుల హత్యాకాండను నిరసిస్తూ నవంబర్ 23న దేశ వ్యాప్త నిరసన దినం పాటించాలని పిలుపునిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలన్నింటిని తన గుప్పెట్లో పెట్టుకుని భారీ స్థాయి మోసాలు చేస్తూ విజయాలు సాధిస్తున్న మోడి ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.


**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
ఫోన్ నం. 0878-2243438, ఫ్యాక్స్ నం. 0878-2240624. ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
నం. E1/DB/MCK/Furniture/Quotations/2025-26 (సీల్డ్ కొటేషన్ ప్రకటన) తేదీ: 19.11.2025
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కోసం కంప్యూటర్ టేబుల్, సైడ్ కర్టెన్‌తో పేషెంట్ ఎగ్జామినేషన్ టేబుల్, 4 చదరపు కాళ్లతో 1mm పర్ఫొరేటెడ్ షీట్ సీట్ చైర్ మరియు పౌడర్ కోటింగ్ సరఫరా మరియు డెలివరీ పనుల కోసం SoR రేట్లు లేని వస్తువుల కోసం సీల్డ్ కొటేషన్ నోటీసు. **కొటేషన్ స్వీకరించిన చివరి తేదీ:** 24.11.2025, సాయంత్రం 04.00 గంటలకు. మరిన్ని వివరాలకు దయచేసి సంప్రదించండి: 7032989954
సం/-కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.
DIPR R.O. No. : 11084-PP/CL/ADVT/1/2025-26 Date: 21-11-2025

**శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము**
మట్టపల్లి మహాక్షేత్రము, మఠంపల్లి మండలము, సూర్యాపేట జిల్లా.
టెండర్-కం-బహిరంగ వేలముల ప్రకటన
లేఖ నెం.29/యస్.యల్.యన్.యస్.డి/2024, తేది: 21-11-2025
ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది: 27-11-2025 గురువారము రోజున మ.2:00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి. | కాలపరిమితి |
|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు | 3,00,000/- | 18-01-2026 17-01-2027 |

కావున పైన తెలిపిన టెండర్-కం-బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9849539594 సంప్రదించగలరు.
ఇట్లు,
చెన్నూరు మట్టపల్లిరావు, అనువంశిక ధర్మకర్త, మొబైల్ నెం.9490626253
బి.జ్యోతి, కార్యనిర్వహణాధికారి, మొబైల్ నెం. 7981570939
DIPR R.O. No. : 11139-PP/CL/ADVT/1/2025-26, Date: 21-11-2025

**వికారాబాద్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం**
వికారాబాద్ జిల్లా
నం.MCV/E/2029/2025 (ఆసక్తి వ్యక్తీకరణ) తేదీ: 20.11.2025
**15వ FC గ్రాంట్లు, SFC, TUFIDC, UIDF మరియు ఏవైనా ఇతర గ్రాంట్ల కింద వికారాబాద్ మున్సిపాలిటీలోని అన్ని అభివృద్ధి పనులు అంటే CC రోడ్లు, డ్రెయిన్లు, భవనాలు, పార్కులు & స్మశానవాటిక అభివృద్ధి, డంప్ యార్డ్ అభివృద్ధి** మొదలైన వాటి కోసం అంచనాలు మరియు DPRలను తయారు చేయడానికి ఆసక్తి ఉన్న సంస్థలు / ఆర్గనైజేషన్లు / ప్రఖ్యాత ఏజెన్సీల నుండి సీల్డ్ కొటేషన్లను ఆహ్వానించబడింది.
ఏజెన్సీలు రూ.10,000/- మొత్తానికి డిపాజిట్ నాన్-రీఫండబుల్ DDని మరియు రూ.500/- షెడ్యూల్ ఖర్చును **వికారాబాద్ మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్ పేరు** మీద 27.11.2025న లేదా అంతకు ముందు సంబంధిత పత్రాలతో సమర్పించాలి. **టెండర్ షెడ్యూల్ జారీ :** 28.11.2025 ఉదయం 11.00 గంటలకు ప్రారంభించి, మధ్యాహ్నం 3.30 గంటలకు మూసివేస్తారు. అదే రోజు సాయంత్రం 4:00 గంటల తర్వాత తెరవబడుతుంది.
మరిన్ని వివరాల కోసం దయచేసి కార్యాలయ వేళల్లో మున్సిపల్ కమిషనర్ (9849905910)/ మున్సిపల్ ఇంజనీర్ (9849907661)ను సంప్రదించండి.
సం/- కమిషనర్, వికారాబాద్ మున్సిపాలిటీ
DIPR R.O. No. : 11112-PP/CL/ADVT/1/2025-26, Date: 21-11-2025

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం): పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించారు. సిద్దాపురం, రాఘవాపురం, కూరెళ్ళ, రహీంఖాన్ పేట, కొరటికల్ గ్రామాలలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ లావణ్య, ఎంపీఓ శ్యాం కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నోముల వెంకన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. శుక్రవారం ఆయన మిర్యాలగూడ మీదుగా వెళ్తుండగా నార్కట్‌పల్లి అద్దంకి రహదారిపై బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామన్నారు. రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ , రవాణాశాఖ అధికారులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. బ్లాక్ స్పాట్స్‌ను తగ్గించి రోడ్డు ప్రమాదాలను నివారిస్తామన్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని నివారించడానికి అంతర్గత చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 50 వాహనాల్లో వచ్చిన ధాన్యాన్ని వెనక్కి పంపించామన్నారు. వాడపల్లి, సాగర్ వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించి తనిఖీలు చేస్తున్నామన్నారు. చాలా చోట్ల హైస్పీడ్, రాంగ్ రూట్, లైటింగ్ సమస్యలతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నా రు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.





## మత్స్యకారుల అభివృద్ధికి కృషి

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: మత్స్య కారుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం ఎంఎల్‌ఏ విద్యుత్ శాఖ, మత్స్యశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి మండల పరిధిలోని గాజీనగర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన, పెండ్లీపాకులలో 9లక్షల చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రభుత్వం 2027లోపు నక్కలగండి, ఎస్ఎల్‌బిసిలను పూర్తి చేయడంతో పాటు పెండ్లీపాకుల ప్రాజెక్టు సామర్థ్యాన్ని రెండు టీఎంసిలకు పెంచనుందని పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 241 చెరువలలో రూ. కోటిన్నర వ్యయంతో చేపపిల్లలను వదులుతున్నామని అన్నారు. పెండ్లీపాకుల ప్రాజెక్టు ద్వారా ముంపునకు గురయ్యే గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ఇండ్ల స్థలాలను ఇవ్వడంతో పాటు అక్కడ ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించనున్నట్లు తండావాసులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో విద్యుత్ డిఈ విద్యాసాగర్, ఏడిఈ సైదులు, మత్స్యశాఖ ఏడి రాజారాం, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్, నాయిని మాధవరెడ్డి, లక్కీదాస్‌నాయక్, వేమన్‌రెడ్డి, అబ్బనబోయిన శ్రీనివాస్‌యాదవ్, గంధం సురేష్, శంకర్ నాయక్, శక్రునాయక్, మాడ్గుల యాదగిరి, మధునాయక్, బాలునాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయం చేకూర్చేలా ప్రణాళికలు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : వ్యర్థాల ద్వారా ఆదాయం చేకూర్చేలా మున్సిపల్ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు, శానటరి ఇన్‌స్పెక్టర్లతో వ్యర్థాల నిర్వహణపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిలలో సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌లలో గాని, వ్యర్థాలను వేరు చేసే కేంద్రాలలో గాని ఘన వ్యర్థ పదార్థాలలోని తడి, పొడి, ప్లాస్టిక్, రీసైక్లింగ్ చేసే వాటిని వేరు చేసి మట్టిలో సహజంగా విచ్ఛిన్నమయ్యే పదార్థాల ద్వారా ఎరువులు తయారు చేసి ఆదాయం చేకూర్చుకోవాలని తెలిపారు. అలాగే అన్ని మున్సిపాలిటిలలో వ్యర్థాలను వేరు చేసే కేంద్రాలు కార్యకలాపాలు నిర్వహించేలా చూడాలని సూచించారు. పర్యావరణానికి హాని కల్గించే విషపదార్థాలు, పారిశ్రామిక వ్యర్థాలు లాంటి కాలుష్య నీరు చెరువులలో, కాలువులలో కలవకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, మున్సిపల్ కమీషనర్లు హన్మంతరెడ్డి, రమాదేవి, శ్రీనివాస రెడ్డి, మున్వర్ అలీ, ఇంజనీరింగ్ అధికారులు, శానటరీ ఇన్‌స్పెక్టర్లు హాజరైనారు.

## నేడు గీతపనివారల సంఘం రాష్ట్ర సదస్సు

### రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : నేడు హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరుగు తెలంగాణ గీత పనివారల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని గీతపనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్ పిలుపునిచ్చా రు. శుక్రవారం ధర్మభిక్షం భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది వెనుకబడిన గౌడ కులాలకు చెందిన ప్రజలు గీతవృత్తిలో జీవిస్తున్నారని అన్నారు. 1957లో మహబూబాబాద్ మండలం గార్ల గ్రామంలో కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం నేతృత్వంలో గీతపనివారల సంఘం ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుంటి అటు ఆంధ్ర ప్రాంతం ఇటు తెలంగాణ, రాయలసీమలోని గీతపనివారలను సమీకరించి కల్లుగీత వృత్తి లో కాంట్రాక్టు, హర్రాజు, విధానానికి వ్యతిరేకంగా పోరాడిందని తెలిపారు. కల్లు సొసైటీలు కావాలని, త్రివిధ పన్నుల విధానం రద్దు చేయాలని, వన పెంపకానికి భూమి, వృత్తిలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా, వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని, వృత్తి ఆధునీకరణ పరిశ్రమగా రూపకల్పన చేయాలని మహత్తర పోరాటాలు నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు సవతి తల్లిగానే వ్యవహరిస్తున్నాయని జిఓలు, సర్క్యూలర్స్ కాగితాలకే పరిమితం అవుతున్నాయి అన్నారు. ప్రకృతి పాణ్యం కల్లు, నీరాలను ప్రోత్సహించాల్సిందిపోయి మద్యం, బెల్ట్ షాపు దు కాణాలు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో గీత కార్మికులకు చెల్లించవల్సిన రూ.13 కోట్లకు పైగా శాంక్షన్ అయిన నిధులను విడుదల చేయకపోవడం వల్ల చెట్లపై నుండి మరణించిన కుటుంబాలు, గాయాలపాలైన కుటుంబాలు కష్టాల కడలి ఈదుతున్నారని తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని, సూర్యాపేట జిల్లాకు ధర్మబిక్షం పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో గీతకార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# పేదల పక్షాన పోరాడేది సిపిఐ

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
### డిసెంబర్ 26న ఖమ్మంలో 100 ఏళ్ల ముగింపు ఉత్సవాలు



ప్రజాపక్షం/కోదాడ (అనంతగిరి) : పేదల పక్షాన నిరంతరం పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి నేటికి భారత గడ్డపై 100 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో జరిగే సిపిఐ ముగిం పు ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల చరిత్రను ప్రజానీకానికి చాటేందుకు 100 ఏళ్ల ముగిం పు సభ విజయవంతానికి ఈనెల 15న గద్వాల్‌లో ప్రారంభమైన బస్సుజాత శుక్రవారం అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు జాతాకు డప్పులు, బాణా సంచాలతో పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో భారీ బైక్ ర్యాలీతో స్తూపం వద్ద అమరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటగా గర్జించిన పార్టీ సిపిఐ అన్నారు. 100 ఏళ్ల ఉత్సవాల సందర్భంగా పార్టీ ఆవిర్భవించిన కాన్పూర్‌లో గత సంవత్సరం 26న ప్రారంభమై దేశవ్యాప్తంగా ఉత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయని అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్, నారాయణరెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, ఎస్‌కె సాయిబెల్లి, ఎస్‌కె లతీఫ్, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సృజన, మండల కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శి లాలు, యువజన సంఘం అధ్యక్షులు మండలం దేగ వీరయ్య, రైతు సంఘం నాయకులు నాగేశ్వరరావు, నాగభద్రం, శాఖ కార్యదర్శి వీరబాబు, మండల కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# బిజెపి ఆర్ఎస్ఎస్ విధానాలతో కులమతాల మధ్య చిచ్చు

### ఉపాధి కల్పనలో విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



ప్రజాపక్షం/మోటకొండూరు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ విధానాలతో మత విద్వేషాలు సృష్టిస్తూ హిందూ ముస్లింల మధ్య అన్నదమ్ముల లాంటి సంబంధాలను చెడగొడుతూ ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నాయని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీలు అన్నారు. ఈనెల 15న ఆదిలాబాద్ జిల్లా నుండి ప్రారంభమైన సిపిఐ కళాజాతకు శుక్రవారం మండలంలోని ముత్తిరెడ్డి గూడెం, మోటకొండూరు మండల కేంద్రంలో బతుకమ్మలతో మహిళా కార్యకర్తలు, సిపిఐ శ్రేణులు బైక్ ర్యాలీలతో ఘనంగా జన నీరాజనాలతో స్వాగతం పలికారు. మొదటగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించినారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటూ నియామకాలు చేపట్టక యువకులు దొంగల్లా మారుతున్నారని గంజాయి మద్యం లాంటి డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టుల ప్రోత్బలంతో చట్టం చేసి పేద కూలీలకు వంద రోజులు పని కల్పించిందని, ప్రస్తుత బీజేపీ సర్కార్ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ క్రమంగా ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. ఉపాధి పథకం కొనసాగింపుకై గ్రామీణ ప్రాంతాలలో కార్మికులు, కర్షకులు సంఘటితం అవ్వాలని, రోజుకు రూ.700 కూలీ, ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ విధానాన్ని అమలు పరుస్తున్నాయని తిప్పికొట్టేందుకు కార్మికులు, కర్షకులు సంఘటితమై సిపిఐ పార్టీ అడుగుజాడలో సాగాలని, డిసెంబర్ 26న జరిగే ఖమ్మం బహిరంగ సభకు ప్రజలు అభిమానులు భారీగా తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డిజి నరెంద్ర ప్రసాద్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కేతరాజు ఉప్పలయ్య, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు, యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, ఏఐటియు సి జిల్లా ప్రదాన కార్యదర్శి యండి ఇమ్రాన్, జిల్లా మహిళ సమాఖ్య కార్యదర్శి బండి జంగమ్మ, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉప్పుల శాంతి కుమార్, మండల సిపిఐ కార్యదర్శి గాదేగాని మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల మహిళ కార్యదర్శి మంచాల రాధమ్మ, సినియర్ నాయకులు రేగు సిద్దయ్య, చెక్క వెంకటేశ్, పల్లా వెంకన్న, సూదగాని వెంకన్న, శేంషుద్దీన్, శెనిగల భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చెంచుల చెంతకే

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
### ఆదెమ్మ ఫిర్యాదుతో ఎమ్మెల్యే, జిల్లా అధికార యంత్రాంగం సహా తండా సందర్శన



ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సీరియస్ గా ప్రజాలవద్దనుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు.ఇంతలో నల్లగొండ జిల్లా,తిరుమలగిరి సాగర్ మండలం,నెల్లికల్ చెంచు వాని తండాకు చెందిన ఆదెమ్మ ఒక పిటీషన్‌ను జిల్లా కలెక్టర్‌కు సమర్పించింది. అందులో ప్రధానంగా తమ తండా లో ఆధార్ కార్డులు, వివిధ ధ్రువపత్రాలు లేనందున తమ తాండవాసులందరూ ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నామని, మారుమూల గిరిజన ప్రాంతంలో ఉండే తమకు ప్రభుత్వలబ్ధి అందటం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సావధానంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఒక చెంచు మహిళ సుదూర ప్రాంతం నుండి నల్లగొండకు వచ్చి సమస్యలను చెప్పడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నేరుగా నెల్లికల్ చెంచు వాని తండాకే వెళ్లి చెంచు తండావాసుల సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించారు.వెంటనే శుక్రవారం జిల్లా అధికారులతో సహా శాసనసభ్యులు కుందూరు జయ వీర్ రెడ్డితో కలిసి నెల్లికల్ చెంచుతాండకి చేరుకున్నారు. చెంచు వాని తాండ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,వాటి పరిష్కారానికి జిల్లా కలెక్టర్ సావధానంగా విన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదెమ్మ ప్రజావాణిలో తన దృష్టికి తీసుకొచ్చిందని, సమస్యల పరిష్కారానికి చెంచులు నల్లగొండకు వచ్చిఇబ్బందులు ఎదుర్కోకూడదన్న ఉద్దేశంతో జిల్లా అధికారులందరిని తీసుకొని తానే శాసన సభ్యులతో సహా చెంచు తాండకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. తాగునీటి బోర్ మోటర్ మరమ్మతు చేయించాలని, అలాగే ఇతర సమస్యలన్నింటిని పరిష్కరించడంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా తండాలో 72 మంది ఆధార్ అప్డేషన్ చేయగా,21 మందికి కొత్త ఆధార్ కార్డులను ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు ఆధార్, మీసేవ, ఇతర సేవలకు సంబంధించిన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.





## పేదల పక్షాన నిరంతరం ఉద్యమాలు

ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) : భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 26న ఖమ్మం జిల్లాలో నిర్వహించే 100 సంవత్సరాల భారీ ముగింపు సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బాసరలో నవంబర్ 15న ప్రారంభమై ఈనెల 24 వరకు జరుగుతున్న బస్సుయాత్ర సందర్భంగా మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల పక్షాన ఉండి పేద ప్రజల కోసం పోరాటాలు చేస్తుందని అన్నారు. ఎప్పటికీ పేదల పక్షాన ఉండి పేదల సమస్యలపై పోరాటం చేయడానికి భారత కమ్యూనిస్టు పార్టీ ముందుంటుందని వారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈనెల 15న రాష్ట్రవ్యాప్తంగా ప్రచార జాత ఆదిలాబాద్ బాసర నుండి బయలుదేరి మండల కేంద్రంలోకి చేరుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగోని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, చెడ చంద్రయ్య, జంగమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాలు, సుంకరి హరిచంద్ర, మండల కార్యదర్శి వెంకటేశం, దయాకర్ రెడ్డి, లక్ష్మీ నరసయ్య, సుల్తాన్ పురుషోత్తం పాల్గొన్నారు.

## దేశ విముక్తికి రాజీలేని పోరాటాలు

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



ప్రజాపక్షం/గుండాల : ఈనెల 15న ఆదిలాబాద్ జిల్లా బాసర నుండి ప్రారంభమైన సిపిఐ పార్టీ చేపట్టిన ప్రచార జాత శుక్రవారం గుండాల మండల కేంద్రానికి చేరుకుంది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లా ఖాద్రి, రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డిజి నరేంద్ర ప్రసాద్‌లకు సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కళాజాతకు ఘన స్వాగతం పలికారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన పార్టీ సిపిఐ అని అన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అని బ్రిటిష్ వారి నుండి దేశ విముక్తి కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్నందునే ఆనాడు పార్టీపై నిషేధం విధించారని ఆమె పేర్కొన్నారు. సిపిఐ మండల కార్యదర్శి రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర, రాష్ట్ర నాయకులు శ్రీరాములు, సహాయ కార్యదర్శులు చంద్రయ్య, సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఇమ్రాన్, ప్రజానాట్యమండలి నాయకులు ఉప్పల య్య, మండల కార్యవర్గ సభ్యులు దయాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, కొమురయ్య, జోసఫ్, బక్కయ్య, సత్యనారాయణ, శ్రీను, స్వామి పాల్గొన్నారు.

## పద్మశాలీల అభివృద్ధికి సహకరించాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పద్మశాలీల అభివృద్ధికి ఉద్యోగుల సంఘ సహాయ సహకారాలు అందించాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన అధ్యక్షుడు నల్ల శ్రీనివాస్ కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పట్టణంలోని జిల్లా కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గా యేశాల విశ్వ కుమార్,అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చిలుకూరి వెంకటేశం, కోశాధికారిగా పున్న వేణుగోపాల్,ఉపాధ్యక్షులుగా మిర్యాల వేంకటపతి, రాపోలు రవి,ఆనందపు సత్యనారాయణ,బీమనపల్లి దుర్గయ్య,పొట్టబత్తుల జ్యోతి, మిర్యాల సుధాకర్,సహాయక కార్యదర్శిగా వేషాల శ్రీదేవి,గంజి నారాయణ, యేశాల శివ,గంజి వెంకన్న, గోషిక శివ కుమార్,గంజి ధనుంజయ, చేరిపల్లి శ్రీనివాస్,ప్రచార కార్యదర్శిగా గంజి నవీన్ కుమార్,ఆర్గనైజేషన్ సెక్రెటరీగా తిరందాసు సంతోష్ కుమార్, దామోదర్,గంజి ఉపేందర్,పగిడిమర్రి శివ కుమార్,దునుక జగదీశ్వర్,జెల్ల ఉమలతోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ప్రభుత్వ దృష్టికి విద్యారంగ సమస్యలు

### సిపిఐ బస్సు జాత నాయకత్వానికి ఎఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ వినతి




ప్రజాపక్షం/మోత్కూర్ : విద్యారంగ సమస్యలను, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని 100 సంవత్సరాల సిపిఐ బస్సు జాత నాయకత్వానికి ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా సమితి పక్షాన వినతిపత్రం అందజేశారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రానికి చేరుకున్న సిపిఐ 100 ఏళ్ల ప్రచార బస్సు జాత నాయకత్వానికి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ అన్ని ఓకే దఫాలో విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థులకు పెరిగిన కాస్మోటిక్ చార్జీలు వెంటనే చెల్లించాలని, మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఏర్పాటుకు సహకరించాలని బస్సు జాతకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు కామ్రేడ్ పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ వలి ఉల్లా ఖాద్రి, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పెండింగ్ స్కాలర్‌షిప్లు, ఫీజు రియంబర్స్మెంట్స్ చెల్లించుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యారంగ సమస్యల పరిష్కారానికి సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్, జిల్లా నాయకులు సూరారం జానీ, కళ్యాణ్, బెల్లి శ్రీకాంత్, చిప్పలపల్లి వంశి కుమార్, బన్నీ మోత్కూర్, అడ్డ గూడూరు మండల నాయకులు రాంపక చందు, సోహిత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత, రక్షణలో పోలీసులు నిరంతర కృషి

### జిల్లా ఎస్పి కె. నరసింహ



ప్రజాపక్షం/సూర్యాపేట : పోలీసులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల భద్రత రక్షణలో నిరంతరం కృషి చేయాలని జిల్లా ఎస్పి కె నరసింహ దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. గత నెలలో జరిగిన నేరాల స్థితిగతులను సమీక్షించారు అనంతరం కేసు దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రవేశపెడుతున్న అత్యాధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకొని కేసుల ధర్యాప్తులో వేగంగా పనిచేయాలని సూచించారు. నూతన సాంకేతికత గురించి అవగాహన కల్పించారు. నేర నిరూపణలో సిబ్బంది సాంకేతిక సామర్థ్యం కలిగి ఉండాలని, ఫిర్యాదులపై త్వరగా స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేరుకోవాలన్నారు. రాత్రిళ్ళు పెట్రోలింగ్ పటిష్టంగా ఉండడంతో పాటు కేసులు పెండింగ్ లేకుండా వేగంగా దర్యాప్తు చేయాలన్నారు. కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా పనిచేయాలని, పోక్సో కేసుల్లో, మహిళా సంబంద కేసుల్లో వేగంగా ధర్యాప్తు చేసి కోర్టులతో సమన్వయంగా పనిచేసి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని వారి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఒక్క ప్రాణం కూడా పోకుండా సిబ్బంది పనిచేయాలని తెలిపారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ వాహనదారులను ప్రజలను రోడ్డుభద్రత పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు. నేరాల నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఎక్కువ మొత్తంలో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలను, వ్యాపారులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ హరిబాబు, ఇన్‌స్పెక్టర్లు ప్రతాప్ లింగం, రామకృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, నరసింహారావు, రాజశేఖర్, వెంకటయ్య, ఎస్ఐలు, ఐటి కోర్ సిబ్బంది, డిసిఆర్‌బి సిబ్బంది ఉన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టండి: అమర్‌జిత్ కౌర్

**న్యూఢిల్లీ:** కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టాలని, పోరాడి సాధించుకున్న చట్టాలను నీరుగార్చవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కేంద్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాన 20 అంశాలతో కూడిన పత్రాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సమర్పించారు. 202627 బడ్జెట్‌పై సంప్రదింపుల కోసం ఆర్థిక మంత్రి అధ్వర్యంలో శుక్రవారం జరిగిన చర్చల్లో ఏఐటీయూసీ కార్యదర్శి కౌర్ పాల్గొన్నారు. సుంకాల బెదిరింపులు పెరుగుతున్న దృష్ట్యా దేశీయ డిమాండ్‌ను పెంచేందుకు తక్షణ చర్యలను డిమాండ్ చేశారు. కేంద్ర పథకాల లెక్కా పత్రాలు సక్రమంగా ఉండేలా చూడాలని, పార్లమెంటులో ప్రవేశపెట్టే ఆడిట్ నివేదికలు తగ్గుతుండటాన్ని గమనించాలని సూచించారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ కవరేజిఅర్హతా పరిధి పెంచాలని కోరారు. కార్మికుల వేతనాలు, కనీస పింఛన్ పెంచాలన్నారు. జన్ వికాస్ చట్టం ద్వారా కార్మిక చట్టాలు, బాయిలర్ల చట్టం కింద నేరాలు శిక్షార్హంగా ఉండాలన్నారు.

## నెహ్రూ రచనలు చరిత్ర మాత్రమే కాదు...

### భారతదేశ పరిణామశీల మనస్సాక్షికి నిదర్శనం : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ రచనలు కేవలం చరిత్ర మాత్రమే కాదని, అవి భారతదేశ పరిణామశీల మనస్సాక్షికి నిదర్శనమని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య ప్రయాణాన్ని అర్థం చేసుకోవాలనుకునే ఎవరికైనా ఆయన మాటలు శక్తివంతమైన దిక్సూచిగా మిగిలిపోతాయన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ సెలెక్టెడ్ వర్క్స్ డిజిటలైజేషన్ పూర్తయిన సందర్భంగా రాహుల్ గాంధీ పైవిధంగా వ్యాఖ్యానించారు. జవహర్‌లాల్ నెహ్రూ సెలెక్టెడ వర్క్స్ ఇప్పుడు 100 వాల్యూమ్‌ల మొత్తం సెట్‌తో ఆన్‌లైన్‌లో ఉందని, అందులో దాదాపు 35,000 పత్రాలు, దేశ తొలి ప్రధాన మంత్రికి సంబంధించిన దాదాపు 3,000 దృష్టాంతాలు ఉన్నాయన్నారు. ఈ చర్యను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే కూడా ప్రశంసించారు.

'వాస్తవాలు... వాస్తవాల.. మీ ఇష్టానుసారంగా అవి అదృశ్యం కావు' అన్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ భారతదేశం కోసం ఆయన సాధించిన అద్భుతమైన విజయాల గురించి ఉద్దేశపూర్వక వక్రీకరణ, తప్పుడు సమాచారం ఉన్న యుగంలో, సత్యం, భావితరాల కోసం నెహ్రూ రచనలను డిజిటలైజ్ చేయడం ప్రశంసనీయమని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. నెహ్రూ రచనలు కేవలం చరిత్ర మాత్రమే కాదు, అవి భారత దేశం అభివృద్ధి చెందుతున్న మనస్సాక్షికి సంబంధించిన రికార్డు అని రాహుల్‌గాంధీ అన్నారు. మన దేశ ప్రజాస్వామ్య ప్రయాణాన్ని, దేశ ధైర్యం, సందేహాలు, కలలు అర్థం చేసుకోవాలనుకునే ఎవరికైనా ఆయన మాటలు శక్తివంతమైన దిక్సూచిగా మిగిలిపోయాయని పేర్కొన్నారు. ఈ వారసత్వం ఇప్పుడు తెరిచి శోధించదగినదిగా అందరికీ ఉచితంగా లభించడం పట్ల సంతోషంగా ఉన్నానన్నారు. ఇది విస్తరిస్తూనే ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్ (జెఎన్ఎంఎఫ్) ట్రస్టీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ, రెండవ దశలో నెహ్రూకు రాసిన లేఖలను కనుగొనే ప్రయత్నాలు ఉంటాయని అన్నారు. 'గాంధీ–నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్–నెహ్రూ, సుభాష్ చంద్రబోస్–నెహ్రూ ఉత్తర ప్రత్యుత్తరాలు చాలా సమగ్రమైనవని, కానీ విన్‌స్టన్ చర్చిల్–నెహ్రూష రవీంద్రనాథ్ ఠాగూర్–నెహ్రూ వంటి కొన్ని ఇతర ఉత్తర ప్రత్యుత్తరాల విషయంలో అలా లేదని రమేష్ అన్నారు. గాంధీ, నెహ్రూ, పటేల్, బిఆర్ అంబేద్కర్‌ష మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి ఆ కాలపు ప్రముఖుల ఆర్కైవ్‌లను ఏకీకృతం చేయాలని రమేష్ పిలుపునిచ్చారు. జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్ నవంబర్ 14, 2024న వాగ్దానం చేసినట్లుగా, జవహర్‌లాల్ నెహ్రూ ఎంపిక చేసిన రచనలు ఇప్పుడు పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రకటించడానికి సంతోషంగా ఉందన్నారు.

ఒరిజినల్ ప్రింట్ వెర్షన్ కాపీలు, డిజిటల్ టెక్స్ట్‌తో పాటు కూడా అందుబాటులో ఉన్నాయని జెఎన్ఎంఎఫ్ తెలిపింది. 1920 నుండి 1960 వరకు భారత చరిత్రలోని ఏదైనా అంశాన్ని అధ్యయనం చేయాలనుకునే ఎవరికైనా ఈ ఆన్‌లైన్ వెర్షన్ అపారమైన ప్రయోజనాన్ని అందిస్తుందని, ఆ సంవత్సరాలలో నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన నాయకుడిగా ఉండి, ఆ తర్వాత దేశ ప్రధానమంత్రిగా ఉన్నారని ప్రకటన పేర్కొంది.

## మత్స్యకార్మికులకు మెరుగైన భద్రత కల్పించాలి : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** దేశంలోని మత్స్యకారుల సామాజికవర్గాన్ని రాహుల్‌గాంధీ ప్రశంసించారు. వారికి మెరుగైన భద్రత, వారి పట్టిన చేపలకు సరసమైన ధరలు, ఆధునిక సౌకర్యాలు కల్పించాలన్నారు. గౌరవ మర్యాదలకు వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన తన హృదయమంతా భారతదేశ మత్స్యకార వర్గాలతో నిండిపోయిందన్నారు. ఈ మేరకు శుక్రవారం రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'మీరు మా ప్లేట్లను నిండుగా ఉంచుతారు. ఆర్థిక వ్యవస్థను కదిలిస్తారు. మీరు మా జలాల సంరక్షకులు, పురాతన జ్ఞానాన్ని కాపాడేవారు. భారత దేశ సాంస్కృతిక నిర్మాణంలో విడదీయరాని భాగం' అని రాహుల్‌గాంధీ కొనియాడారు. తాను ఎల్లప్పుడూ మత్స్యకారులకు అండగా నిలబడుతానన్నారు. ''మెరుగైన భద్రత, సరసమైన ధరలు, ఆధునిక సౌకర్యాలు, శుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన నదులు, సముద్రాలు, మీ పిల్లలకు మంచి విద్య, మీరు నిజంగా గౌరవ, మర్యాదలకు అర్హులు' అని అని మాజీ కాంగ్రెస్ చీఫ్ అన్నారు. నవంబర్ 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం జరుపుకుంటారు. ఇది ఆహారం, పోషక భద్రత, జీవనోపాధి ఉత్పత్తి, పర్యావరణ సమతుల్యతకు మద్దతు ఇవ్వడంలో స్థిరమైన మత్స్యకార, ఆక్వాకల్చర్ కీలక పాత్రను ఉద్ఘాటిస్తుంది. ఈ దినోత్సవం 1997 నుండి ప్రారంభమైంది. 18 దేశాల ప్రతినిధులు న్యూఢిల్లీలో సమావేశమై ప్రపంచ మత్స్యకార వేదికను స్థాపించారు. భారతదేశంలో ఈ దినోత్సవం ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఎందుకంటే భారతదేశం ప్రపంచవ్యాప్తంగా చేపలు, ఆక్వాకల్చర్‌లో రెండవ అతిపెద్ద ఉత్పత్తిదారు. ప్రపంచంలోని ప్రముఖ రొయ్యల ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉంది.

## గవర్నర్లకు డెడ్‌లైన్ ఉండాల్సిందే..

**చెన్నై:** బిల్లులపై నిర్ణయం తీసుకునేలా గవర్నర్లకు గడువు విధించేవిధంగా రాజ్యాంగంలో సవరణలు తెచ్చేవరకు తమ పోరాటం ఆపబోమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ వెల్లడించారు. శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని సుప్రీంకోర్టు స్పష్టంచేసినసంగతితెలిసిందే. స్టాలిన్ తొలిసారిగా స్పందించారు. ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన అభిప్రాయం.. ఏప్రిల్ 8 నాటి తీర్పును (తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్) ప్రభావితం చేయలేదు. వాస్తవానికి ఎన్నికైన ప్రభుత్వం డ్రైవర్ సీటులో ఉండాలని, రాష్ట్రంలో రెండు పాలక వర్గాలు ఉండకూడదని సుప్రీంతీర్పుపునరుద్ఘాటించింది. బిల్లులను పక్కన పడేసేలా వీటో అధికారం చూపే అవకాశం గవర్నర్లకు ఉండదు. బిల్లులను నిలిపివేసే అధికారం వారికి లేదు. రాష్ట్ర హక్కులు, సమాఖ్యవాదం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది' అని స్టాలిన్ స్పష్టం చేశారు.

### భారత్–ఆఫ్ఘనిస్థాన్‌ల ద్వైపాక్షిక వర్తకం పునరుజ్జీవానికి...

## వాణిజ్య అటాచ్‌ల నియామకం

### ద్వైపాక్షిక సమావేశంలో ఇరుదేశాల మంత్రులు నిర్ణయం



**న్యూఢిల్లీ :** ప్రస్తుతం 1 బిలియన్ డాలర్లకు పైగా విలువైన దైపాక్షిక వాణిజ్యాన్ని పునరుజ్జీవింపజేయడానికి భారతదేశం, ఆఫ్ఘనిస్థాన్ పరస్పరం ఇరుదేశాల రాజధానుల్లో వాణిజ్య అటాచ్‌లను నియమించుకోవాలని నిర్ణయించాయి. గురువారం ఇక్కడ జరిగిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి జితిన్ ప్రసాద్, ఆఫ్ఘనిస్థాన్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి హజ్జి నూరుద్దీన్ అజిజి మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. గురువారంనాడు విదేశీ వ్యవహారాల మంత్రి, కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రితో జరిగిన సమావేశంలో ఇరువైపులా ద్వైపాక్షిక వాణిజ్య సహకారాన్ని మద్దతు ఇవ్వడానికి ఇరువైపు దేశాల రాయబార కార్యాలయాలలో వాణిజ్య అటాచ్‌లను నియమించుకోవాలన్న అంశంపై అంగీకారం కుదిరింది. ఆఫ్ఘనిస్థాన్ మంత్రి త్వరలోనే ఇక్కడి రాయబార కార్యాలయానికి ట్రేడ్ అటాచ్‌ను పంపించనున్నారు అని జాయింట్ సెక్రటరీ (పిఎఐ డివిజన్) ఎం.ఆనంద్ ప్రకాష్ శుక్రవారం చెప్పారు. కాబూల్ ఢిల్లీ సెక్టార్, కాబూల్ అమృత్‌సర్ మార్గాలలో ఎయిర్ ఫ్రైయిట్ కారిడార్‌ను కూడా ప్రారంభించనున్నట్లు ప్రకాష్ చెప్పారు. ఈ సెక్టార్లలో కార్గో విమానాలు త్వరలో ప్రారంభించబడతాయని, దీని వల్ల మన ద్వైపాక్షిక వాణిజ్యం మరింత బలోపేతం కానున్నదని ఆయన నొక్కిచెప్పారు. పదే పదే సరిహద్దు మూసివేతలు, వాణిజ్య మార్గాల రాజకీయ దుర్వినియోగం కారణంగా మూడు నెలల్లోపు తరచూ పాకిస్థాన్‌తో వ్యాపారాన్ని దశలవారీగా ముగించాలని ఆఫ్ఘన్ ఉప ప్రధానమంత్రి ముల్లా అబ్దుల్ ఘని బరదార్ వ్యాపారులను ఆదేశించిన కొద్ది రోజుల అనంతరం వెలువడిన ఈ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతదేశం, ఆఫ్ఘనిస్థాన్ ఇరుదేశాలు కూడా వర్తకం, వాణిజ్యం, పెట్టుబడులపై ఉమ్మడి వర్కింగ్ గ్రూప్‌లను పునరుజ్జీవింపజేయాలని కూడా నిర్ణయించాయి. చాబహార్ పోర్ట్ మార్గాన్ని పూర్తిగా అమలుచేయడం, కస్టమ్స్, బ్యాంకింగ్ విధానాలను సరళీకృతం చేయడం ద్వారా 2021కు ముందున్న 1.8 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వర్తకాన్ని ప్రోత్సహించే ధ్యేయంతో ముందుకు సాగుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. చర్చల సందర్భంగా అజిజి మాట్లాడుతూ చాబహార్ పోర్ట్ నుండి రెగ్యులర్ షిప్పింగ్ లైన్ల వ్యాపార వీసాలను వేగంగా జారీ చేయాలని నిమ్రుజ్ ప్రావిన్స్ లోని డ్రైపోర్టుల అభివృద్ధి, నవ షెవా పోర్ట్ వద్ద వస్తువుల దిగుమతులుఎగుమతి ప్రక్రియ ఆఫ్ఘనిస్థాన్ కోసం సులభతరం చేయాలని ఆకాంక్షించారు. ఫార్మాస్యూటికల్స్‌లో ఉమ్మడి పెట్టుబడి ఔషధాలు, శీతల గిడ్డంగి చైన్లు, పండ్ల ప్రాసెసింగ్ యూనిట్లు, పారిశ్రామిక పార్కులు, ఎంఎస్ఇ సెంటర్లు, ఎగుమతి ప్రక్రియ జోన్లు ప్రోత్సహించుకునేలా ఇరుదేశాలు కూడా అంగీకరించాయి. ఇరుదేశాలలో రెగ్యులర్‌గా ఎగ్జిబిషన్లు, బి2బి సమావేశాలు, సెక్టార్‌స్పెసిఫిక్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని అజిజి పిలుపునిచ్చారు.

## బహిరంగ ప్రకటనలు చేయొద్దు

### కర్నాటకలో కాంగ్రెస్ నాయకత్వ మార్పుపై పార్టీ శ్రేణులకు అధిష్టానం తీవ్ర హెచ్చరిక



**బెంగళూరు:** కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై నాయకత్వం మార్పుపై తరుచూ పార్టీ ఎమ్మెల్యేలు వ్యాక్యలు చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తీవ్రంగా హెచ్చరించింది. పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు నాయకత్వంపై ఎటువంటి బహిరంగ ప్రకటనలు చేయవద్దని కర్ణాటక ఇన్‌చార్జ్ ఏఐసిసి జనరల్ సెక్రటరీ రణదీప్ సింగ్ సుర్జేవాలా ఘాటుగా మందలించారు. శివకుమార్‌కు విధేయులైన ఒక రాష్ట్ర మంత్రి, అనేక మంది ఎమ్మెల్యేలు న్యూఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ హైకమాండ్‌ను కలిసిన మరుసటి తర్వాత ఏఐసిసి హెచ్చరికలు చేసింది. మీడియాలోని ఒక వర్గంతో పాటు, నిర్ణయాత్మకంగా ఓడిపోయిన, వర్గపోరుతో నిండిన బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుర్మార్గపు ప్రచారం చేస్తోందని సుర్జేవాలా ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను అణగదొక్కడమే కాషాయ పార్టీ ఏకైక ఆలోచన అని ఆయన పేర్కొన్నారు. కర్నాటక సిఎం, డిప్యూటీ సిఎంలతో చర్చించానని, నిర్ణయాత్మకంగా ఓడిపోయిన, వర్గపోరులో ఉన్న కర్ణాటక బిజెపి, మీడియాలోని ఒక వర్గంతో కలిసి ఉద్దేశపూర్వకంగా కర్ణాటక, కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయని వారు అంగీకరించారని ఆయన సుర్జేవాలా ఎక్స్‌లో పోస్టు చేశారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేల అనవసర ప్రకటనలు అనవసరమైన ఊహాగానాలకు ఆజ్యం పోశాయని రాజ్యసభ ఎంపి స్పష్టం చేశారు. 'నాయకత్వం అంశంపై లేదా స్వార్థ ప్రయోజనాలు ప్రచారం చేస్తున్న ఎజెండాకు లొంగకుండా కాంగ్రెస్ అదిష్టానం వారిని తీవ్రంగా హెచ్చరించిందని, వివిధ పార్టీ కార్యకర్తల అభిప్రాయాన్ని నాయకత్వం తెలుసుకుందని సుర్జేవాలా చెప్పారు. కాగా, గురువారం, శివకుమార్‌కు విధేయులైన ఒక మంత్రి, కొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అగ్రనేతలను కలవడానికి న్యూఢిల్లీకి వెళ్లారు. ఇది అధికార పార్టీలో అధికార పోరును సూచిస్తుందని వర్గాలు తెలిపాయి. సిఎం సిద్ధరామయ్య రెండున్నర సంవత్సరాలు పదవీకాలం పూర్తి చేసుకున్న మరుసటి రోజు తర్వాత ఈ పరిణామం జరిగింది. 2023 మేలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య గట్టి పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఆయనను ఒప్పించి ఉప ముఖ్యమంత్రిని చేయగలిగింది. రొటేషనల్ ముఖ్యమంత్రి ఫార్ములా ఆధారంగా రాజీ కుదిరిందని ఆ సమయంలో కొన్ని నివేదికలు వచ్చాయని, దీని ప్రకారం రెండున్నర సంవత్సరాల తర్వాత శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారు, కానీ వాటిని పార్టీ అధికారికంగా ధృవీకరించలేదు. అయితే, సిద్ధరామయ్య ఈ నివేదికలను తిరస్కరించారు, తాను ఐదు సంవత్సరాలు పదవిలో కొనసాగుతానని నొక్కి చెప్పారు.

**సిద్ధకు డికె శుభాకాంక్షలు**

కాగా, ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుంటానని సిఎం సిద్ధరామయ్య చెప్పడంతో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతున్న సమయంలో ఎమ్మెల్యేలు ఢిల్లీలోని నాయకులను వెళ్లి కలవడంలో తప్పు లేదని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేయడమే కాకుండా భవిష్యత్తులో బడ్జెట్‌లను కూడా ప్రవేశపెడతానని సిద్ధరామయ్య శుక్రవారం మైసూరులో చేసిన ప్రకటనపై శివకుమార్ స్పందించారు. 'ఐదేళ్లు పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి చెప్పారు. ఆయనకు శుభాకాంక్షలు. మనమందరం కలిసి పనిచేద్దాం' అని అన్నారు. 'నాకు ఎలాంటి వర్గం లేదు. నేను ఏ వర్గానికీ నాయకుడిని కాదు. నేను 140 మంది (కాంగ్రెస్) ఎమ్మెల్యేలకు అధ్యక్షుడిని. నాకు, 140 మంది ఎమ్మెల్యేలందరూ ముఖ్యమైనవారే. నేను ఏ గ్రూపును నాతో తీసుకెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు లేదా నేను ఏ గ్రూపును ఏర్పాటు చేయాలనుకోవడం లేదు. నేను అలా చేయను. ఏదైనా గ్రూపును ఏర్పాటు చేయడం నా రక్తంలో లేదు. 140 మంది నా ఎమ్మెల్యేలే' అని ఆయన ఇక్కడ విలేకరులతో అన్నారు. తమ నాయకులను కలవడానికి అందరు ఎమ్మెల్యేలు అర్హులను, వారిని ఎవరూ ఆపలేరన్నారు.

### జి-20 శిఖరాగ్ర సమావేశంలో ..

## భారతదేశ దృక్పథాన్ని చాటిచెబుతా

### జోహాన్స్‌బర్గ్‌లో నవంబరు 21నుంచి 23వరకు జరుగనున్న సమావేశానికి బయల్దేరిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** 'వసుదైవ కుటుంబం', 'ఒకే భూమి ఒకే కుటుంబం', 'ఒక భవిష్యత్తు' అనే దార్శనికతకు అనుగుణంగా భారతదేశ దీర్ఘకాలిక దృక్పథాన్ని జి20 శిఖరాగ్ర సమావేశంలో చాటిచెబుతానని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నొక్కి చెప్పారు. ఆయన దక్షిణ ఆఫ్రికాలోని జోహాన్స్‌బర్గ్‌లో జరుగనున్న జి20 శిఖరాగ్ర సమావేశం మూడు రోజుల పర్యటన కోసం శుక్రవారం ఇక్కడ నుంచి బయల్దేరనున్నారు. ఆఫ్రికా ఖండంలో జి20 శిఖరాగ్ర సమావేశం జరగడం ఇదే మొదటిసారి. అయితే 2014 నుంచి భారత ప్రధానమంత్రి 12వ జి20 సమావేశం అని మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రధానమంత్రి దక్షిణ ఆఫ్రికాలోని జోహాన్స్‌బర్గ్ సమావేశానికి హాజరుకానున్నారు.'ఆఫ్రికాలో జరుగనున్న ఈ ప్రత్యేక సమావేశానికి ఎంతో విశిష్టత ఉంది.అక్కడ ప్రపంచస్థాయికి సంబంధించిన వివిధ సమస్యలు చర్చించబడతాయి. ఈ సమావేశానికి పలువురు ప్రముఖ ప్రపంచ నాయకులు హాజరవుతారు' అని మోదీ తన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ శిఖరాగ్రసమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ జోహాన్స్‌బర్గ్‌లో ఉన్న నాయకులు కొంతమందితో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. ప్రధాని మోదీ అక్కడ ఆరవ ఐబిఎస్ఏ సమావేశానికి కూడా హాజరుఅవుతారు. ప్రధానమంత్రి తన నిష్క్రమణ ప్రకటనలో, 'వసుదైవ కుటుంబం', 'ఒకే భూమి ఒకే కుటుంబం', 'ఒక భవిష్యత్తు' అనే మన దార్శనికతకు అనుగుణంగా భారతదేశం దృక్పథాన్ని నేను శిఖరాగ్ర సమావేశంలో ప్రస్తావిస్తాను' అని చెప్పారు. దక్షిణా ఆఫ్రికా అధ్యక్షతన జరుగనున్న 20వ జి20నాయకుల సమావేశానికి హాజరుకావాలన్న దక్షిణాఫ్రికాఅధ్యక్షుడు సిరిల్ రమాపోసా ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందర్శన దక్షిణ ఆఫ్రికాలో నవంబరు 21 నుంచి 23వరకు మూడు రోజులపాటు ఖరారు అయ్యింది. ఇది ఆఫ్రికాలో జరుగుతోన్న మొట్టమొదటి జి20 ప్రత్యేక సమావేశం కాబట్టి దానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, 2023లో జి20సమావేశానికి భారతదేశం అధ్యక్షత వహించిన సమయంలో ఆఫ్రికన్ యూనియన్ జి20 సభ్యదేశంగా మారిందని మోదీ తన ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం కీలకమైన ప్రపంచ సమస్యలను చర్చించడానికి ఒక వేదికగా ఉంటుందన్నారు. ఈ ఏడాది జి20 థీమ్ 'సంఘీభావం', 'సమానత్వం', 'స్థిరత్వం' అని, దీనిద్వారా దక్షిణ ఆఫ్రికాలో గతంలో న్యూఢిల్లీలో, రియోడీజెనీరోలో జరిగిన శిఖరాగ్ర సమావేశాల ఫలితాలను ముందుకు తీసుకెళ్లిందని మోదీ చెప్పారు. భాగస్వామ్య దేశాల నాయకులతో నా సంభాషణల కోసం, శిఖరాగ్ర సమావేశంలో జరుగనున్న 6వ ఐబిఎస్ఏ సమావేశంలో పాల్గొనడం కోసం నేను నిరీక్షిస్తున్నానని మోదీ తెలియజేశారు. ఈ పర్యటన సందర్భంగా భారతదేశం వెలుపల అతిపెద్ద దక్షిణ ఆఫ్రికాలో భారతీయ ప్రవాసులతో నా సంభాషణ కోసం కూడా నేను ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. కాగా బుధవారం నాడు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించిన ప్రకారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశానికి సంబంధించిన మూడు సెషన్లలో ప్రసంగించే అవకాశం ఉంది. దక్షిణ ఆఫ్రికాకు ముందు జి20 అధ్యక్షపదవులను 2024లో బ్రెజిల్, 2023లో భారతదేశం, 2022లో ఇండోనేషియా దేశాలు నిర్వహించాయి. జి20 వెబ్‌సైట్ ప్రకారం జి20సభ్యులలో ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలు ఉన్నాయి. ఇవి ప్రపంచ జిడిపిలో 85 శాతం, అంతర్జాతీయ ట్రేడ్‌లో 75శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మేరకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. జి20లో అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, భారతదేశం, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, ది రిపబ్లిక్ ఆఫ్ కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణ ఆఫ్రికా, టర్కీ, ది యునైటెడ్ కింగ్‌డమ్, ది యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ది యురోపియన్ యూనియన్, ది ఆఫ్రికన్ యూనియన్ సభ్య దేశాలుగా ఉన్నాయి.

## ట్రంప్ వెళ్లనందుకే..

### జి20 సమ్మిట్‌కు ప్రధాని మోదీ హాజరు



**న్యూఢిల్లీ :** ప్రధాని మోదీపై కాంగ్రెస్ మరోసారి విమర్శలు గుప్పించింది. దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న జి20 శిఖరాగ్ర సమావేశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెళ్లనందుకే ప్రధాని మోదీ హాజరవుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ఇటీవలే మలేసియాలోని కౌలాలంపూర్ వేదికగా జరిగిన ఆసియాన్ సమ్మిట్‌కు డొనాల్డ్ ట్రంప్‌తో ముఖాముఖి సంభాషణను తప్పించుకోవడానికి ప్రధాని మోదీ వెళ్లలేదని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనపై జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. 'ప్రధాని మోదీ దక్షిణాఫ్రికాలో జరగబోయే జి20 శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ శిఖరాగ్ర సమావేశాన్ని బహిష్కరించడంతో ప్రధాని మోదీ సేఫ్ అయ్యారు. కొన్ని రోజుల క్రితం ఇండియా–ఆసియాన్ శిఖరాగ్ర సమావేశం కోసం మోదీ కౌలాలంపూర్‌కు వెళ్లలేదని మర్చిపోకండి. ఎందుకంటే ఆ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హాజరయ్యారు. ట్రంప్ నుంచి తప్పించుకునేందుకు ఆసియాన్ సమ్మిట్‌కు మోదీ హాజరుకాలేదు. దక్షిణాఫ్రికాలో జరగబోయే జి20 థీమ్ సంఘీభావం, సమానత్వం, స్థిరత్వం.

**ఆ సమ్మిట్‌లో మోదీ పాల్గొంటారా? : జైరాం రమేశ్**

2026లో అమెరికా ఆతిథ్యం ఇవ్వనున్న తదుపరి జి20 శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారిందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. 'జి20 అధ్యక్ష పదవి ఏటా రొటేషన్ అవుతుంది. 2023 నవంబరులో ఇండోనేసియా నుంచి భారత్ జి20 పగ్గాలను స్వీకరించింది. 2024లో భారత్ బ్రెజిల్‌కు జి20 పగ్గాలు అప్పగించింది. ఈ ఏడాది జి 20 పగ్గాలను అమెరికాకు దక్షిణాఫ్రికా అప్పగిస్తుంది. వచ్చే ఏడాది తదుపరి జి20 శిఖరాగ్ర సమావేశం అమెరికాలో జరుగుతుంది. అప్పటికి బహుశా అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం పూర్తవుతుంది. అయితే గత ఏడు నెలల్లో తానే ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 61సార్లు చెప్పారు. రాబోయే ఏడాదిలో ఆయన ఆ వాదనను ఎన్నిసార్లు పునరావృతం చేస్తారో ఊహించుకోండి అని అన్నారు.

## జంతర్ మంతర్ వద్ద ఉపాధిహామీ కార్మికుల ధర్నా

**న్యూఢిల్లీ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తుండడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. పలు రాష్ట్రాల్లో కార్మికులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. హర్యానాకు చెందిన వందలాది మంది ఉపాధిహామీ కార్మికులు శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన గ్రామీణ జీవనోపాధి పథకం కింద తమకు ఉపాధి లభించడం లేదని, ఈ పథకం కింద అనుమతించబడిన పనుల జాబితా నుండి అనేక పనులను తొలగించారని మండిపడ్డారు. గత 45 నెలలుగా ఉపాధిహామీ పథకం కింద తమకు ఎటువంటి పని లభించడం లేదని కార్మికులు ధ్వజమెత్తారు. అనుమతించబడిన పనుల జాబితాను మారుస్తూ కేంద్రం నుండి ఒక ఉత్తర్వు వచ్చిందని స్థానిక అధికారులు తమకు చెప్పారని హర్యానా ఫతేహాబాద్ జిల్లాలోని తోహానాకు చెందిన కిషన్ కుమార్ పేర్కొన్నారు. 'గత ఐదు నెలలుగా మాకు ఎటువంటి పని లభించడం లేదు. కేంద్రం నుండి తమకు ఆదేశాలు వచ్చాయని, కొన్ని పనులు ఆగిపోయాయని అధికారులు చెబుతున్నారు' అని కిషన్ పిటిఐకి చెప్పారు. నీటి సంరక్షణ, నీటిపారుదల, చెరువు పునరుద్ధరణ, కరువు నివారణ, గ్రామీణ అనుసంధానం, భూ అభివృద్ధి వంటి నైపుణ్యం లేని కార్మికులు అవసరమయ్యే 'కచ్చే కామ్' అని పిలువబడే పనులను అనుమతించబడిన పనుల జాబితా నుండి తొలగించారని కార్యకర్త ధీరజ్ గభా ఆరోపించారు. తాము ప్రతి జిల్లాలో నిరసనలు నిర్వహించామని, స్థానిక అధికారులు ఇది కేంద్రం నిర్ణయం అని చెబుతున్నారని, అందుకే తాము ఢిల్లీకి వచ్చామన్నారు. ఈ సమస్యలపై కేంద్ర మంత్రులతో కూడా సమావేశాలు నిర్వహిస్తామని కార్యకర్త చెప్పారు. ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకపోతే పెద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు. 'ఈ సమస్య పరిష్కారం కాకపోతే, వచ్చే ఏడాది బడ్జెట్ సమావేశాల సందర్భంగా లక్ష మంది ఉపాధిహామీ కార్మికులతో ఢిల్లీలో నిరసన చేపడతామన్నారు.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24T4417 | Vijay Kumar Lyadaala | Swaraj 834 XM | 2019 |
| 2 | TS24 4677 | Yellaiah Kothapelly | John Deere 5310 Harvester | 2017 |
| 3 | TS03TC 9589 | Merugu Rama | Sonalika DI 42 RX | 2021 |
| 4 | TG24 9843 | Anil Chelkapelli | Swaraj 843 XM | 2024 |
| 5 | TS12UB 7911 | Yellaiah Shivaratri | Tata LPK 909 FBT | 2011 |

AUCTION DATE 22-11-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

D No :19-11-409/3. 1st floor, Beside GMR Gokul Appartments Shambunipet, Warangal - 506002, Cell 9989809938, 9000298883


## దుబాయ్ ఎయిర్ షోలో కూలిన భారత యుద్ధ విమానం

### పైలట్ మృతి





**న్యూఢిల్లీ/దుబాయ్ :** దుబాయ్ ఎయిర్ షోలో భారత్‌కు చెందిన తేజస్ ఫైటర్ జెట్ కుప్పకూలింది. విమాన ప్రదర్శన సమయంలో ఈ ఫైటర్ జెట్ ఎత్తు తగ్గుతూ కిందకు వస్తున్నట్టు అనిపించింది. అయితే వేగంగా వెళ్లి ఒక్కసారిగా నేలను తాకింది. కొన్ని క్షణాల వ్యవధిలో మంటలు చెలరేగి ఫైటర్ జెట్ పూర్తిగా దగ్ధమైంది. ఘటనాస్థలంలో భారీగా పొగలు అలుముకున్నాయి. తీవ్ర గాయాలతో పైలట్ ప్రాణాలు కోల్పోయారు. పైలట్ మృతిని భారత వైమానిక దళం ధ్రువీకరించింది. భారత వాయుసేనలో వినియోగిస్తున్న తేలికపాటి యుద్ధ విమానం హెచ్ఏఎల్ తేజస్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.40 గంటల సమయంలో ప్రదర్శన చేస్తూ కూలిపోయింది. ఈ ప్రమాదంలో పైలట్ మృతి చెందారు. ఈ ఘటనపై భారత వైమానక దళం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పైలట్ కుటుంబానికి సానుభూతి ప్రకటించింది. ఈ ప్రమాదానికి గల కారణంపై విచారణకు ఆదేశిస్తున్నట్టు తెలిపింది. ఫైటర్ జెట్ కూలిన నేపథ్యంలో విన్యాసాలు జరుగుతున్న దుబాయ్ వరల్డ్ సెంట్రల్‌లోని అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నల్లటి పొగ ఆకాశాన్ని అలుముకుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా సైరన్లు మోగాయి. తేజస్ యుద్ధ విమానం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) లో తయారైంది.

ప్రజాపక్షం
శనివారం, 22 నవంబరు

# నితీశ్‌ముందు అలవికాని సవాళ్లు

ఎన్నికల్లో విజయం ఎవరికైనా ఆనందదాయకమే. అందునా బిహార్ ముఖ్యమంత్రిగా 10వ పర్యాయం పదవీ ప్రమాణం స్వీకరించిన జెడి(యు) అధినేత నితీశ్‌కుమార్‌కు, ఆయన్ను అంటి పెట్టుకుని అధికార భాగస్వామిగా ఉన్న బిజెపికి ఇది మరువలేని సందర్భం. సిద్ధాంతాలకన్నా కులాల కుంపట్లు బలంగాఉన్న రాష్ట్రంలో సరైన సామాజిక ఇంజినీరింగ్ (కులాల పొందిక) చేయటం, ప్రభుత్వధనం వెదజల్లి అట్టడుగు తరగతులకు, ముఖ్యంగా మహిళలకు నేరుగా నగదు, ఇతర సౌకర్యాలు అందించటం, పార్టీల సంస్థాగత నిర్మాణం, అరచేతిలో స్వర్గం చూపుతూ భవిష్యత్ వాగ్దానాలు వగైరాలు ఎన్నికల్లో ఎన్‌డిఎకి అనూహ్యమైన ఫలితాలిచ్చి ఉండవచ్చు. ఎన్నికల కమిషన్ కూడా తన శక్తికొలది తోడ్పడిందనే ఆరోపణలు ఉండనే ఉన్నాయి. వివిధ కులాలకు తగు ప్రాతినిధ్యం ఇస్తూ మంత్రివర్గ కూర్పు అలవాటైన విన్యాసమే. దాదాపు 20 సంవత్సరాల ఏలుబడిలో సాధించలేకపోయిన అభివృద్ధిని నితీశ్‌కుమార్ ఇప్పుడు 74 ఏళ్ల వయస్సులో ఏమి సాధించగలరని ఓటర్లు ఆలోచించలేదు. చేసిన వాగ్దానాలు నెరవేర్చటం ఎవరికైనా సాధ్యమా అని కూడా ఆలోచించలేదు. కేవలం 'సుశాసన్ బాబు'గా నితీశ్‌కున్న మంచిపేరు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. ప్రతిపక్ష కూటమి బలహీనతలు కూడా ఇందుకు దోహదం చేశాయి. ఇది ముగిసిన అధ్యాయం. ఇక ప్రభుత్వం ఆలోచించాల్సింది, ఆచరణలోకి తేవలసింది ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు. ఇప్పుడవి అలవికాని సవాళ్లుగా ఎదుట నిలిచి ఉన్నాయి. నిజానికి అవే ప్రధాన ప్రతిపక్షం. ప్రభుత్వ అసమర్థతను, వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ వాస్తవాలను ప్రజలకు వివరించటం ప్రతిపక్షపార్టీల కర్తవ్యం.

పాలక ఎన్‌డిఎ కూటమి నాటకీయ పరివర్తనను ఓటర్లకు హామీ యిచ్చింది: (1) కోటి ఉద్యోగాలు, (2) మౌలిక వసతుల నిర్మాణాలకు రూ.9లక్షల ట్లు, (3) నాలుగు అంతర్జాతీయ విమానాశ్రయాలు, (4)నాలుగు మెట్రో రైలు వ్యవస్థలు, (5)పంటలన్నింటికీ ఎంఎస్‌పి, (6)1000 మండీల పునరుద్ధరణ, (7) అంతిమంగా 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా పెద్ద గెంతు. బిహార్ ఆర్థిక స్థితిగతులు ఇవి అసాధ్యాలని చెబుతున్నాయి. ఎందుకంటే, భారత దేశ ప్రతి ఒక్క ప్రధాన ఆర్థిక ర్యాంకింగ్‌లోనూ బిహార్ అట్టడుగున ఉంది. జెడి(యు) మోదీ ప్రభుత్వాన్ని నిలబెట్టటంలో కీలకం కాబట్టి ఆయన నిధులు కుమ్మరిస్తారనుకుంటే అది భ్రమ. కేంద్రానికీ చట్ట పరిమితులుంటాయి. ప్రైవేటు పెట్టుబడులు ప్రవహించే పారిశ్రామిక వాతావరణమూ లేదు.

బిహార్ స్థూల రాష్ట్ర అంతర్గత ఉత్పత్తి (జిఎస్‌డిపి) 8.6 లక్షల కోట్లు, తలసరి లెక్క ప్రకారం ఇది రాష్ట్రాన్ని అట్టడుగున ఉంచుతుంది. దాని తలసరి ఎన్ఎస్‌డిపి రూ.69,000, ఇది జాతీయ సగటులో మూడవవంతు. మూడు దశాబ్దాలుగా ఉన్న వ్యత్యాసాలు వాటిని సంస్థాగతంగా మార్చాయి. మరో కోణంలో చూస్తే బిహార్ వార్షిక బడ్జెట్ రూ.3.17లక్షల కోట్లు. అందులో దాని సొంత పన్ను రెవెన్యూ రూ.30వేల కోట్లు. దాదాపు 80శాతం కేంద్రం పంపిణీ చేసే నిధుల నుంచి, గ్రాంట్ల రూపేణా లభిస్తున్నది. పెరుగుతున్న రుణభారం గుదిబండ అవుతున్నది. జిఎస్‌డిపిలో రుణం దామాషా దాదాపు 30శాతం. సిఫారసుచేసిన సీలింగ్ 33శాతానికి చేరువలో ఉంది. రెవిన్యూ జమల్లో దాదాపు 7శాతం వడ్డీలు తినేస్తున్నాయి. కాబట్టి ఎన్‌డిఎ వాగ్దానాల అమలు సాధ్యాసాధ్యాలను ఊహించుకోవచ్చు.

బిహార్ ప్రాథమికంగా వ్యవసాయ రాష్ట్రం. శ్రామికశక్తిలో 54శాతం ఈ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. వారి ఆర్థిక ఉత్పత్తి 18శాతం. రైతుల్లో 97శాతం సగటున 0.39 హెక్టార్లున్న చిన్న, సన్న రైతులు. మిగులు ఉత్పత్తికి ఈ సాగు తోడ్పడదు. ఏ రాష్ట్రంలో అయినా వృద్ధికి చోదక శక్తి వ్యవసాయేతర ఉపాధి. అది బిహార్ జిఎస్‌డిపిలో 9–10శాతం మాత్రమే. సేవలు ఆర్థిక వ్యవస్థలో ప్రధానం. కాని బిహార్‌లో ఈ సేవలన్నీ చిరువ్యాపారాల రూపంలో ఉన్నాయి. దాని ప్రధాన లేబర్ మార్కెట్ రాష్ట్రం నుండి వలసలు. 20–29ఏళ్ల వయస్సులోని ప్రతి10 మందిలో ముగ్గురు ఇతర రాష్ట్రాల్లో వలస కార్మికులుగా జీవితం గడుపుతున్నారు. పరిస్థితి ఇలా వుంటే, ఎన్‌డిఎ ఎన్నికల ప్రణాళిక ప్రతి ఏటా 20లక్షలు ఉద్యోగాల వంతున కోటి ఉద్యోగాలు వాగ్దానం చేసింది. ఇక 1ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అన్నది దీర్ఘకాలిక స్వప్నం. ప్రస్తుత 100 బిలియన్‌డాలర్ల రాష్ట్ర ఎకానమీ ట్రిలియన్‌కు చేరాలంటే వచ్చే ఇరవై ఏళ్లపాటు ఏటా 14 – 16 శాతం వంతున వృద్ధి నమోదు చేయాలి. ఇది బిహార్‌కే కాదు. ఏ ప్రధాన రాష్ట్రానికి సైతం పగటికలే అవుతుంది.

ఇదీ నితీశ్‌కుమార్ ముందున్న ముఖ చిత్రం. ఇది రాజకీయమైనది కాదు – వాగాడంబరంతో నెట్టుకు రావటానికి. ఇది ఆర్థికం – వాస్తవ పనితీరుకు పరీక్ష. సంఖ్యలను దాచలేము కదా!


# చరిత్ర మరిచిన ఝల్కారీ బాయి పరాక్రమం


భారతీయ చరిత్రలో వక్రీకరణ, వివక్షతల జాడ్యం వలన బహుజనుల వీరత్వం, పోరాటాలకు స్థానం ఇవ్వలేదు. ఈ దేశ సంఘసంస్కర్తలుగా, విప్లవ పోరాట యోధులుగా ఆధిపత్య కులాల వాళ్లే బ్రాండ్ వేసుకున్నారు. వారి చరిత్రనే మన విద్యా వ్యవస్థలో చదువుకుంటున్నాం. చరిత్ర ఎరుగనీ అసమాన్యులుగా ఎంతో మంది దళిత పీడిత వర్గాల నుంచి ఉన్నారు. ఇందులో ప్రధానంగా చెప్పుకోవాల్సిన గొప్ప పోరాట వీరనారి ఝల్కారీ బాయి గురించి. భారతదేశ చరిత్రలు తిరగేస్తే అణగారిన కులాల మహిళలు, పురుషులు కనిపించరు. ఆంగ్లేయులతో వీరోచిత పోరాటం చేసిన వీరవనిత ఝల్కారీ బాయి 1857 తిరుగుబాటు చరిత్రకు అందకుండా పోయింది. భారత ప్రథమ స్వాతంత్ర్య తిరుగుబాటులో రాణి లక్ష్మి బాయి, నానాసాహెబ్, తాంతియాతోపే, బహదూర్ శా జఫర్, మంగళ్ పాండే, బేగం హజ్రత్ మహల్, కున్వర్ సింగ్ వంటి కొందరు ముఖ్యులనే చరిత్రలో ప్రస్తావించారు. ఆమె 1857నాటి స్వతంత్ర సమరంలో జాన్సీ రాణి లక్ష్మీ బాయి సైన్యంలో పనిచేసింది. కానీ సావర్కార్ తన పుస్తకంలో ఝల్కారి బాయి ఝాన్సీరాణిని దాసిగా ప్రస్తావించారు. వాస్తవంగా ఝల్కారీబాయి ఝాన్సీలక్ష్మీ భాయి ఏర్పాటు చేసిన మహిళా సైన్యంలో కమాండర్. ఆమె 1857 స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ రాణి లక్ష్మీ బాయి సైన్యంలో ఆమెకు సమానంగా సాహసంగా రాణి రూపంలో బ్రిటిష్ సైనికులతో పోరాడిన ధీరవనిత. యుద్ధంలో, ఝల్కారీ బాయి తనని రాణిగా మోసగించి బ్రిటిష్ సైన్యాన్ని గందరగోళానికి గురిచేసి రాణి లక్ష్మీ బాయికి సురక్షితంగా తప్పించుకునే అవకాశాన్ని కల్పించి కాపాడింది. ఇక్కడ నిజమైన యుద్ధాన్ని చేసిన మహిళ ఝల్కారీ బాయి కదా.

**బాల్యం నుంచే ధీరవనిత**

ఝల్కారీబాయి 22 నవంబర్ 1830లో బుందేల్ ఖండ్ ఝాన్సీలోని భోజలా గ్రామంలో పుట్టింది. తల్లి దనియా, తండ్రి మాల్ చంద్ కోరి కులానికి చెందినవారు. చిన్ననాడే ఝల్కారీ బాయిలో వీరత్వం, సాహసం, ధైర్యం ప్రతిధ్వనించింది. పన్నెండేండ్ల వయస్సులో అడివిలో పశువులు కాస్తున్నప్పుడు పులి పశువుల మీద పడితే పులితోనే తలపడి చంపింది. ఈ వార్త ఝాన్సీరాణి లక్ష్మీ బాయి దాకా చేరింది. ఆమె సైన్యంలో సైనికుడిగా ఉన్న పూరన్ కుటుంబానికి చేరింది. అట్లాంటి వీరత్వం ఉన్న అమ్మాయిని కోడలుగా చేసుకోవాలి అని పూరన్ తల్లి ఇష్టపడింది. ఝల్కారీబాయి వివాహం సైనికుడు పూరన్‌తో జరిగింది. పూరన్ కుటుంబం ఝాన్సీ కోటకు దగ్గరగా ఉన్న 'నయాపూరా' బస్తీలో నివసించేది. ఝల్కారీ రూపురేఖలు చూసిన ఝాన్సీలక్ష్మీ బాయి ఆమెను ఎట్లయినా మహిళా సైనిక దళం లో చేర్చుకోవాలనుకున్నది. భర్త పూరన్ ప్రోత్సాహం, ఆమెకు స్వతహాగా ఉన్న ఆసక్తితో ఝల్కారీ బాయి భర్త దగ్గర గుర్రపుస్వారీ, కత్తియుద్ధం, మల్లయుద్ధం, ఫిరంగులు పేల్చడం, బాణ విద్యలు వంటి యుద్ధ నైపుణ్యాలు నేర్చుకున్నది. బ్రిటిష్ జనరల్ కూడా ఆమె సాహసం అభినందించారు. ఝల్కారీ బాయి గాథ దళితుల చరిత్రలో ఎంతో గౌరవప్రదమైనది. భోపాల్‌లో 2017లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఝల్కారీ బాయి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

**పోరాట వీరుల చరిత్రనే విముక్తి పాఠం.**





భారతదేశ చరిత్ర అంతా గెలిచిన వారిదే. పూలే, అంబేడ్కర్ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పోరాటంతో వాస్తవ చరిత్ర బయటకు వచ్చింది. ఇప్పుడు ఓడిపోయిన వారు కూడా చరిత్ర రాసుకునే అవకాశం లభించింది. చరిత్ర కోణంలో పరిశీలిస్తే...బహుజనులు అసలైన చరిత్ర తెలుసుకోలేకపోయారు. దీంతో వారికి చరిత్ర లేని వారసులుగా మిగిలారు. చరిత్ర తెలియని వాడు చరిత్ర సృష్టించలేరని అంబేద్కర్ అన్నాడు. ఈ క్రమంలో అంబేద్కర్ ఉద్యమ రథాన్ని ముందుకు నడిపించిన విప్లవ సారథి మాన్యవార్ కాన్సిరాం ఝల్కారీ బాయి నిలువెత్తు విగ్రహాన్ని ఝాన్సీ పట్టణంలో రాణి లక్ష్మీ బాయి విగ్రహానికి అభిముఖంగా ఏర్పాటు చేశారు. దీంతో ఆమె చరిత్ర కాంతి రేఖల బయ ట సమాజానికి తెలిసింది. తెలంగాణ ప్రాంతంలో కూడా చాకలి ఐలమ్మ చరిత్ర, పోరాటాన్ని సైతం తప్పుదారి పట్టించారు. ఆమె పాలకుర్తి మండలంలోని విస్నూర్ దేశ్ముఖ్ రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వీరనారి. భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా పోరాడినది. ఆమె పోరాటం కేవలం భూమి కోసమే కాదు, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం జరిగిన మహాసంగ్రామం. కానీ ఆమె తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన యోధురాలుగా కీర్తిస్తూ చరిత్రలో లిఖించారు. దేశంలో ఇలాంటి తప్పుడు చరిత్రలతో బహుజన వర్గాల పోరాట వీరులను బహిర్గతం చేయలేకపోయారు. దీంతో బహుజన వర్గాల విప్లవ చైతన్యం తప్పుదారి పట్టింది. కావు న దేశంలో బడుగు బలహీన వర్గాల పోరాట వీరుల జీవిత గాథలను, విప్లవ స్ఫూర్తిని సరిగ్గా తెలుసుకునేందుకు చరిత్రను ఆధునిక దృష్టికోణంలో విశ్లేషణ అవసరం.

సంపతి రమేష్ మహారాజ్
7989579428

# ఉద్యమాలు ఊపిరిగా వర్ధిల్లిన సిపిఐ



కందిమళ్ళ ప్రతాపరెడ్డి

భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం జరిగి 100 సంవత్సరాలు నిండిన సందర్భంగా శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్నాం. గత చరిత్రను గుర్తు చేసుకుంటున్నాం. అది ఒక పార్టీ చరిత్ర మాత్రమే కాదు.. అది స్వాతంత్ర్యోద్యమ చరిత్ర – విప్లవోద్యమాల చరిత్ర. త్యాగాల చరిత్ర. ఉరికంబాలపై వొరిగిన వీరుల చరిత్ర. స్వాతంత్ర్యోద్యమం నుండి నేటి వరకు సాగిన సమరాలలో శత్రువు తుపాకి తూటాకు గురై అమరులైన వీరుల చరిత్ర, కఠిన కారాగార శిక్షలు అనుభవించిన విప్లవకారుల చరిత్ర. లాఠీలు, తూటాలు, నిషేధాలు, నిర్బంధాలు, దౌర్జన్యాలను ఎదుర్కొంటూ ముందుకు సాగిన దేశభక్తుల, త్యాగధనుల చరిత్ర. వీరుల రుధిరంతో ఎరుపెక్కిన చరిత్ర. ఇంత ఘనచరిత్ర కలిగిన పార్టీ భారతదేశంలో మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం యాదృచ్ఛికంగా జరగలేదు.

రష్యా అక్టోబరు విప్లవ వెలుతురులో – మార్క్సిజం – లెనినిజం సిద్ధాంతం లక్ష్యంగా నిర్మాణం జరిగింది. నిర్మాణానికి ముందు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పెట్టిన "పెషావరు", "కాన్పూరు", "బోల్షివిక్" అక్రమకేసుల్లో నిందితులై బయటపడిన వారు, "అనుశీలన్" "యుగంధర్" లాంటి టెర్రరిస్టు ఉద్యమాలలో పాల్గొని "అలీపూర్", "బెనారస్" "హౌరా" కుట్రకేసుల నుండి తప్పించుకుని విదేశాల్లో ఉండి రష్యా విప్లవం తర్వాత మాస్కో చేరి కమ్యూనిస్టులుగా మారిన యం.యన్.రాయ్, షీకల్, ఉస్మానీ, నళినీగుప్త, వీరేందర్‌నాథ్ ఛటోపాధ్యాయ, గదర్ విప్లవకారుడైన సంతోఖ్‌సింగ్ మొదలైనవారు, అక్టోబరు విప్లవ ప్రభావంతో, బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు రజనీ పామీదత్, శాపూర్జీ సకలత్‌వాలా, ఇతర విదేశాలలో వున్న విప్లవకారులతో సంబంధాలతో కమ్యూనిస్టు గ్రూపులుగా పనిచేస్తున్న సింగారవేలు చెట్టియార్, ఎస్.ఎ.డాంగే, ముజఫర్ అహ్మద్, వీరందరి సంగమంగా (1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో) భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం జరిగింది.

బ్రిటిష్ పాలకులు విధించిన నిషేధం కారణంగా, రహస్య పార్టీగా కమ్యూనిస్టుపార్టీ జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా పనిచేస్తూ 1920లో ఏర్పడిన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఎఐటియుసి) కార్మిక సంస్థను ఉద్యమానికి వేదికగా చేసుకున్నది. పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ఖద్దరు ధరించి ఉద్యమంలో ముందున్నారు. అప్పటివరకు భారతీయోద్యమ లక్ష్యం బ్రిటిష్ పాలకుల నుండి "డొమీనియన్ స్టేటస్"గా ఉన్నది. "డొమీనియన్ స్టేటస్"కాదు సంపూర్ణ స్వాతంత్ర్యం లక్ష్యంగా ప్రకటించాలని కమ్యూనిస్టులు ప్రప్రథమంగా కాంగ్రెస్ మహాసభలో ప్రతిపాదించారు. కాంగ్రెస్‌లోని నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, సి.ఆర్.దాస్ మొదలైనవారు దానిని బలపరచడం ద్వారా చివరకు సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రకటన లక్ష్యంగా తీర్మానం జరిగింది.

* 1922 చౌరాచౌరీ సంఘటన తర్వాత ఉద్యమాన్ని కొద్దిమంది వ్యక్తులకు, శాంతియుత సత్యాగ్రహులకు పరిమితం చేయాలన్న గాంధీజీ నిర్ణయాన్ని వ్యతిరేకించి, కార్మికులు, కర్షకులు, దేశ ప్రజలందరినీ ఉద్యమంలో భాగస్వాములను చేయాలని ప్రతిపాదించి – నెహ్రూ, సుభాష్, వారి అనుచరులను కూడగట్టుకొని ఆ దిశగా కార్యాచరణకు పూనుకున్నది.

* ఎఐటియుసి తర్వాత 1936లో అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్), అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం(ఎఐపిడబ్ల్యు), ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇపిటిఎ) నిర్మాణం జరిగింది. వీటికి జవహర్ లాల్ నెహ్రూ సంపూర్ణ సహకారం అందించారు. ఉత్తరప్రదేశ్ యువజన సంఘానికి నెహ్రూ అధ్యక్షుడిగా ఉన్నారు.

* రచయితలు, కళాకారులు ప్రజలమధ్య, ప్రజలకొరకు, ప్రజాకళలను, అభ్యుదయ రచనలు తీసుకెళ్లారు. కార్మిక, కర్షకుల సమస్యలు, హక్కుల సాధనకు ఉద్యమాలను సాగించారు. విద్యార్థి – యువజన, మహిళా సంఘాల ద్వారా ఉద్యమ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ – వారిని ఉద్యమ కార్యకర్తలుగా తయారు చేశారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో విప్లవాత్మక మార్పు తెచ్చారు. సాంఘిక దురాచారాలు, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా సంఘసంస్కరణ కార్యక్రమాలు చేపట్టారు.

"మీరట్ కుట్రకేసుతో" కమ్యూనిస్టు లెవరో ప్రజలకు తెలిసిపోయింది. వివిధ రంగాలలో వారు చేస్తున్న కృషి, వారి త్యాగనిరతి, దేశభక్తి, ప్రవర్తన, జీవనశైలి, ప్రజలనే కాదు ఇతర కాంగ్రెస్ వాదులను కూడా ఆకర్షించింది.

అనతికాలంలోనే కమ్యూనిస్టు భావజాలం విస్తరించింది. ప్రజా సంఘాల నాయకులంతా కమ్యూనిస్టులుగానే ఉన్నారు. ఫలితంగా వేలాదిమంది కమ్యూనిస్టులుగా, కమ్యూనిస్టు అభిమానులుగా మారారు. పార్టీ జాతీయ కాంగ్రెస్‌లో సోషలిస్టు భావజాల వ్యాప్తికి కృషి చేసింది. క్రమంగా కాంగ్రెస్‌లో నెహ్రూ, సుభాష్, జయప్రకాశ్ నారాయణ్, నాయకత్వంలోని సోషలిస్టుల మద్దతు లభించింది. 1931లో శాసనోల్లంఘన ఉద్యమ విరమణ, భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ ఉరిశిక్ష అమలు తర్వాత...కాంగ్రెస్ పార్టీలో గాంధీ ఎడల విశ్వాసం సడలింది. భగత్‌సింగ్ అనుచరులు అజయ్‌ఘోష్, విజయకుమార్ సిన్హా తదితరులు, గదర్‌వీరులు సోహన్‌సింగ్ బాక్నా, గురుముఖ్‌సింగ్, పృధ్వీసింగ్, చిటగాంగ్ పోరాట వీరనారి కల్పనాదత్, ఆమె సహచరులు, పెషావరు వీరజవాన్ చంద్రశేఖర్ సింగ్ ఇతర విప్లవకారులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లో అతివాద భావాలు, సోషలిజం సిద్ధాంత భావజాలం గల వారందరూ ఒకటయ్యారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీగా అంతర్గత సిద్ధాంత పోరాటం చేశారు. కాంగ్రెస్‌లో అతివాదులు మితవాదులుగా రెండు వర్గాలేర్పడ్డాయి. క్రమంగా అతివాదుల సంఖ్య పెరిగింది.

1936లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి మితవాదులు – అతివాదులు పోటీపడ్డారు. అతివాదుల ప్రతినిధి సుభాష్ చంద్రబోస్, మితవాద అభ్యర్థి పట్టాభి సీతారామయ్యను ఓడించి ఘనవిజయం సాధించాడు. అతి మహాత్మాగాంధీకి విస్మయం కలిగించింది.

మితవాదులు ఈ పరిణామాలన్నింటికీ కారణం కమ్యూనిస్టులేనని తెలుసుకున్నారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలోని అతివాదుల్లో చీలికలకు ప్రయత్నించారు. ఫలితంగా సుభాష్ చంద్రబోస్ కాంగ్రెస్‌ను వీడి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించాడు. సోషలిస్టులు, అంబేద్కర్ షెడ్యూల్ట్ కాస్ట్ ఫెడరేషన్, ముస్లింలీగ్ కాంగ్రెస్ నుండి విడిపోయాయి. కమ్యూనిస్టులను కూడా దూరం చేసి, నెహ్రూ నాయకత్వంలోని అతివాదులను బలహీనం చేయాలని ప్రయత్నాలు సాగించారు. కమ్యూనిజం, కమ్యూనిస్టులపై నిందా ప్రచారం చేశారు. రష్యా ఏజంట్లని ప్రచారం చేశారు.



* 1939లో హిట్లర్, ముస్సోలినీ, టోజో ఫాసిస్ట్ మూకలు ప్రపంచాన్ని కబళించాలని పోలెండ్‌పై దాడితో ప్రపంచ యుద్ధానికి సంకేతం పలికారు. క్రూరమైన, నిరంకుశ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా నిలవాలని అంతర్జాతీయ కమ్యూనిస్టు వేదిక(కమ్యూనిస్టు ఇంటర్నేషనల్) పిలుపునిచ్చింది. సామ్రాజ్యవాదం కంటే ఫాసిజం ప్రధాన శత్రువని ప్రకటించింది. ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి సోవియట్ యూనియన్, సామ్రాజ్యవాద దేశాలైన ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికాలతో ఫాసిస్ట్ వ్యతిరేక కూటమి ఏర్పడింది.

* భారతదేశంలోని కమ్యూనిస్టులు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కంటే ముందుగా ఫాసిస్టులకు వ్యతిరేకంగా నిలవాలన్నారు. కమ్యూనిస్టులను ఏకాకులను చేయాలని ప్రజల్లో వారిపై వ్యతిరేకత పెంచాలని "వీరు దేశ భక్తులు కారు.రష్యా ఏజెంట్లన్నారు." బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు లొంగిపోయారు–అందుకే పార్టీపై నిషేధాన్ని తొలగించారని ప్రచారం ప్రారంభించారు.

* బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై అంతిమ పోరాటం సాగించాలని 1942 ఆగస్టులో బొంబాయిలో ఎఐసిసి సమావేశం ఏర్పాటు చేసి "క్విట్ ఇండియా" తీర్మానాన్ని ఆమోదింపజేయాలన్నారు. ఎఐసిసిలో 12మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, ఒక సానుభూతి పరుడు ఉన్నారు.

జాతీయ కార్యదర్శులుగా, కొన్ని రాష్ట్రాల అధ్యక్షులుగా వివిధ స్థాయిల్లో కమ్యూనిస్టులు ఉన్నారు.

1942 ఆగస్టు 7,8 తేదీల్లో బొంబాయిలో సమావేశం జరిగింది. సమావేశానికి ముందు మహాసభ ప్రాంగణంలో జెండాను ఆవిష్కరించకుండా పోలీసులు నెహ్రూను అరెస్టు చేశారు. తర్వాత ఎవరూ జెండాను ఎగురవేయడానికి ముందుకు రాలేదు. కమ్యూనిస్టు సభ్యురాలైన శ్రీమతి అరుణా అసఫలీ జెండాను ఆవిష్కరించగా అరెస్టు చేశారు.

సమావేశంలో క్విట్‌ఇండియా తీర్మానం ప్రవేశపెట్టగా ఫాసిస్టు ప్రమాదం ముంచుకొస్తున్న ప్రస్తుత సమయం అందుకు సరైనది కాదని 12మంది కమ్యూనిస్టులు, ఒక సానుభూతి సభ్యుడు వ్యతిరేకంగా ఓటు వేశారు. తీర్మానం ఆమోదం పొందింది. కానీ, దానిని బహిరంగంగా ప్రకటించకముందే సభ్యులందరినీ అరెస్టు చేశారు. ఆగస్టు 9న, అరెస్టులకు నిరసనగా దేశవ్యాపితంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఆవేశంతో ప్రజలు రైల్వేస్టేషన్లు, పోస్టాఫీసులు ధ్వంసం చేశారు. టెలిఫోన్ తీగలు తెంచివేశారు. ఆఫీసులు, ఫ్యాక్టరీలు, కళాశాలలు మూసివేశారు. దేశవ్యాపితంగా పోలీసు కాల్పుల్లో 8మంది మరణించారు. 1630 మంది గాయపడ్డారు. 250 రైల్వేస్టేషన్లు, 950 పోస్టాఫీసులు, 50 పోలీసు స్టేషన్లు, 85 ప్రభుత్వ భవనా లు ధ్వంసమయ్యాయి. 3500 టెలిఫోన్ తీగలు తెంచినారని ప్రభుత్వం ప్రకటించింది.

ఆందోళనలు హింసాత్మక ఘటనలు జరుగుతుంటే– కాంగ్రెస్ నాయకులు పట్టించుకోకుండా కమ్యూనిస్టులను "రష్యాఏజెంట్ల"ని "బ్రిటిష్‌వాళ్లకు అమ్ముడుపోయార"న్నారు. కాంగ్రెస్ వాళ్ళతో ఇతర పార్టీలు అదే వంత పాడాయి. కమ్యూనిస్టులు చాకచక్యం చూపకుండా తమ నిర్ణయాన్ని సమర్థించుకోవడం, ఇతర పార్టీలను పంచమాంగదళం పేర్కొనడం కమ్యూనిస్టు అభిమానులకు కూడా విస్మయాన్ని కలిగించింది. కాంగ్రెస్ నిజంగా క్విట్ ఇండియా ఉద్యమానికి సిద్ధంగా లేదని, అది ఏనాడూ ఉద్యమానికి అనుకూలంగా లేదని తెలుసు. తీర్మానం చేసిన తర్వాత ప్రజలకు పిలుపివ్వలేదు. ప్రజల ఆందోళన క్విట్ ఇండియా పిలుపుతో కాదు. నాయకుల అరెస్టులకు నిరసనగా నన్నది వారికి తెలుసు. విడుదలైన తర్వాత నెహ్రూ, సర్దార్ పటేల్, పంత్, అబ్దుల్ కలాం, ఆజాద్ , జరిగిన హింసాత్మక సంఘటనలను ఎలా సమర్థించుకుంటారని విలేకరులు అడిగిన ప్రశ్నకు చెప్పిన సమాధానం: "తీర్మానం చేశాం, కాల్స్ బహిరంగంగా ప్రకటించలేదు. ప్రజలకు పిలుపివ్వలేదు. తమంతటతాము చేసిన దానికి మేము బాధ్యులము కాము."అన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎలాంటి ఉద్యమం జరగలేదు. కానీ కమ్యూనిస్టు పార్టీ వివిధ సమస్యలపై ఆందోళన జరిపింది. కమ్యూనిస్టు నాయకుడు జార్ఖండ్ రాయ్ తూర్పు యు.పి.లో ఘాజీపూర్ ప్రాంతాన్ని, సితారాలో నానా పాటిల్ "ప్రతీ సర్కార్" పేరుతో స్వతంత్రం ప్రకటించారు.

## ప్రథమ కమ్యూనిస్టు మహాసభ

1943 మే 21నుండి జూన్ 1 వరకు బొంబాయిలో జరిగింది. పదిరోజుల పాటు జరిగిన మహాసభకు దేశ నలుమూలల నుంచీ ప్రతినిధులొచ్చారు. వారితో కళాబృందాలొచ్చాయి. ఉత్తేజపూరిత వాతావరణంలో మహాసభ జరిగింది. క్విట్ ఇండియా కాలంలోనే పార్టీ సభ్యత్వం 4500 నుండి 15,500కు పెరిగింది. ప్రజాసంఘాల సభ్యత్వం గణనీయంగా పెరిగింది. మహాసభల సందర్భంలో ప్రజాకళల వేదికగా ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ నిర్మాణం జరిగింది. పార్టీ కార్యదర్శిగా పిసి జోషి ఎన్నికయ్యారు. మహాసభ తర్వాత ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం ముమ్మరంగా సాగింది.

1944బెంగాల్ కరువు నివారణ నిధికి కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాపితంగా నిధులు, ఆహార ధాన్యాల, నిత్యావసర సరుకుల సేకరణ జరిపింది. భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బెంగాల్‌లో తెభాగా ఉద్యమం, పంజాబులో మౌంట్‌గోమరీ, పాటియాలా, బీహార్ , మలబార్ పున్నప్ర వాయలార్, తంజావూరు, రైతాంగ పోరాటాలు నడిపింది. కార్మికోద్యమాలకు నేతృత్వం వహించింది.

## అఖిల భారత కిసాన్ మహాసభ:

1944మార్చి,14, 15 తేదీలలో విజయవాడలో చరిత్రాత్మక అఖిలభారత కిసాన్ సభ మహాసభ జరిగింది. మహాసభకు గదర్ వీరులు సోహన్ సింగ్ భాక్నా, పృధ్వీసింగ్, గురుముఖ్ సింగ్, పార్టీ ప్రధాన కార్యదర్శి, పి.సి.జోషి హాజరయ్యారు. బహిరంగసభకు లక్షకు పైగా జనం వచ్చారు.

## ఫాసిస్టుల పతనం

*1945 మే 1న జర్మనీ రైఖ్‌స్టాగ్ భవనంపై ఎర్రజెండా ఎగిరింది. ఫాసిస్టుల పతనం, హిట్లరు మరణంతో ప్రపంచమంతా ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి.

* తూర్పు యూరప్ ఎరుపెక్కింది. పోలెండ్, హంగేరీ, బల్గేరియా, జెకోస్లవేకియా, యగోస్లావియా, రుమేనియా దేశాలలో సోషలిస్టు రాజ్యాలేర్పడ్డాయి.

* ఫ్రాన్సు, ఇటలీ, మరికొన్ని దేశాలతో కమ్యూనిస్టులు భాగస్వాములుగా ఐక్యసంఘటన ప్రభుత్వాలేర్పడ్డాయి. చైనా రెడ్ ఆర్మీ విజయపరంపరలతో ముందుకు సాగుతుంది. వియత్నాం, కొరియాలో యుద్ధం కొనసాగుతుంది.

* వివిధ దేశాలలో స్వాతంత్ర్యోద్యమాలకు ఉత్తేజం కలిగింది. యుద్ధం ముగిసిన తర్వాత సుభాష్‌చంద్రబోస్, ఆజాద్ హింద్‌ఫౌజ్ నాయకులు కెప్టెన్ షానవాజ్, కెప్టెన్ సైగల్, థిలాన్‌లను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసి ఎర్రకోటలో దేశద్రోహం నేరం మోపి విచారణ జరిపింది.

దానికి వ్యతిరేకంగా దేశమంతటా నిరసన ప్రదర్శనలు జరిగాయి. కమ్యూనిస్టు పార్టీ, ప్రజాసంఘాలు ఉద్యమంలో ముందు నిలిచాయి.

* 1946 జనవరి 23న బొంబాయి సముద్రతీరంలో వున్న 20 ఓడల్లోని వేలాదిమంది నావికులు బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రకటించారు. బ్రిటీష్ జెండాను తొలగించి ఓడలపై కాంగ్రెస్, కమ్యూనిస్టు, ముస్లింలీగు జెండాలు ఎగురవేశారు. తమని తాము స్వతంత్ర భారత నావికులుగా ప్రకటించుకున్నారు.


బ్రిటీష్ ప్రభుత్వం తమ నావికా సైనిక బలగాలను దింపింది. అయినా నావికులు లొంగలేదు. కమ్యూనిస్టు పార్టీ, ఎఐటియుసి వారి పోరాటానికి సంఘీభావం ప్రకటించాయి.

(ఇంకా ఉంది)

# జనం మనిషి గుర్రం యాదగిరిరెడ్డి

మట్టి మనిషిలో కాంతి దీపం ఆయన. నిజాం ముష్కర పాలనపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన ధీశాలి. మాటల తూటాలతో అగ్ని జ్వాలై ఎగిసిపడిన యుద్ధ కెరటం గుర్రం యాదగిరిరెడ్డి. అట్లాస్ సైకిల్‌లో నుంచి ఆరంభమైన జీవితం అసెంబ్లీ మెట్లదాకా కొనసాగింది. 14 ఏళ్ళ బాల్యంలో సాయుధ యుద్ధ క్షేత్రంలో క్షిపణై ప్రజ్వరిల్లాడు గుర్రం. నిజాయితీకి నిలువుటద్దమై... జనావళి మదిలో జననాయకుడు అయ్యారు. ఎరుపులోనే మెరుపు ఉంది..పోరాడే సాయుధ సమర శక్తి ఉందని గుర్రం నినదించేవాడు. గమనం.. గమ్యం.. ఘర్షణ కెరటాలను అధిగమించి ఎర్రని వేగుచుక్కగా నిలిచాడు గుర్రం. ఎర్రసంద్రంలో.. ఎరుపెక్కిన అరుణ పతాకమును ఎగురవేసి నిజాం పాలనపై పోరు సాగించి ఎర్రని నిప్పులకుంపటిలో వెలిగాడు యాదగిరిరెడ్డి. నిజాంపై నిప్పులు చెరిగి ఖాసీం రజ్వీ దురాగతాలు ఎదిరించి ఎర్రని జెండా ఎగరవేశారు. సుద్దాల యుద్ధ యోధుడు గుర్రం. ప్రజల్లో అగ్ని కెరటమై ప్రకాశించాడు గుర్రం. జీవన సంగ్రామంలో గాయాల మదిలో గేయమై ప్రజల హృదయాల్లో నిలిచారు.

మార్క్సిజం మాటలతో.. లెనినిజం బాటలో ప్రయాణం సాగించిన తొలిపొద్దు గుర్రం యాదగిరి రెడ్డి. నికార్సు అయిన రాజకీయ నాయకుడిగా ఎర్ర చొక్కా, తెల్లని దోతీని ధరించి... జనం మదిలో స్వప్నమై నిలిచాడు. గుర్రం రాంరెడ్డి లక్ష్మమ్మ రెండవ పుత్రుడుగా జన్మించారు. అవమానాలను ఎదిరించి పోరు సాగించారు. ఎగసిపడిన కెరటంలా దూసుకెళ్ళాడు. స్వామి వివేకానంద చెప్పిన మాటల్లో చెప్పాలంటే.. కెరటంలేచి పడినందుకు కాదు.. పడిలేచినందుకు ఇది అక్షరాల గుర్రం యాదగిరి రెడ్డికి వర్తిస్తుంది... అవమానాల మూటలో ఎర్ర జెండాను హత్తుకొని.. ఎత్తిన జెండాను దించలేదు.. స్వేచ్ఛా గీత మై... ప్రజల హృదయాల్లో ప్రజల మనిషిగా నిలిచాడు. మానవ త్వం కీళ్ళు విరిచి మంటల్లో ఊరేగుతున్న యుగంలో మానవతను చాటిన జనం మనిషి. నవంబర్ 22, 2019న భౌతికంగా యాదగిరి రెడ్డి దూరమైనప్పటికి ఆయన జ్ఞాపకాలు ప్రజల మదిలో పదిలంగా నిలిచిపోయాయి.



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన గుర్రం యాదగిరి రెడ్డి రామన్నపేట ఎమ్మెల్యేగా 15 ఏళ్ల పాటు ప్రజల కోసం పనిచేశారు. ప్రజల మధ్యే ఉంటూ వారి కష్ట సుఖాలను గమనిస్తూ ఆదర్శ జీవితం గడిపారు. ఎలాంటి ఆస్తిపాస్తులు సంపాదించుకోకుండా నేటి తరానికి మార్గదర్శిగా నిలిచారు. 13 వ ఏటనే తెలంగాణ సాయుధ పోరాటానికి ఆకర్షితుడై బాల సంఘంలో చేరారు. 75 ఏళ్ల పాటు కమ్యూని స్టు పార్టీలో వివిధ పదవులు పోషించారు. అప్పటి రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరసగా మూడుసార్లు తె.దే.పా మిత్రపక్షం తోడ్పాటుతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. సుద్దాల గ్రామానికి చెందిన సుద్దాల హనుమంతు, కాశ లక్ష్మయ్య, గూడ పుల్లయ్య న్యాయకత్వంలోని బాల సంఘంలో యాదగిరిరెడ్డి చేరి 11వ ఆంధ్ర మహాసభకు వెళ్ళారు. 1946లో దొడ్డి కొమురయ్య మరణాంతరం కె.రామచంద్రా రెడ్డి, దూదిపాల సత్తిరెడ్డి నాయకత్వంలో సుద్దా ల, వెలమజాల మధ్యలో వాలెంటరీల శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. 1948లో మోత్కూర్, అమ్మనబోలు, ముస్తలపల్లి పోలీస్ స్టేషన్లపై దాడికి దిగినవారిలో ఉన్నారు. సూర్యనారాయణ దళంలో గెరిల్లా శిక్షణ పొంది 14వ ఏటనే దళ ఆర్గనైజర్ అయ్యారు. గడ్డం అమీన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసారు. 1948 సెప్టెంబర్ పోలీస్ చర్య తర్వాత వీరి దళం సేర్వి ప్రాంతానికి వలస పోయింది. సైన్యం జరిపిన దాడుల్లో సూర్యనారాయణ, హనమయ్య, రాంరెడ్డి మరణించారు. పెంటయ్య మారుపేరుతో 1949 నుండి 1951 వరకు దళాన్ని యాదగిరి రెడ్డి ఆర్గనైజర్‌గా ముందుకు నిడిపించారు.

1952లో స్వగ్రామం సుద్దాలకు వచ్చి స్థానికుడైన జాలిగామ శేషగిరిరావు భూ జాగీర్‌పై పోరాటం చేసి భూపంపిణీ చేశారు. 1966లో రామన్నపేట సిపిఐ కార్యదర్శిగా పనిచేసి 1970లో అడ్డగూడూర్ లో జరిగిన 560 ఎకరాల భూపంపిణీలో పాల్గొన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా, ఉపాధ్యక్షుడిగా, పత్తిరైతుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. నల్గొండ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా రైతు సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, కార్యదర్శి వర్గ సభ్యుడిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చాలా కాలం పనిచేశారు. తొలిసారిగా 1977లో సాధారణ ఎన్నికల్లో రామన్నపేట ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు.

ఆ తర్వాత 1985లో మిత్రపక్షమైన టిడిపితో కలసి కాంగ్రెస్ అభ్యర్థి కొమ్ము పాపయ్యపై విజయం సాధించారు. 1989, 1994లో కాంగ్రెస్ అభ్యర్థి ఉప్పునూతల పురుషోత్తంపై యాదగిరి రెడ్డి ఎమ్మెల్యేగా మూడవసారి విజయభేరి మోగించారు. రామన్న పేట ఎమ్మెల్యేగా యాదగిరి రెడ్డి నియోజకవర్గ అభ్యర్థికోసం ఎంతగానో కృషిచేశారు. నియోజక వర్గ పరిధిలో సాగునీరు, తాగునీరు, విద్యుత్ గ్రామీణ రహదారులు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజాదరణ పొందారు.

స్వగ్రామం సుద్దాలలో పశు వైద్యశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఏర్పాటుకు పాటుపడ్డారు. మోత్కూర్–బిక్కేరు వాగుపై వంతెన, అమనగోలు వద్ద మూసీనదిపై వంతెన నిర్మాణం ఆయన హయాంలోనే నిర్మితమయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాల్లో పేదలకు స్వంత ఇళ్ళ నిర్మాణం, రహదారుల నిర్మాణం, చెరువులు, కుంటల అభివృద్ధి, విద్యాసంస్థలను అభివృద్ధి చేశారు.

(6వ వర్ధంతి సందర్భంగా)

గుర్రం రాంమోహన్ రెడ్డి
7981018644

## అక్రమ అరెస్టులపై శ్రీరాంపూర్ గనుల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :**సింగరేణి భవన్ ముట్టడి సమయంలో నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం శ్రీరాంపూర్ ఏరియా లోని అన్ని గనులపై కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హెచ్ఎమ్ఎస్ ఆధ్వర్యంలో ఎస్ఆర్పి 3 గని వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం సింగరేణి విభాగం అధ్యక్షులు తిప్పారపు సారయ్య మాట్లాడారు. యాజమాన్యం, ప్రభుత్వం పారిశ్రామిక సమస్యలను శాంతి భద్రతల సమస్యగా చూపిస్తూ నాయకులను అరెస్టు చేయడం, ఉద్యమాలను అణచివేయడం సరికాదని హితవు పలికారు. మెడికల్ బోర్డు, వారసత్వ ఉద్యోగాలు, సొంతింటి పథకం, ఆదాయ పన్ను సమస్యలపై యాజమాన్యం తక్షణమే స్పష్టమైన అధికారిక ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనిల్ రెడ్డి, పొనగంటి అశోక్, గుగులోత్ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/మోర్తాడ్:**కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అన్ని విధాలుగా పాటుపడుతోందని మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాముల అన్నారు. శుక్రవారం మోర్తాడ్ మండలంలోని సుంకేట్ గ్రామంలో గొర్రెల షెడ్లు, పశువుల షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, ఎపిఒ శకుంతల, ఎఎంసి డైరెక్టర్ మహిపాల్, ఆనంద్, కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు, రైతులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వెంకట్, టెక్నికల్ అసిస్టెంట్ స్రవంతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా అరికట్టడం...



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :**మండలంలో అక్రమ ఇసుక ర వాణా నిరోధించుటకు గాను గురువారం రాత్రి రెవెన్యూ, పోలీసు సిబ్బంది బట్టాపూర్ గ్రామంలో తిరుగుతుండగా రూప్లా బండ ప్రాంతంలో (14) ట్రాక్టర్ల అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును గుర్తించి సీజ్ చేసినట్లు ఏర్గట్ల తహసీల్దార్ తెలిపారు. సీజ్ చేసిన 14 ట్రాక్టర్ల ఇసుకను శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా సరఫరా చేశామని, మండలంలో ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేసినట్లయితే వాహనాలు సీజ్ చేసి వాహనాలు ఓనర్లు డ్రైవర్లపై కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు.

## పార్కిన్సన్ వ్యాధిని తొలిదశలోనే నయం చేయొచ్చు




**ప్రజాపక్షం/నిజామాబాద్:**పార్కిన్సన్ వ్యాధిని తొలి దశలో మం దు ల ద్వారా న యం చేయవచ్చని వ్యాధి ముదిరితే డీప్ బ్రెయిన్ స్టిములేషన్ అనే శస్త్ర చికిత్స ద్వారా నియంత్రివచ్చని ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బర్గోహైన్ తెలిపారు. శుక్రవారం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిబిఎస్ ద్వారా రోగుల జీవితం మెరుగుపడుతుందన్నారు. దేశంలో పార్కిన్సన్ వ్యాధి వ్యాప్తి ప్రతి లక్ష జనాభాకు 15–43 కేసుల మధ్య ఉంటుందని అంచనా వేశారు. జీవన దీర్ఘత్వం పెరుగుతుండంతో పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య కూడా పెరిగే అవకాశముందన్నారు. మెదడులో రెండు వైపులా చికిత్స చేయగలదని, ఇది రెండు అవయవాలపై ప్రభావం చూపే రోగులకు లాభదాయకమన్నారు. సమావేశంలో వైద్యులు ప్రసాద్, రుక్మిణి పాల్గొన్నారు.

## మైనారిటీ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/సదాశివపేట:** సదాశివపేట మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ స్థానిక తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ నందు శుక్రవా రం నాడు జరిగింది. ఈ పోటీలో పట్టణ ,మండలంలోని అన్న ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలలు పాల్గొన ఈ చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్ట్ లో జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెంట్ విద్యార్థులు రోహన్‌రెడ్డి ,తహేర యూసుప్, ఖాజా మొయినుద్దీన్‌లు మండల ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రీతి మేడం మాట్లాడుతూ మూఢనమ్మకాలపై జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెకుముకి టాలెంట్ టెస్ట్ లో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థాయి విజేతలుగా గెలుపొందడం సంతోషకరమని విద్యార్థులను అభినందించారు. అనంతరం మండల ప్రథమ సాయి విజేతలకు సదాశివపేట మండల విద్యాధికారి ఎస్ శంకర్ ప్రశంస పత్రం ,బహుమతులు అందజేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు,బాలయ్య, స్కూల్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్, పాల్గొన్నారు.

## కెటిఆర్‌పై తప్పుడు కేసు దుర్మార్గం

**ప్రజాపక్షం/పాపన్నపేట :**కెసిఆర్ కుటుంబాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి కెటిఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు కేసు నమోదు చేసిందని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఫార్ములా ఈ రేసుతో పాటు అనేక కంపెనీలు తెచ్చి హైదరాబాదు యొక్క కీర్తి ప్రతిష్టలను పెంచి,ప్రపంచవ్యాప్తంగా పేరు తీసుకొచ్చిన కెటిఆర్‌ను టార్గెట్ చేయడం తగదన్నారు. తప్పుడు కేసులు పెట్టి విచారణ పేరిట కెసిఆర్ కుటుంబాన్ని, బిఆర్ఎస్ పార్టీని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారని అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ ను ఏమి చేయలేదని ధీమా వ్యక్తం చేశారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :**బెల్లంపల్లిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సిఐ కె. శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం టూటౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ సాయి కిరణ్ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెడ్ కలర్ పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా 1030 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితులను బెల్లంపల్లి బస్తీకి చెందిన ఎస్‌కె కలీం, షంషీర్ నగర్‌కు చెందిన పెట్టం రాజేష్‌గా గుర్తించారు. కలీంపై గతంలోనూ గంజాయి కేసు నమోదైంది. వీరు మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు. గంజాయి రహిత సమాజం కోసం ప్రజలు సహకరించాలని కోరారు.ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ సాయి కిరణ్ పాల్గొన్నారు.

## కాపలాలేని రైల్వేగేటు



**ప్రజాపక్షం /కాసిపేట:**మందమర్రి నుంచి దేవాపూర్ సిమెంట్ కంపెనీకి వెళ్లే గూడ్స్ రైలు మార్గంలో రైల్వే గేట్ వద్ద కాపలా లేకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం మందమర్రి రైల్వే గేట్ వద్ద గేటు వేయకుండానే సిగ్నల్ ఇవ్వడంతో గూడ్స్ రైలు ముందుకు కదిలింది. అక్కడ గేటు ఉన్నప్పటికీ కాపలా ఏర్పాటు చేయకపోవడం రైల్వే శాఖ, దేవాపూర్ సిమెంట్ కంపెనీ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. నిత్యం ఈ ప్రాంతం మీదుగా మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్‌కు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికీ ప్రాణ నష్టం జరగకముందే రైల్వే గేట్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### పేదల సంక్షేమం, అభివృద్ధికి

# కృషి చేసిన ఘనత కాంగ్రెస్‌దే

### కులాస్‌పూర్ పెద్దచెరువులో చేప పిల్లలను వదిలిన రూరల్ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజామాబాద్:**రాష్ట్రంలోనే కాదు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా పేదల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మోపాల్ మండలం కులాస్‌పూర్ పెద్దచెరువులో చేప పిల్లలను రాష్ట్ర మత్స్యశాఖ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా విడుదల చేసి మాట్లాడారు. గంగపుత్రుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై చేప పిల్లలను అందిస్తోందని చెరువులను శుభ్రంగా ఉంచటం, కాలుష్యం లేకుండా సంరక్షించటం గంగపుత్రుల కీలక బాధ్యత అని సూచించారు. చెరువుల్లో పెంచిన చేపలను మార్కెట్‌లో అమ్ముకోవటంతో గంగపుత్రులకు మంచి లాభాలు వస్తాయన్నారు. సంవత్సరానికి మూడుసార్లు గంగపుత్రులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి వారికి లైసెన్సులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

**బిసిల రిజర్వేషన్లపై స్పష్టం**

కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చింది. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం బిసిలకు వ్యతిరేక దృక్పథంతో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ నిచ్చి పోటీలో దింపుతామని స్పష్టం చేశారు.

**కులాస్‌పూర్ చెరువుకు టూరిజం రూపకల్పన:**

కులాస్‌పూర్ చెరువును పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయటానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. చెరువులో దిగేందుకు మెట్లు, గట్టు పక్కన ప్రహారీ గోడ నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఫిషరీస్ చైర్మన్ శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయరెడ్డి, తహసీల్దార్, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితా అందించండి: కలెక్టర్




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను వెంటనే అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి తహసీల్దార్లు, ఎంపిడిఒలు, ఎస్ఐలతో కలెక్టర్ జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహిస్తామని తెలిపారు. గొడవలు జరిగిన, అతి సమస్యాత్మక కేంద్రాల వివరాలను అధికారుల సంతకాలతో పంపాలన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. ఈ నెల 22లోగా ఓటరు జాబితా అభ్యంతరాలను పరిష్కరించి, 23న తుది జాబితా ప్రకటించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అ మలు చేయాలని, సిబ్బందిని, సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని స్పష్టం చే శారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ లోకేశ్వర్ రావు, డిపిఒ బిక్షపతి, డిప్యూటీ క లెక్టర్ జాస్తిన్ జోల్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్ పాల్గొన్నారు.

## డొంకేశ్వర్‌లో కలెక్టర్ తనిఖీలు



**ప్రజాపక్షం/నిజామాబాద్:**డొంకేశ్వర్‌మండల కేంద్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులపై ఒక్కొ గ్రామంవారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత మందికి నో టీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ కనుగుణంగా ఆన్‌లైన్‌లో అన్ని అంశాలను అప్‌లోడ్ చేశారా తదితర వివరాలనుఅడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకనుగుణంగా సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించి స్పష్టమైన కారణాలను పేర్కొనాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను చేపడుతున్న తీరు ను పరిశీలించి పలు సూచనలు చేశారు.దరఖాస్తులు అందిన వెంటనే అర్హులైన వారిని గుర్తిస్తూ వెంటవెంటనే మంజూరీ జాబితాలు పం పాలని ఆదేశించారు. రైతు వేదికను సందర్శించిన సందర్భంగా కలెక్టర్ స్థానిక రైతులతో భేటీ అయ్యా రు.వరితో పోలిస్తే అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ పంట సాగుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని గుర్తు చేశారు. రబీ సీజన్‌కు సంబంధించి కూడా రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నరేష్ కుమార్, మండల వ్యవసాయాధికారి మధుసూదన్ ఉన్నారు.

## సమస్యల వలయంలో మహిళా భవన్..

### బాద్గుణి గ్రామంలో దుస్థితి



**ప్రజాపక్షం/నందిపేట్ :**పేరుకే మహిళ భవన్.. కిటికీలు లేవు. కనీసం డోర్‌లు లేవు. 400 మంది మహిళలు సమావేశాలకు వస్తే వారికోసం వాష్ రూంలు లేవు. ఇది ఎక్కడో కాదు నందిపేట్ మండలం లోని బాద్గుణి గ్రామంలో ఉన్న మహిళా భవన్ దుస్తితి. ఈ గ్రామంలో నిర్మించిన మహిళా భవన్ ఇంద్ర భవన్‌ల ఉంటుంది. కాని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా తయారైంది. ఎక్కడ చూసినా అంతా చెత్తా చెదారం కనిపిస్తుంది. పిచ్చి మొక్కలు పెరిగి మహిళలు భయపడేలా కనిపిస్తుంది. గ్రామంలో 43 సంఘాలు ఉన్నాయి. సుమారు 400 మంది మహిళలు ప్రతి నెల సమావేశాలు పెట్టుకుంటారు. ప్రతినెల వేల రూపాయలు వడ్డి కడుతుంటారు. కానీ శుభ్రం చేయించరు. కనీసం బాత్ రూం పనిచేయవు. లక్షలు పెట్టి భవనాలు నిర్మిస్తే వాటిని శుభ్రంగా ఉంచకపోవడం బాధాకరం. మండల అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వారికే చెల్లు. ఓట్ల కోసం అడిగే ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరం. ఇకనైనా స్పందించండి ఎమ్మెల్యే సారు...

## ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/మెదక్;**జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం జరుగుతున్న నేపథ్యంలో రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ మరింత అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధాలను తప్పకుండా పాటించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,జిల్లా ఎస్పి శ్రీనివాసరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పి శ్రీనివాస్ రావు లు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలలో గణనీయమైన తగ్గుదల సాధ్యమని తెలిపారు.అతి వేగం, ఓవర్‌టేకింగ్ దుర్వినియోగం, సిగ్నల్ జంపింగ్, ఓవర్‌లోడింగ్, హెల్మెట్/సీట్‌బెల్ట్ ఉపయోగించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా సూచించారు. ద్విచక్రవాహన దారులు ఐఎస్ఐ మార్కు హెల్మెట్, కారు ప్రయాణికులు ముందూ వెనుకా సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.చలికాలంలో పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు హెడ్లైట్లు, ఫాగ్ లైట్లు ఆన్‌లో ఉంచి, వాహనాల మధ్య సురక్షిత దూరం పాటించాలన్నారు. పాదచారులు, ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలురోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, సబ్‌వేలు ఉండే చోట్లే దాటాలనీ, ఒక్కసారి రెండు వైపులా చూసి, పరుగులు పెట్టకుండా నెమ్మదిగా దాటాలన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి తగిన సంకేత బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ ఏర్పాటు చేయడం, రోడ్డు భద్రతా కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్కూళ్లు, కాలేజీలలో రోడ్డు భద్రతా క్లబ్‌లు, అవగాహన సభల ద్వారా విద్యార్థుల్లో చిన్న వయసులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచాలన్నారు. జెడ్‌పిఎల్లయ్య, జిల్లా వైద్య అధికారిశ్రీరామ్,పోలీస్‌అధికారులుపాల్గొన్నారు.

## బొగ్గు నాణ్యతలో శ్రీరాంపూర్ ఏరియా నెంబర్ వన్

**ప్రజాపక్షం /శ్రీరాంపూర్:**సింగరేణి వ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను 75 శాతంతో శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు నాణ్యతలో ప్రథమ స్థానంలో నిలిచింది. బుధవారం హైదరాబాద్ కార్యాలయంలో జరిగిన నాణ్యత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సంస్థ సిఎండి బలరామ్ చేతుల మీదుగా ఏరియా జిఎం మునిగంటి శ్రీనివాస్, క్వాలిటీ ఇన్‌చార్జి మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి ఉత్తమ షీల్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఏరియాలోని క్వాలిటీ విభాగం అధికారులను జిఎం ప్రత్యేకంగా అభినందించారు. మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకొని వినియోగదారులను ఆకర్షించటం నాణ్యమైన బొగ్గు ద్వారానే సాధ్యమని, ఈ ఏడాది 85 శాతం నాణ్యత సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎ. వెంకటేశ్వర రెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ చిప్ప వెంకటేశ్వర్లు, ఏజెంట్లు శ్రీధర్, రవికుమార్, సిఎస్‌పి ఎస్ఇ చంద్రలింగం, పర్చేస్ అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజినీర్ నాగరాజు, సివిల్ ఇంజినీర్ సత్యనారాయణ, గ్రూప్ ఇంజినీర్ శ్రీనివాస భట్టాచార్య, వివిధ గనుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిల్‌పేట్‌లో వందేమాతర గీతాలాపన



**ప్రజాపక్షం / మందమర్రి :**వందేమాతరం గీతం ప్రచురితమై 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా మందమర్రి మండలం ఆదిల్‌పేట్ చౌరస్తాలో శుక్రవారం సామూహిక వందేమాతర గీతాలాపన నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండల నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతరం నినాదం ప్రజల్లో చైతన్యం నింపిందని, ఈ నినాదం బ్రిటిష్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టించిందని గుర్తు చేశారు. ప్రతి భారతీయుడు వందేమాతర గీతాన్ని గుండెల్లో దాచుకుంటే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డివి. దీక్షితులు, దేవర్నేని సంజీవరావు, గిరినేటి జనార్ధన్, వంజరీ వెంకటేష్, పెంచాల రంజిత్, దుర్గం మల్లేష్, బోర్లకుంట లక్ష్మ ణ్, ఎనుగందుల రాజయ్య, ధారవేణి రవి, కాపురపు వినయ్, రాచర్ల మహేందర్, కొమురోజు రాము, సుంకరి ప్రవీణ్, ఏనుగందుల సత్యం, సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుడికి బడికి వెళ్లే దారుల్లో వైన్స్

**ప్రజాపక్షం/నిజాంపేట్:**కేంద్ర ప్రభుత్వం వైన్ షాపులను జాతీయ రహదారులకు 500 మీటర్ల దూరంలో జనసంచారం లేని స్థలాలలో ఏర్పాటు చేయాలని నిబంధనలను సూచించినప్పటికీ మండల కేంద్రం లోని రెండు వైన్ షాప్‌లు నిబంధనలకు విరుద్ధంగా నిత్యం జనాలతో కిక్కిరిసిపోయే రోడ్డు పక్కన రెండు వైన్ షాపులు ఉండడం వలన వచ్చి పోయే వాహనాలకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుకు ఎదురుగా జిల్లా పరిషత్తు హై స్కూలు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి స్కూలు ఉన్నందున రోడ్డుపై వెళ్తున్న విద్యార్థులకు అనేక ఆటంకాలకు గురవుతున్నారు. బాల బాలికలు ఈ రోడ్డుపై వెళ్లాలంటే జంకుతున్నారు. జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి వైన్ షాపులను గ్రామానికి దూరాన ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ



**ప్రజాపక్షం/దండేపల్లి :**తెలంగాణ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా కృషి చేస్తుందని పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధి దండేపల్లిలోని వెంకటేశ్వర కాటన్ మిల్లులో సిసిఐ ద్వారా చేపట్టిన పత్తి కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎకరానికి 14 నుంచి 16 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉన్నందున, ప్రభుత్వ నిబంధనల్లో పేర్కొన్న 7 క్వింటాళ్ల అంశాన్ని సడలించి రైతులు నమోదు చేసుకున్న ప్రకారం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. సిఎండితో మాట్లాడి ఎల్1, ఎల్2, ఎల్3 అంశాలకు సంబంధించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. జిల్లాలో కేటాయించిన 10 కొనుగోలు కేంద్రాల్లో 6 కేంద్రాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, దళారీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. క్వింటాల్ పత్తికి రూ.8,110 మద్దతు ధర నిర్ణయించామని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ 7 క్వింటాళ్ల అంశాన్ని పరిశీలించి రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధిక దిగుబడి సాధించిన రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లి ప్రాంతాల్లో కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, జైపూర్ ప్రాంతంలో త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.




**వృద్ధుల సంక్షేమ చట్టంపై అవగాహన ఉండాలి**
**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ప్రజాపక్షం / నస్పూర్ :**వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. అంతర్జాతీయ వ యోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవనంలో నిర్వహించిన సమావేశంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజావాణిలో వృద్ధుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. వృద్ధులు tgsenior citi zens.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టే వారిపై కఠి న చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. జల సంరక్షణలో జాతీయ అవార్డు పొందిన కలెక్టర్‌ను ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు సత్కరించా రు. ఈ కార్యక్రమంలో డిసిపి ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఆర్‌డిఒ శ్రీనివాసరావు, సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, డిఇఒ ఎస్. యాదయ్య పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు : శ్రీనివాస్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అక్రమ ఇసుక రవాణా చేసే వారి పట్ల అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని మైన్స్ & జియాలజి శాఖ సహాయ సంచాలకులు పి. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ధర్మారం మండలంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న లారీ ను పట్టుకొని సీజ్ చేయడం జరిగిందని అన్నారు. లారీ తో పాటు బ్రెజా కార్ సీజ్ చేసి ధర్మారం పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని అన్నారు.
జిల్లాలో అక్రమ ఇసుక రవాణా కు పాల్పడే వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని, నిబంధనలకు లోబడి అనుమతి ఉన్న వారు మాత్రమే ఇసుక రవాణా చేయాలని ఆయన స్పష్టం చేశారు.

# బీడి కార్మికులు డిజిటల్‌లో జీవన ప్రమాణం లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి



**ప్రజాపక్షం/కోరుట్ల :** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పింఛన్ పథకం 1995 ఈపీఎఫ్ఓ ద్వారా పెన్షన్ పొందుతున్న బిడి కార్మికులు ఈ నెల చివరి వరకు జీవన ప్రమాణం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు ఆన్లైన్ ద్వారా దాఖలు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీడి వర్కర్స్ ఫెడరేషన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు తెలిపారు.పదవి విరమణ పొందిన బీడీ కార్మికురాలు తన పెన్షన్ యధావిధిగా కొనసాగించుట కోసం తాము జీవించి ఉండి ఉన్నట్టు మీసేవ ఆన్లైన్ ద్వారా వేలిముద్రలు పంపించాలని కోరారు.దీని కోసం పిపిఓ పెన్షన్ నెంబర్ ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం,మొబైల్ నెంబర్ తదితర వివరాలు ఆన్లైన్లో తెలపాలని కోరారు. లేనియెడల కొత్త సంవత్సరం నుండి పెన్షన్ నిలిపివేసే పరిస్థితి ఉంటది దీనిని కార్మికులు గమనించగలరని వెల్లడించారు.

# నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు

ఒకే రోజు నలుగురు మంత్రులను కలిసిన జువ్వాడి కృష్ణారావు






**ప్రజాపక్షం/కోరుట్ల :** కోరుట్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల మంజూరి చేయాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వడి కృష్ణారావు హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌లను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా కోరుట్ల గుండంపెల్లి, మల్లాపూర్, ఖానాపూర్, నిర్మల్ బస్సును త్వరగా ప్రారంభించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మంత్రులు నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు జువ్వాడి కృష్ణారావు తెలిపారు.

# జాతీయ కార్యశాలకు పంజాల రాజమల్లయ్య ఎంపిక

**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** భారత ప్రభుత్వం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ విభాగంలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోషన్స్ అండ్ ట్రైనింగ్ న్యూఢిల్లీ వారి సౌజన్యంతో ప్రాంతీయ కేంద్రమైన రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో పాఠ్యప్రణాళికల బోధనలో సంస్కృతిక అంశాలపై జరిగే వర్కషాప్‌కు హుస్నాబాద్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు పంజా రాజమల్లయ్య ఎంపిక అయినట్లు జిల్లా విద్యధికారి తెలిపారు. హుస్నాబాద్‌కు 2025, 20 26 ,27 వరకు డిస్టిక్ రిషోర్స్ పర్సణ్ ఎంపిక కాబడిన వర్కషాప్ ప్రధాన లక్ష్యలం ఏ మనగా ప్రథమిక స్థాయిలో సంస్కృతిక విద్యను ప్రోత్సహించడానికి డిర్పీలను బలోపేతం చేయడనికి మరియు సిసి అర్టీ నేషనల్ కల్చరల్ బలోపేతం చేయడం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. దేశ నలు మూలల నుండి 150 మంది ఉపాధ్యాయులుచపాల్గోంటునట్లు తెలిపారు. ఆయన ఎంపిక పట్లు ఉపాధ్యాయులు మండల విద్యాధికారి హర్షం వ్యక్తం చేశారు.

# 'పారమిత' ప్రసాదరావుకు 'ఇంటర్నేషనల్ లైఫ్‌టైమ్ ఎడ్యు ఐకాన్' అవార్డు

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:**పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ లైఫ్ టైమ్ ఎడ్యు ఐకాన్ అవార్డు ప్రధానం చేయబడింది. ఈ అవార్డును నిసా ఆధ్వర్యంలో డామినిక్ సేవేజ్, డైరెక్టర్ ఎడ్యుకేషన్ వరల్డ్ ఫోరమ్, యునైటెడ్ కింగ్డమ్ డా.కుల్‌భూషన్ శర్మ నిసా ప్రెసిడెంట్ చేతుల మీదుగా ఢిల్లీలోని యషో భూమిలో నవంబర్ 19న అందుకున్నారు. పారమిత విద్యాసంస్థలలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ భారత దేశంలో వివిధ విద్యాసంస్థలను సందర్శిస్తూ తాను చేస్తున్న ఈ విద్యారంగ సేవలకు గాను ఈ అవార్డును ప్రధానం చేశారు. ఈ మూడు రోజులు ఢిల్లీలోని యషోభూమిలో జరిగిన అంతర్జాతీయ విద్యా సదస్సులో భారత్, జర్మనీ, ఫిన్‌లాండ్, యునైటెడ్ కింగ్డమ్, ఆస్ట్రేలియా, ఎన్నో ఇతర దేశాల నుంచి వచ్చిన విద్యావేత్తలు పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సుకు పారమిత డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ అవార్డును అందుకున్న డా.ఇ.ప్రసాదరావును పారమిత డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, కో ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, పారమిత విద్యాసంస్థల తల్లిదండ్రులు అభినందించారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:**అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం నిరంతరం కృషి చేస్తున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో లోయర్ మానేరు జలాశయంలో వంద శాతం రాయితీతో ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో పాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై జలాశయంలో చేపపిల్లలు విడుదల చేశారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రూ.2 కోట్ల 18 లక్షల వ్యయంతో 2 కోట్ల 20 లక్షల చేప పిల్లలను చెరువులు, కుంటలు, జలాశయాల్లో విడుదల చేస్తున్నామని అన్నారు. 80 నుంచి 100 ఎంఎం సైజు గల ఈ చేప పిల్లలను విడుదల చేయడం ద్వారా సుమారు 2500 మంది మత్స్యకారులు ప్రత్యక్షంగా 1300 మంది పరోక్షంగా జీవనోపాధి పొందుతారని తెలిపారు. ఎల్ఎండిలో 30 లక్షల చేపలను విడుదల చేస్తున్నామని అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కుల వృత్తులను ఆదరిస్తూనే ఉందన్నారు. గత ప్రభుత్వం హయాంలో మత్స్యశాఖ కాంట్రాక్టర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసేలా కృషి చేస్తామని అన్నారు. మత్స్యకారుల సొసైటీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తామని తెలిపారు. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకార్మికుని కుటుంబానికి రూ.5లక్షల బీమా చెక్కును అందజేశారు. జిల్లాలో మొట్టమొదటగా మహిళా మత్స్య కార్మిక సహకార సంఘం ఏర్పాటు చేసినందుకు వారికి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందజేశారు. మత్స్యకార్మిక సంఘంలో సభ్యత్వం తీసుకున్న వారికి సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార్మిక సంఘం చైర్మన్ పిట్టల రవీందర్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయభారతి, మత్స్యకార్మిక సహకార సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# శాతవాహనలో 24 గంటల నీటి సౌకర్యం

**ప్రజాపక్షం/కరీంనగర్:**శాతవాహన విశ్వవిద్యాలయంలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి అంతర్గత పైప్‌లైన్ల ద్వారా బాలుర, బాలికల వసతి గృహాలకు 24 గంటల నీటి సౌకర్యాన్ని విసి ఉమేష్ కుమార్ ప్రారంభించారు. వేసవికాలంలో విశ్వవిద్యాలయంలోని బోర్‌వెల్స్ ఎండిపోతుండగా విద్యార్థులకు నీటి సదుపాయం చాలా కష్టంగా మారిన తరుణంలో ఉపకులపతి సంబంధిత అధికారులతో మాట్లాడి ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి నీటి సదుపాయానికి ప్రతిపాదనలు పంపి అనుమతులు తీసుకున్నారు. ఈ సంవత్సరం జులై నెలలో రాష్ట్ర బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య జాతి రవికుమార్, ఓఎస్‌డి టు విసి డా.డి.హరికాంత్, వసతి గృహాల వార్డెన్లు, ఇంజనీర్, విద్యార్థులున్నారు.

# పకడ్బందీగా పంచాయతీ రిజర్వేషన్లు

ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లాలో 508 గ్రామపంచాయతీలు, 4508 వార్డుల్లో రిజర్వేషన్ ప్రకియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. శుక్రవారం సిద్దిపేట సమీకృత కలెక్టరేట్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియ శుక్రవారం కలెక్టరేట్ పంచాయతీశాఖ అధికారులు సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎస్సి, ఎస్టి రిజర్వేషన్ల కోసం 2011 సెన్సెస్, బిసి రిజర్వేషన్ల కొరకు సీప్ 2024 ప్రకారం మొత్తం 50 శాతం రిజర్వేషన్లు ఉంచకుండ రిజర్వేషన్ ప్రక్రియ ఆయా డివిజన్‌లో ఆర్‌డిఒల నేతృత్వంలో చేపట్టాలన్నారు. గ్రామ వార్డు సభ్యుల రిజర్వేషన్లు సీప్ ప్రకారం చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ రమేశ్,డిపిఓ విజయ్‌కమార్, సిద్దిపేట,గజ్వేల్, ఆర్‌డిఒలు సదానందం. చంద్రకళ , డిఆర్‌డిఒ జయదేవ్ ఆర్య, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

**చింతమడక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మీకంగా తనిఖీ చేసిన కలెక్టర్**

సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో ప్రాథమిమక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి అకస్మీకంగా సందర్శించి రోగులను అందించే వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ వేరిఫై చేసి మెడికల్ అధికారితో పాటు మిగత వారందరు గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ అధికారి మంజుల సెలవులో ఉన్నట్లు సిబ్బంది తెలుపగా డిఎంహెచ్‌ఓకు ఫోన్‌చేసి అనుమతి తీసుకున్నారా ఆరా తీశారు. అనుమతి లేకుండ సెలవు తీసుకొని ఇష్టానుసారంగా సమయపాలన పాటించకున్న, విధులు సక్రమంగా నిర్వహించని ప్రతి ఒక్క అధికారిపై జీతంలో కోత విధించటం పాటు కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో ఐకెపి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రోజువారి లోడ్ రాగానే ట్రక్ షీట్ జనరేట్ చేయాలన్నారు. రైతులకు పెమేంట్‌లో జాప్యం లేకుండ చూసుకోవాలన్నారు. ఐకెపి సెంటర్‌లో అన్ని సౌకర్యాలు ఉండాలనిహ, తేమశాతం రాగానే గన్ని బ్యాగుల్లో నింపి వెంటనే లోడ్ చేయాలన్నారు. ఆకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలని సూచించారు.

# పోషణ, ఆరోగ్యంపై 'శుక్రవారం సభ'లో అవగాహన

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి




**ప్రజాపక్షం/కొత్తపెల్లి:**శుక్రవారం సభలో పాల్గొని మహిళలు తమ ఆరోగ్యం పిల్లల పోషణ పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ శుక్రవారం సభల ద్వారా గ్రామస్థాయిలో ప్రతి మహిళకు పోషణ, ఆరోగ్యం తదితర విషయాల పట్ల అవగాహన వస్తోందన్నారు. మహిళ తనతో పాటు తన పిల్లల పోషణ ఎలా ఉందో తెలుసుకోగలుగుతోందన్నారు. సృజనాత్మకతతో అంగన్‌వాడీ టీచర్లు విభిన్నమైన ఆట వస్తువులను తయారు చేసి చిన్నారులకు మంచి అలవాట్లు, క్రమశిక్షణ నేర్పుతారని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న విభిన్న కార్యక్రమాలతో మంచి ఫలితాలు వస్తున్నాయని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి కచ్చితంగా హాజరుకావాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బిపి, షుగర్ వంటి అన్ని వ్యాధులకు పరీక్షలతో పాటు గోలీలు ఉచితంగా ఇస్తారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సిడిపిఓ సబిత, ఇతర అధికారులున్నారు.

# పత్తి కొనుగోళ్లపై సిసిఐ ఆంక్షలు ఎత్తివేయాలి

సిరిసిల్ల సిపిఐ ఆధ్వర్యంలో వినతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** పత్తి కొనుగోళ్లపై సిసిఐ విధించిన ఆంక్షలు తక్షణమే ఎత్తివేయాలని ఎత్తివేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. జిన్నింగ్ మిల్లుల యజమానులు బందుతో వ్యాపారులు, గుమాస్తాలు,కార్మికులు ఆందోళన చెందుతున్నారని, నిరవధిక బంద్ వల్ల పత్తి లోడ్‌లతో మిల్లుల వద్ద పెద్ద ఎత్తున వాహనాలు బారులు తీరి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు అండగా ఉండాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదని, తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది మంది బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సిసిఐ ద్వారా క్వింటాలకు 8100 మద్దతు ధర కేంద్రం ప్రకటించినప్పటికీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాలనే నిబంధనలను ఏడు క్వింటాలకు కుదించడం సరికాదన్నారు. 12 శాతం తేమ పేరుతో పత్తిని కొనుగోలు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయక రైతులు దళారులకు అమ్మి మోసపోతున్నారని, పెట్టుబడి రాక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి గుంటి వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు మీసం లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

మాజీ మంత్రి హరీశ్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** పిల్లలల్లో ఉన్న ఆలోచనలకు ఒక రూపం కల్పించేది సైన్స్ ఫెయిర్.. ప్రపంచలో ఇన్నోవేషన్లు లేకపోతే మనం లేమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈరోజుల్లో ప్రపంచమంత స్టార్టప్ యుగం నడుస్తుందన్నారు. డిగ్రీ చదివిన, బిటెక్ చదివిన విద్యార్థులు మంచిమంచి ఆవిష్కరణలు చేస్తున్నారన్నారు. కరెంట్, టెలిఫోన్ లాంటివి అన్ని ఇన్నోవేషన్ నుండి వచ్చినవే అన్నారు. ఇన్నోవేషన్‌కు ఆకాశమే హద్దు.. నిరంతర ప్రక్రియ అన్నారు. శుక్రవారం సిద్దిపేట బాలికల హైస్కూల్‌లో జరుగుతున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంల పాల్గొని వివిధ ప్రదర్శనలు తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంప్యూటర్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రాజ్యమెలుతుందన్నారు. విద్యార్థుల నుండి గొప్ప గొప్ప ఆలోచనలు రావాలన్నారు. విద్యార్థుల ఆలోచనల ప్రతిరూపమే ఇన్నోవేషన్ అన్నారు. మ న కు మనం తక్కువగా అంచనా వేసుకోవద్దన్నారు. ప్రతి విద్యార్థిలో మంచి టాలెంట్ ఉంటుందని.. ప్రతి విద్యార్థి సైంటిస్టు, ఇంజనీర్ అయ్యే ప్రతిభ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థికి తన ఆలోచనలకు పదునుపెట్టి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. సైన్స్‌ఫెయిర్ విద్యార్థుల్లో ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని అందిస్తాయన్నారు. మనిషిలో ఉత్సాహాన్ని లేకపోతే ఓటమితో సమానమన్నారు. వచ్చే పదవతరగతి పరీక్షల్లో సిద్దిపేటను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషిచేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మీకేలాంటి సమస్యలున్న నా దృష్టికి తీసువస్తే సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. విద్యార్థులు ఫోన్లు, టివిలు బంద్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఇఒ శ్రీనివాస్‌రెడ్డి, సైన్స్‌ఫెయిర్ ఇన్‌చార్జి కల్లపల్లి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు మనోహర్, వివిధ పాఠశాలల ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల ఇబ్బందులు తొలగించడమే ప్రధాన లక్ష్యం



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మొగిలిపేట గ్రామంలోని ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై గుంతల మయం కావడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆర్ అండ్ బి అధికారులతో కలిసి రోడ్డును శుక్రవారం పరిశీలించారు. ప్రతిరోజు నిత్యం వందలాది వాహనాలు నడిచే గుంతల రోడ్డుపై ప్రజలు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను అధికారులకు ఎమ్మెల్యే సంజయ్ వివరించారు. ధ్వంసం అయిన రోడ్డును తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని అవసరమైన ప్రత్యేక నిధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని , నిర్మాణంలో సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన రోడ్డు నిర్మాణం చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్ అండ్ బి ఈ శ్రీనివాస్ డి సత్యనారాయణ ఏ ఈ లక్ష్మీ కాంత్, మాజీ సర్పంచ్ నాగరాజు, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జెల్లా ప్రసాద్, నాయకులు మోహన్ రెడ్డి వివిధ నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

# మత్స్యకారుల జీవనానికి భద్రత కల్పించండి

ప్రగతి మత్స్య కార్మిక సేవాసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్తేం శ్రీనివాస్



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** రాష్ట్రానికి ఆర్థిక వనరులను సమకూరుస్తున్న మత్స్యకారులను చిన్నచూపు చూడటం తగదని, మత్స్యకారుల జీవనానికి భద్రత కల్పించాలని ప్రగతి మత్స్య కార్మిక సేవాసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్తేం శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో మంథని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పోతరేని క్రాంతి కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఉస్తేం శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజ్ లను బిసిడి నుండి బిసిఎ కేటగిరీకి మార్చాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా విన్నవిస్తున్నా,ప్రభుత్వాలు తమ వినతులను నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు.దాదాపు 60 లక్షల పైచిలుకు ఉన్న ముదిరాజుల ఓటు బ్యాంకును గుర్తించాలని,లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో తమ ఐక్యతను ప్రదర్శించి ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోందని విమర్శిస్తూ, ఏడు నెలలుగా కొత్త పథకాలు ప్రవేశపెట్టకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకారులకు అత్యవసరమైన వలలు, పడవలు, ఐస్ ఫ్యాక్టరీల ఏర్పాటు, డబ్బాలు వంటి పరికరాలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. వృత్తి ప్రమాదాల బారిన పడే మత్స్యకారులకు బీమా సౌకర్యం కల్పించి, ప్రమాదం జరిగిన వెంటనే ఆ మొత్తాన్ని కుటుంబాలకు అందించాలని కోరారు. అనంతరం క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కారు పాకల రమేష్,ప్రణాళిక కమిటీ చైర్మన్ గా నూనె రాజేశం, పెద్దపల్లి జిల్లా యూత్ అధ్యక్షుడిగా తలారి సాగ ర్, జిల్లా ఉపాధ్యక్షులు దామ సదయ్య, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు కొరిమి పద్మ, కొడిమ్యాల మండల అధ్యక్షురాలు తునికి వనజ, పెద్దపల్లి మండల ఉపాధ్యక్షులు తీగల ధర్మపురి, సుల్తానాబాద్ మండల ఉపాధ్యక్షుడిగా చొప్పరి సత్యపాల్‌లకు నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు.

# మండల విద్యాధికారి కార్యాలయం ముట్టడి

మధ్యాహ్న భోజన కార్మికుల కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్

'మిడ్ డే మీల్స్' ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మ ణ్




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మధ్యహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డి మాండ్ చేస్తూ మిడ్ డే మీల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మ ణ్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. అనంతరం మధ్యహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హజరైన సిపిఐ పార్టీ జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జి గుంటి వేణు మాట్లాడుతూ గత 24 సంవత్సరాల నుండి ఎన్ని ప్రభుత్వాలు మారుతు న్న కార్మికుల జీతాలు, విద్యార్థుల మెనూ చార్జీలు పెంచకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. నిత్యవసర సరుకులు, కోడిగుడ్లు, గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే పంపిణీ చేయాలని, విద్యార్థులకు మె నూ చార్జీలు 30 రూపాయలు పెంచాలని, యూనిఫామ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మిడ్ డే మీల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మా ట్లాడుతూ గత ప్రభుత్వాల విధానాలనే ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని, టిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మొదలు పెట్టిన అల్పాహారం బిల్లులు ఇప్పటివరకు రాలేదని, నాణ్యమైన ఆహారం అందించాలంటే మెను చార్జీలు పెంచాలని కోరా రు. అలాగే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకి పెరుతున్నాయని, ఒక విద్యార్థికి ఆరు రూపాయ లు చెల్లించి, రెండు రకాల కూరలు ఎలా అందించాలో ఉపాధ్యాయులు ఆలోచించాలని అన్నారు. కార్మికుల పై అధికారుల ఒత్తిడి ఆపాలని, మెనూ చార్జీలు పెంచాలని, 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు 5000 రుపాయల పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్ డే మీల్స్ కార్మికులు లక్ష్మి , రజిత, లచ్చవ్వ, మల్లేశ్వరి, జ్యోతి, వెంకటలక్ష్మి , నరసవ్వ, కొమరవ్వ, హసీనా బేగం, రజిత, పద్మ, బీరప్ప, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృత పాఠశాల ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడలోని శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సంస్కృత పాఠశాలను ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ శుక్రవారం సం దర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, భోజనం మరియు ఫలహారాల నాణ్యత, ఉపయోగిస్తున్న సామాగ్రి తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం, నాణ్యమైన భోజనం మరియు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఉమేష్, ఆలయ ఇఇ రాజేష్, డిఇ రఘునందన్, మైపాల్ రెడ్డి, ఎఇఒ జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, పాఠశాల ఉపాధ్యాయులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



**ప్రజాపక్షం / చందుర్తి:** ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరా మహిళా శక్తి చీరలను ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి శుక్రవారం మండలంలోని చందుర్తి, మల్యాల గ్రామాలలో పంపిణీ చేశారు.మహిళా ఉన్నతి... తెలంగాణా ప్రగతి పేరిట పంపిణీ చేస్తున్న మహిళా శక్తి చీరలను మహిళ సంఘాలలో లేకపోయిన, అర్హులైన అందరికి అందజేస్తామన్నారు. దేశం లో ఎక్కడా లేని విధంగా తెలంగాణాలో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు, మండలం కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అర్హులైన 55 మంది అబ్ధి వారులకు దాదాపు రూపాయలు 55 లక్షల విలువ గల కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమం లో ఏఎంసి చైర్మన్ చెలుకల తిరుపతి,వైస్ చైర్మన బొజ్జ మల్లేశం , డిఆర్‌డిఒ శేషాద్రి , ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత , అధికారులు , నాయకులు చింతపంటి రామస్వామి,గొట్టె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థిని వందన ఎంపిక



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్‌జిఎఫ్ జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపికయ్యింది. ఈ సందర్భంగా స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆర్చరీ పోటీలు చాలా విశిష్టమైనవని, ప్రధానంగా ఏకాగ్రతను పెంపొందించడంలో చాలా కీలకంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఈ క్రీడ నియంత్రణకు ప్రత్యేకమైన కమిటీ ఉందని, ఈ కమిటీ ద్వారా పలు ఆర్చరీ క్రీడా వ్యవహారాలను కొనసాగించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొనడానికి ఆసక్తిని పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెలలో మహబూబ్‌నగర్‌లోని నెల్లికుదురులో నిర్వహింపబడిన ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 19 బాలికల ఆర్చరీ పోటీలలో కళాశాలకు చెందిన వందన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రతిష్టాత్మకంగా వచ్చేనెల డిసెంబర్ మూడోవారంలో మణిపూర్‌లో నిర్వహించబోయేటువంటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం చాలా గొప్ప విషయమని అభినందించారు. విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి జాతీయస్థాయిలోనూ కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని ఆకాంక్షించారు.

# క్రీడ

## గిల్ ఔట్.. పంత్‌కు పగ్గాలు





సిరీస్‌లో ముందంజలో ఉన్న సఫారీ టీమ్‌కు చెక్ పెట్టాలనుకున్న భారత్‌కు మ్యాచ్‌కు ముందే ఎదురుదెబ్బ తగిలింది. తొలి మ్యాచ్‌లో రిటైర్డ్ హర్ట్ అయిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పి నుంచి కోలుకుంటున్నందున జట్టుకు దూర మయ్యాడు. దాంతో.. వైస్ కెప్టెన్ పంత్ గౌహతిలో సారథిగా వ్యవహరించనున్నాడు. ఈ వేదికపై ఇదే మొదటి టెస్టు కావడంతో గెలిచేది ఎవరు? పిచ్ ఎలా స్పందిస్తుంది? అని అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. నేడు (నవంబర్ 22) రెండో టెస్టు జరుగనుంది. తొందరగా సాయంత్రం కానున్న నేపథ్యంలో మ్యాచ్ 9 గంటలకే షురూ కానుండగా.. లంచ్‌కు ముందే టీ బ్రేక్ ఇవ్వనున్నారు. సాయంత్రం 4 గంటలకే తొలి రోజు ఆట ముగియనుంది.

## రెండో టెస్టుకూ ప్రధాన పేసర్ దూరం..

### పిచ్‌పై సఫారీ కెప్టెన్ రియాక్షన్!



భారత గడ్డపై పదిహేనేళ్ల తర్వాత తొలి టెస్టు విజయంతో దక్షిణాఫ్రికా ఫుల్ జోష్‌లో ఉంది. అదే ఉత్సాహంతో గువాహటిలోనూ గెలుపుపై కన్నేసిన ఆ జట్టుకు భారీ షాక్. మొదటి మ్యాచ్‌కు దూరమైన ప్రధాన పేసర్ కగిసో రబడ రెండో మ్యాచ్ కూడా ఆడడం లేదు. గురువారం సహచరులతో కలిసి నెట్స్ సెషన్‌లో పాల్గొనని రబడ గౌహతి టెస్టుకూ దూరమయ్యాడని శుక్రవారం ఆ టీమ్ కెప్టెన్ తెంబా బవుమా వెల్లడించాడు. ఈడెన్ గార్డెన్స్‌లో సంచలన విక్టరీతో ఆధిక్యంలో ఉన్న దక్షిణాఫ్రికా సిరీస్ పట్టేయాలను కుంటోంది. గౌహతి టెస్టుకు పక్కాగా సిద్ధమవుతున్న సఫారీ టీమ్ పేసర్ కగిసో రబడ సేవల్ని కోల్పోనుంది. గురువారం నెట్స్‌లో రబడ బౌలింగ్ చేయకపోవడంతో అతడు ఆడడంపై సందేహాలు వ్యక్తమయ్యాయి. బౌలింగ్ కోచ్ పియెట్ బోథా 24 గంటల్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పాడు. కానీ, అతడి ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో గువాహటి టెస్టుకు పక్కన పెట్టేశారు. 'పక్కటెముకల గాయంతో బాధపడుతున్న రబడ ఇంకా కోలుకోలేదు. అందుకే అతడు రెండో టెస్టు ఆడడం లేదు. గువాహటి పిచ్‌ను పరిశీలించాను. అది ఉపఖండంలోని వికెట్ మాదిరిగానే ఉంది. మొదట బ్యాటర్లకు ఆపై స్పిన్నర్లకు అనుకూలించేలా పిచ్ ఉంది. ప్రస్తుతమైతే వికెట్ చాలా తాజాగా కనిపిస్తోంది. కోల్‌కతా వికెట్ మాదిరిగా అనూహ్యంగా టర్న్ తీసుకోదని అనుకుంటున్నా. మ్యాచ్ రోజు ఉదయం మరోసారి పిచ్‌ను పరిశీలించి రబడ స్థానంలో ఎవరిని తీసుకోవాలి? అనేది నిర్ణయిస్తాం. అతడి అవగాహన ప్రకారం ఆరంభంలో పిచ్ బౌన్స్ అవుతుంది. అయితే.. మ్యాచ్ సాగే కొద్ది స్లో బౌలర్లకు అనుకూలంగా మారుతుంది' అని బవుమా వెల్లడించాడు. ఈడెన్ గార్డెన్స్‌లో తొలి రెండు రోజులు వెనకబడిన సఫారీ టీమ్ అనూహ్యంగా 30 పరుగుల తేడాతో భారత్‌కు షాకిచ్చింది.

## యాషెస్ సిరీస్..

### తొలిరోజే కుప్పకూలిన ఆస్ట్రేలియా



యాషెస్ సిరీస్ తొలి మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది. తొలి రోజు బౌలర్ల ఆధిపత్యం నడువగా.. బ్యాటర్లు తోక ముడిచారు. ఇంగ్లాండ్‌ను 172కే ఆలౌట్ చేసిన ఆస్ట్రేలియా ఆనందం ఎంతోసేపు నిలువలేదు. 'మమ్మల్నే పడగొడుతారా.. ఇక మా ప్రతాపం చూసుకోండి' అంటూ ఇంగ్లాండ్ బౌలర్లు చెలరేగారు. ముఖ్యంగా పర్యాటక జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ సంచలన బౌలింగ్‌తో ఆశ్చర్యపరిచాడు. యాషెస్ టెస్టు ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన రెండో ఇంగ్లాండ్ సారథిగా అవతరించాడు. ఆస్ట్రేలియా గడ్డపై యాషెస్ సిరీస్ తొలి టెస్టు నువ్వానేనా అన్నట్టు జరుగుతోంది. తొలి సెషన్ నుంచే ఉత్కంఠ రేపిన పెర్త్ టెస్టులో మొదటిరోజే 19 వికెట్లు పడ్డాయి. బౌలర్లు వికెట్ల వేట పండుగ చేసుకున్న ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అరుదైన ఘనత సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంతితో విజృంభించిన అతడు దిగ్గజ కెప్టెన్లకు సాధ్యంకాని రికార్డు తన పేరిట రాసుకున్నాడు. ఈ మైలురాయికి చేరువైన ఇంగ్లాండ్ రెండో కెప్టెన్‌గా చరిత్రకెక్కాడు స్టోక్స్. అతడి కంటే ముందు 1982లో అప్పటి కెప్టెన్ బాబ్ విల్లిస్ ఈ రికార్డు నెలకొల్పాడు. గబ్బా టెస్టులో విల్లిస్ ఐదు వికెట్లతో కంగరూలను కష్టాల్లోకి నెట్టాడు.

### స్టార్క్ దెబ్బకు

మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్‌ను మిచెల్ స్టార్క్ (7–58) కోలుకోలేని దెబ్బతీశాడు. మిస్సైల్ లాంటి బంతులతో ఇంగ్లీష్ బ్యాటర్లను వణికించిన ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ చెలరేగడంతో స్టోక్స్ టీమ్ 172కే ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియాకు మొదటి ఓవర్లోనే జోఫ్రా ఆర్చర్ (2–11)షాకిచ్చాడు. మార్నస్ లబూషేన్(9)తో ఇన్నింగ్స్ ఆరంభించిన ఓపెనర్ జేక్ వీథర్‌లాండ్(0)ను రెండో బంతికే ఎల్బీగా వెనక్కి పంపాడు. కాసేపటికే లబూషేన్‌ను బౌల్డ్ చేసిన ఆర్చర్ వికెట్ల వేటకు తెరతీశాడు. ఆ తర్వాత బ్రైడన్ కార్సే స్టీవ్ స్మిత్(17), ఖవాజా(2)లను ఔట్ చేయగా.. అక్కడి నుంచి బెన్ స్టోక్స్(5–23) జోరు చూపించాడు. మిడిలార్డర్ బ్యాటర్లైన ట్రావిస్ హెడ్(21), కామెరూన్ గ్రీన్(24), అలెక్స్ క్యారీ(26), మిచెల్ స్టార్క్(12), స్కాట్ బోలాండ్(0)లను ఔట్ చేసి ఐదో వికెట్లతో జట్టును పోటీలోకి తెచ్చాడు. ఈ ఈ పేస్ ఆల్‌రౌండర్ ధాటికి ఆలౌట్‌కు ఒక వికెట్ దూరంలో ఉంది ఆతిథ్య జట్టు. తొలి రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్లకు 123 రన్స్ చేసిన ఆసీస్ ఇంకా 49 పరుగులు వెనకే ఉంది.

# ఫోకస్ సైన్స్

## పెరిగిన సిఎంఇలు




గత వారం చివరిలో పెరిగిన కరోనల్ మాస్ ఎజెక్షన్ (సిఎంఇ)ల కారణంగా ఆర్కిటిక్ ప్రాంతంలో కనువిందు చేసిన కాంతిపుంజాలు యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయి. అదే మయంలో సౌర చక్రం, సౌర జ్వాలలు, సిఎంఇ, సౌర తుఫానులు వంటి పదాలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. లోతుల్లోకి వెళ్లలేకపోయినా, కనీసం వాటి గురించి స్థూలంగానైనా తెలుసుకుంటే, ఖగోళ శాస్త్ర నూతన పరిశోధనలు, ఆవిష్కరణల గురించి అర్థం చేసుకోవచ్చు. వీటిలో సౌర చక్రం అనేది సూర్యుని అయస్కాంత క్షేత్రానికి సంబంధించిన సుమారు 11 సంవత్సరాల చక్రం. ఈ సమయంలో దాని అయస్కాంత కార్యకలాపాలు కొన్నిసార్లు పెరుగుతాయి. మరికొన్నిసార్లు తగ్గుతాయి. సూర్యుడు ప్రతి చక్రంలో పూర్తి అయస్కాంత ధ్రువణత భ్రమణం చెందుతాడు. దాని ఉత్తర, దక్షిణ ధ్రువాలు స్థానాలు మారుతాయి. ఈ చక్రం సౌర ఉపరితల కార్యకలాపాలను ప్రభావితం చేస్తుంది. వీటిలో 'సూర్యరశ్మి'లు (సూర్యుని ఉపరితలంపై చిన్న, చీకటి, చల్లని ప్రాంతాలు), సౌర జ్వాలలు, సిఎంఇలు ఉంటాయి. సూర్యుని మచ్చలను లెక్కించడం ద్వారా ఈ చక్రాన్ని అంచనా వేస్తారు. కార్యాచరణ అత్యల్పంగా ఉన్నప్పుడు సౌర కనిష్టంతో ప్రారంభించి, కార్యకలాపాలు గరిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు సౌర గరిష్ట స్థాయికి చేరుకుంటాయి. కాగా, సూర్యుడిపై నిరంతరం ఎగసిపడే జ్వాలలను సౌర జ్వాలలుగా పేర్కొంటారు. వీటి చుట్టూ ఉన్న అయస్కాంత క్షేత్ర రేఖలు తరచుగా చిక్కుకుపోతాయి. సౌర జ్వాలలుగా పేర్కొనే అత్యంత శక్తివంతమైన శక్తి విస్ఫోటనాలను ప్రేరేపిస్తాయి. ఈ జ్వాలలు అంతరిక్షంలోకి తీవ్రమైన రేడియేషన్‌ను విడుదల చేస్తాయి. బలమైన జ్వాలలు భూమిపై రేడియో కమ్యూనికేషన్లకు అంతరాయం కలిగించడంతో పాటు ఉపగ్రహాలు, వ్యోమగాములకు ప్రమాదాలను కలిగిస్తాయి. సిఎంఇలు సూర్యుని బయటి పొర కరోనా నుండి ప్లాస్మా,అయస్కాంత క్షేత్ర భారీ బహిష్కరణలు. సూర్యుని అయస్కాంత క్షేత్ర రేఖలు వేగంగా పునర్వ్యవస్థీకరించబడినప్పుడు సిఎంఇలు అధిక వేగంతో అంతరిక్షంలోకి వెదజల్లబడతయి. చివరిగా సౌర తుఫానులు.. ఇవి తరచు సిఎంఇ, సౌర జ్వాలలతో కూడిన అతి పెద్ద అయస్కాంత విస్ఫోటనాలు. సూర్యుని వాతావరణంలోని చార్జ్ కణాలను అధిక వేగంతో కదిలించినప్పుడు సౌర తుఫానులు సంభవిస్తాయి. ఒక ఒక సిఎంఇ భూమిని చేరుకున్నప్పుడు, అది అయస్కాంత గోళంతో సంకర్షణ చెందుతుంది. దానిని కుదించి, కదిలిస్తుంది. శక్తివంతమైన సౌర పవన కణాలు ధ్రువాల దగ్గర వాతావరణంలోకి ప్రవేశించడానికి అనుమతిస్తుంది. ఈ పరిణామాల వల్ల భూమి నుంచి చూస్తే, ఆకాశంలో రంగురంగుల కాంతి పుంజాలు కనిపిస్తాయి. వీటిని అరోరాస్ అంటారు. ఇవి నీలం, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ , నారింజ వంటి రంగులను సంతరించుకుంటూ ఉంటాయి. వీటిలో ఆకుపచ్చపసుపు అరోరాస్ అత్యంత సాధారణమైనవి. తక్కువ ఎత్తులో ఆక్సిజన్ అణువులతో అయాన్లు ఢీకొనడం వల్ల ఇవి సంభవిస్తాయి. అరోరాస్ సాధారణంగా ఆర్కిటిక్, అంటార్కిటిక్ వృత్తాల దగ్గర (సుమారు 66.5 డిగ్రీల ఉత్తరం , దక్షిణం) కనిపిస్తాయి. వీటిలో అరోరా బొరియాలిస్ అని పిలువబడే ఉత్తర దీపాలు ఉత్తర ధ్రువం దగ్గర సంభవిస్తాయి. నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, కెనడా, అలాస్కా ప్రాంతాల్లో వీటిని చూడవచ్చు. కాగా, అరోరా ఆస్ట్రాలిస్ అని పిలువబడే దక్షిణ దీపాలు దక్షిణ ధ్రువం దగ్గర సంభవిస్తాయి. అంటార్కిటికా, దక్షిణ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, చిలీ తదితర ప్రాంతాలలో ఇవి కనిపిస్తాయి.



## శూన్యంలో శక్తి!




గారడీ చేసేవాళ్లు గాల్లో నుంచి వస్తువులు సృష్టించినట్టు చూపిస్తారు. నిజానికి వారు సృష్టించకపోయినా, ఆ భ్రాంతిని కల్పిస్తారు. అలాంటి అద్భుతాలు శూన్యంలో జరుగుతాయా? అనే ప్రశ్నకు భౌతిక శాస్త్రంలో లేదనే సమాధానం వస్తుంది. కానీ, క్వాంటం ఫిజిక్స్‌లోకి వెళితే, ఇది సాధ్యమే. ఆశ్చర్యం కలిగించే ఈ పరిణామన్ని క్వాంటం ఫ్లక్చువేషన్లు అంటారు. అయితే, ఇది పూర్తిస్థాయి శాస్త్ర ఉల్లంఘన కాదు. క్వాంటం లేదా అత్యంత సూక్ష్మ స్థాయిలో జరిగిన చిన్న, తాత్కాలిక మార్పులకు సంబంధించినది మాత్రమే. హైజెన్‌బర్గ్ అనిశ్చితి సూత్రం (హైజెన్‌బర్గ్ అన్‌సర్టైనిటీ ప్రిన్సిపుల్ ప్రకారం, సూక్ష్మాతిసూక్ష్మ సమయంలోనైనాసరే, ఒక వ్యవస్థలోశక్తి గురించి పూర్తి ఖచ్చితత్వాన్ని తెలుసుకోవడం అసాధ్యం. ఈ అనిశ్చితి వల్ల విశ్వంలో ఒక్కోసారి స్వల్ప కాలం పాటు శక్తి లేకపోయినా ఉన్నట్టు గోచరిస్తుంది. అంటే ఏమీ లేని శూన్యంలో ఒక శక్తి జీవం పోసుకుంటుంది. అంతేవేగంగా మాయమవుతాయి. అంటే, దీనిని శాశ్వత శక్తి సృష్టిగా భావించడానికి వీల్లేదు. ఈ తాత్కాలిక శక్తి వల్ల వర్చువల్ కణాలు కొన్ని క్షణాల పాటు కన్పించి మాయమవుతాయి. ఒక రకంగా చెప్పాలంటే, శక్తి నియమాన్ని క్వాండం స్థాయిలో ఉల్లంఘించడానికి విశ్వం అనుమతిస్తుంది. క్వాంటం ఫ్లక్చువేషన్‌ను ఉదాహరణ ఇవ్వాలంటే, విశ్వం మొత్తాన్ని ఒక అత్యంత సున్నితమైన నీటి ఉపరితలంలా ఊహించండి. నీరు ప్రశాంతంగా ఉన్నట్టే కనిపించినా, దగ్గరగా చూస్తే అత్యంత సూక్ష్మ మైన అలలు లేదా కదలికలు కనిపిస్తాయి. అంటే నీటి పొర మనం ఊహించినట్టు స్థిరంగా లేదు. ఒక్కోసారి స్వల్ప మార్పులు ఉంటాయి. అదే విధంగా శూన్యం కూడా పూర్తిగా ఖాళీగా ఉండదు. అక్కడ కూడా చిన్న చిన్న శక్తి అలలు ఏర్పడుతూ, మాయమవుతూ ఉంటాయి. ఈ చిన్న అలలనే క్వాంటం ఫ్లక్చువేషన్లు అంటారు.



## విద్యార్థుల పక్షాన ఉద్యమాలు


### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** దేశంలో స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అని, నేడు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని పేద మధ్యతరగతి వర్గాల విద్యార్థులు చదువుకోవడం భారంగా ఉందని పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని అడ్డగోలుగా పెంచిన ఆర్టీసి బస్ పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ పిలుపునిచ్చారు. హుజురాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు విద్యార్థులు ఏఐఎస్ఎఫ్‌లో చేరగా వారికి సభ్యత్వం ఇచ్చి ఏఐఎస్ఎఫ్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్, నాయకులు సంజీవ్, నిఖిల్, అజయ్, అరవింద్, అజయ్, మౌనిక, అనిల్, గణేష్, సాయి కృష్ణ, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డెన్లను సస్పెండ్ చేయాలి

### ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలోని విద్యార్థులకు అందుబాటులో లేని వార్డెన్స్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతి పత్రం అందజేశామని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఆయన మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాలోని మండల పట్టణాలలోని షెడ్యూల్ కులాల,వెనుకబడిన తరగతుల వసతి గృహాలలోని వార్డెన్స్ విద్యార్థులకు అందుబాటులో లేకుండా వ్యక్తిగత పనులు చేసుకుంటూ, విధులకు గైర్హాజరవుతున్నారని, అధికారులకు మాత్రం హాజరవుతున్నట్లు చూపించుకుంటున్నారన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించకుండా విద్యార్థులను మాడుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలనిడిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మెనూ ప్రకారం, సరిపడు నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరామన్నారు. అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని, విద్యార్థుల వసతి గృహాల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎఐఎస్ఎఫ్ నాయకులు మామిడిపల్లి హేమంత్, గొడిసెల ప్రణీత్, కట్ల అభినయ్,తదితరులు పాల్గొన్నారు.

## భారతకమ్యూనిస్టు పార్టీది నూరేళ్ల చరిత్ర


### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (నేరేడుచర్ల) :** భారత గడ్డపై సిపిఐకి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే చారిత్రక బహిరంగ సభకు లక్షలాదిగా తరలిరావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, బిసి హక్కుల సాధన సమితి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం నేరేడుచర్లలో వివిధ మండలాల సిపిఐ కార్యదర్శులు, జిల్లా స్థాయి ప్రజాసంఘాల బాధ్యులతో కలిసి వారు మాట్లాడుతూ ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి సిపిఐ వెళ్ళి ఆ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు కలబడి, నిలబడి పోరాటం చేస్తుందన్నారు. ఆ పోరాట చరిత్ర పునాదిగానే గత వందేళ్లుగా అధికారం రాకపోయినా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఏకైక వామపక్ష పార్టీ సిపిఐ అని తెలిపారు. కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, రైతు, మహిళ ప్రజాసంఘాలను నిర్మించి వారి హక్కులకై నినదించి రాజీలేని పోరాటాలు కొనసాగించిందన్నారు. ఈ శతాబ్ధంలో ఎన్నో పోరాటాలు, ఎన్నెన్నో త్యాగాలు, ఎంతో మంది అమరవీరుల రక్తతర్పణంతో ఎన్నో విజయాలు సాధించి భారతదేశ రాజకీయ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నది సిపిఐ అన్నారు. 40 దేశాల్లోని ప్రతినిధులు హాజరవుతున్నారని, లక్షలాది మంది కార్యకర్తలు ఈ బహిరంగ సభకు తరలివస్తున్నారని తెలిపారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా నుం చి ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని, ఇంటికో మనిషి, వీధికో బండి బయటకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు. నేరేడుచర్ల మండలకార్యదర్శికత్తి శ్రీనివాసరెడ్డి, పాలకవీడు కార్యదర్శి ముళ్ళ జానయ్య, మఠంపల్లి కార్యదర్శి అమరారపు పున్నయ్య,ఏఐవైఎఫ్‌జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ లక్ష్మి , బిసి హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్, బెల్లంకొండ గోవిందు గౌడ్, తిప్పన రాంరెడ్డి, కొండ అంజయ్య, ఎస్‌కె మధార్, బొల్లం అశోక్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న భోజన' మెనూ చార్జీలు పెంచరా?

### 'మిడ్ డే మీల్స్' ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్





**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మధ్యహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మిడ్ డే మీల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ ఆధ్యర్యంలో మండల విద్యాధికారి కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. అనంతరం మధ్యహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐజిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జి గుంటి వేణు మాట్లాడుతూ గత 24 సంవత్సరాల నుండి ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల జీతాలు,విద్యార్థుల మెనూ చార్జీలు పెంచకుండా శ్రమ దోపిడి చేస్తున్నారన్నారు. నిత్యవసర సరుకులు, కోడిగుడ్లు, గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే పంపిణీ చేయాలని, విద్యార్థులకు మెనూ చార్జీలు 30 రూపాయలు పెంచాలని, యూనిఫామ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మిడ్ డే మీల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గత ప్రభుత్వాల విధానాలనే ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని, టిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మొదలు పెట్టిన అల్పాహారం బిల్లులు ఇప్పటి వరకు రాలేదని, నాణ్యమైన ఆహారం అందించాలంటే మెను చార్జీలు పెంచాలని కోరారు. అలాగే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నిత్యవసర వస్తువుల ధరలు రోజు రోజుకి పెరుగుతున్నాయని, ఒక విద్యార్థికి ఆరు రూపాయలు చెల్లించి, రెండు రకాల కూరలు ఎలా అందించాలో ఉపాధ్యాయులు ఆలోచించాలని అన్నారు. కార్మికుల పై అధికారుల ఒత్తిడి ఆపాలని, మెనూ చార్జీలు పెంచాలని, 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు 5000 రుపాయల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, అలాగే జీతాలు పెంచాలని, లేనియెడల వచ్చే నెల పదో తేది నుండి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. మిడ్ డే మీల్స్ కార్మికులు లక్ష్మి , రజిత, లచ్చవ్వ, మల్లేశ్వరి, జ్యోతి, వెంకటలక్ష్మి , నరసవ్వ, కొమరవ్వ, హసీనా బేగం, రజిత, పద్మ, బీరప్ప, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

## 'నేడు' గీతపనివారల రాష్ట్ర సదస్సు

### రంగారెడ్డి జిల్లా గీత పనివారల సంఘం కార్యదర్శి శ్రీశైలంగౌడ్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైద్రాబాద్ వద్ద ఈ నెల 22న గీత పనివారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా గీతపనివారుల సంఘం కార్యదర్శి కనకమామిడి శ్రీశైలంగౌడ్ పిలుపునిచ్చారు. లక్షలాది మంది గౌడ కులాల ప్రజలు కల్లుగీత వృత్తిలో కొనసాగుతూ మృత్యువాత పడ్డవారికి ఎక్స్‌గ్రేషియా అందించాలని, వృద్యాప్య పెన్షన్ ఇవ్వాలని, వృత్తి అధునీకరణ, పరిశ్రమగా రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి పానీయం కల్లు, నీరా లను ప్రభుత్వం ప్రోత్సహించాల్సింది పోయి మద్యం, బెల్టు దుకాణాలు రాజ్యమేలేల పహయ,సహకారాలు అందిస్తూ గౌడ కులస్థులకుఅన్యాయంచేస్తున్నారనిఆగ్రహం వ్యక్తం చేశారు. గౌడ కులస్థులకు న్యాయం చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. శనివారం జరిగే గీత పనివారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని శేరిలింగంపల్లి గీత పనివారుల సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కనకమామిడి శ్రీశైలంగౌడ్ పిలుపునిచ్చారు. అన్ని వసతులు కల్పించామన్నారు. హాఫిజ్‌పేట్ గీతపనివారుల సంఘం అధ్యక్షులు ఆనంద్,సభ్యులు వెంకటేష్ గౌడ్, నరేందర్ గౌడ్, బాబు గౌడ్, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



### ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బాల్‌నగర్ సామాజిక ఆరోగ్య కేంద్ర పడకల తగ్గింపు నిర్ణయం ఉపసంహరించుకోవాలని, కాలం చెల్లిన పాత టెండర్లను రద్దు చేసి, పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు 26 వేల రూపాయలు వేతనం అందే విధంగాకొత్త టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎఐటియుసి డిమాండు చేసింది. అంతేగాక శుక్రవారం హైదరాబాదు కోఠిలోని తెలంగాణవైద్యవిధానకమిషనర్‌డాక్టర్‌అజయ్ కుమార్ కి ఎఐటియుసి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్,తెలంగాణమెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడారు.ప్రభుత్వ ఆసుపత్రులలో ఆక్యుపెన్సి తగ్గిందని కుంటి సాకుతో వైద్య విధాన పరిషత్ ఉన్నత అధికారులు ఆసుపత్రుల పడకల సామర్థ్యం తగ్గించడం చాలా బాధాకరమైన ఆవేదన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులను అర్థాంతరంగా తొలగింపులకు గురవుతున్నారని లేకపోతే వచ్చిన బడ్జెట్లోనే తలా కొంత పంచుకునే దుస్థితి నెలకొన్నదని అన్నారు. అలాగే ఇంటి గ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (ఐహెచ్ఎఫ్ఎంఎస్) ద్వారా పారిశుధ్యం, భద్రత, రోగి సంరక్షణ నిర్వహణ కోసం మూడు సంవత్సరాల కాల వ్యవధితో ఏజెన్సీలను ఎంపిక చేసే విధానం కొనసాగుతుందని, ప్రస్తుతం కొనసాగుతున్న ఏజెన్సీలు 2022లో ఎంపిక చేశారని, కాల పరిమితి ముగిసినా కొత్త టెండర్ల ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. కనీస వేతనం రూ.26000 అందే విధంగా, పండగ, జాతీయ, ఆర్థిక సెలవులు పొందుపరుస్తూ న్యూ టెండర్ పాలసీని విడుదల చేయాలని డిమాండు చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నేతలు పి.సురేష్, సుధాకర్, ఓమయ్య, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## సిపిఐ బస్సు జాతాకు స్వాగతం పలికిన చింతకాని మండల నాయకులు



ప్రజాపక్షం/చింతకాని : సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ సందర్భంగా గద్వాల నుండి కొత్తగూడెం వరకు నిర్వహించే ప్రచార బస్సు జాతాకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ(ఎంఎల్‌సి) నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నర్సింహాకు వి.వెంకటాయపాలెం వద్ద సిపిఐ చింతకాని మండల సమితి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. నక్కనబోయిన శ్రీను, అమర్లపుడి వెంకన్న, ఆవుల మంగయ్య, పుల్లారావు, షేక్ దస్తగిరి, కొల్లి బాబు, దావిద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/ మధిర : మధిర మండలం మధిర పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, సొసైటీ అధ్యక్షులు బిక్కి కృష్ణప్రసాద్, తహశీల్దార్ ఆర్.రాంబాబుతో కలిసి ప్రారంభించారు.ధాన్యం దిగుబడి ఎలా ఉంది అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆహర్నిశలు కష్టపడి పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.ఎగ్రేడ్ రకానికి రూ.2389, సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధర కల్పిస్తుందని, సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూ చించారు. ఎఓ కనకం సాయిదీక్షిత్, ఎఇఓ అమృత, సొసైటీ సిఇఓ దామ శ్రీనివాసరావు, ఎఎంసి వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి , టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, ఎఎంసి డైరెక్టర్లు అద్దంకి రవి కుమార్, షేక్. షన్ను, వేల్పుల చెంచయ్య, ఆత్మ డైరెక్టర్ గోపాలరావు, నాయకులు కర్నాటి రామారావు, పత్తేపురపు సంగయ్య పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

మార్గాలలో భారీ కందకాలను తీయించిన అధికారులు



ప్రజాపక్షం/బూర్గంపాడు:బూర్గంపాడు మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీస్, రెవిన్యూ శాఖల అధికారులు కన్నెర చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మండల పరిధిలోని నాగినేనిప్రోలు గొమ్మూరు, సారపాక గోదావరి ఇసుక రేవు వద్ద అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు జేసిబిలతో కందకాలను తవ్వించారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయడంలో భాగంగా తహసీల్దార్ కెఆర్‌కె ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న అక్రమ దారులను గుర్తించారు. ఈ క్రమంలో తహసీల్ధార్ కెఆర్‌కె ప్రసాద్, బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్, అదనపు ఎస్ఐ నాగబిక్షం స్వయంగా పాల్గొని కందకాలను జెసిబి సహాయంతో కందకాలను తవ్వించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నిరంతరం నిఘా ఉంటుందని, నింబధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ ఆకస్మిక కందకాల తవ్వకంతో ఇసుక అక్రమ రవాణాదారుల్లో గుబులు మొదలైంది.

## సింగరేణి జిఎంను కలిసిన ఎఐటియుసి ప్రతినిధి బృందం



ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ నందు ఏఐటీయూసీ సత్తుపల్లి బ్రాంచ్ ఆఫీస్ బేరర్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశం అనంతరం సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ఏఐటియూసి బృందం సత్తుపల్లి బ్రాంచి సెక్రెటరీ సముద్రాల సుధాకర్ ఆధ్వర్యంలో కలిసి, జే.వి.ఆర్ కిష్టారం ఓసిలతో పాటు, పివి నరసింహరావు కాలనీ లో ఉన్న స్థానిక సమస్యలను వివరించి,పరిష్కరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిఎం శ్రీనివాస్ సానుకూలంగా స్పందించినట్లు ఏఐటియూసి నాయకులు తెలిపారు. బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ దారా భీమయ్య, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ సూర్య ప్రకాష్, బ్రాంచి ఆర్గనైజింగ్ సెక్రటరీ భరణి, బ్రాంచి ట్రెజరర్ దమ్మాలపాటి నరసింహారావు, జేవిఆర్ఓసి ఫిట్ సెక్రటరీ నరసింహారావు, బ్రాంచి ఆఫీస్ బేరర్ బి సుధాకర్ తదితరులున్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



ప్రజాపక్షం/ మధిర : మధిర మెయిన్‌రోడ్డులో అపోలో మెడికల్ షాపు నందు శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని మధిర మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపోలో మెడికల్స్ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని మధిర పట్టణ వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా అపోలో వారి రకరకాల ఉత్పత్తులు డిస్కౌంట్ ధరలకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, మధిర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చారుగుండ్ల నర్సింహామూర్తి, అపోలో మేనేజర్ రవీంద్రరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మురళీ, తెలంగాణ క్యాంప్ ఇన్‌చార్జి అనురాగ్ పాల్గొన్నారు.

## వనజీవి కీర్తిని చాటేందుకు బయోపిక్

ప్రజాపక్షం/ఖమ్మం : వనజీవి కీర్తిని విశ్వ వ్యాప్తంగా చేసేందుకే ఆయన బయోఫిక్ నిర్మాణం చేపట్టినట్లు సినీ నటుడు బ్రహ్మాజీ, దర్శకుడు వేముగంటి తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరం శివారులోని నేచర్ వ్యాలీలో వనజీవి రామయ్య చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. నగర మేయర్ పునుకొల్లు నీరజ ముఖ్య అతిథిగా హాజరై క్లాప్ కొట్టారు. కుటుంబం కంటే మొక్కలను ప్రేమిస్తూ మొక్కలను పెంచడమే తన ధ్యే యంగా జీవితాన్ని గడిపిన మహానుభావుడు వనజీవి రామయ్య అన్నారు. ఆ గొప్ప వ్యక్తి కీర్తి భావితరాలకు తెలిసేలా చిత్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. ప్రకృతి పరిరక్షణే బాధ్యతగా సినిమాను నిర్మిస్తున్నామన్నారు. సమాజానికి సేవ చేసే లక్ష్యంలోనే వనజీవి రామయ్య సినిమా తీస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నటి నాగరాణి, వనజీవి రామయ్య సతీమణి జానకమ్మ, నిర్మాతలు చంద్రశేఖర్,రమణ, సంగీత దర్శకుడు మోహన్, గుణయాది, సరిపూడి సతీష్, మట్టా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత గడ్డపై సిపిఐకు వంద ఏళ్ళు

మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు
కొత్తగూడెం చేరిన సిపిఐ ప్రచార జాతా
సరిహద్దుల్లో ఘన స్వాగతం
పలు చోట్ల సభలు



ప్రజాపక్షం/ఇల్లందు: భారత కమ్యూనిస్టు శతజయంతి ఉత్సవాలలో భాగంగా నవంబర్ 15 నుండి 25 వరకు తలపెట్టిన ప్రచారంలో భాగంగా శుక్రవారం ఇల్లందు చేరుకున్న బస్సు ప్రచార జాతకు సిపిఐ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.కే. సాబీర్ పాషా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ మాట్లాడుతూ భారతదేశ ప్రజలకు స్వతంత్రం కోసం అనంతరం తెలంగాణ సాయుధ పోరాట వెట్టి చాకిరీ విముక్తి కోసం బానిసత్వం నుండి భూస్వాములు రజాకర్ల నుండి ప్రజలను విముక్తి కల్పించి, పేద ప్రజలకు లక్షలాది ఎకరాల భూములను పంచిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని నిరంతరం ప్రజా పోరాటాల్లో నిమగ్నమైన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశంలో రాష్ట్రంలో మారుతున్న రాజకీయాల నేపథ్యంలో ఐదేళ్లు అధికారంలో లేకుంటే కానరకుండా పోయే పార్టీలు ప్రజల అధికారంలో ఉన్నప్పుడు కనీసం ప్రజలు అవసరాలను కూడా తీర్చలేని పార్టీల కన్నా ఈ రోజు ధరలు పెరిగిన ఎల్లప్పుడు కార్మిక వర్గానికి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసేది ఒక కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజాక్షేత్రంలో ఈ భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీని అన్నారు. ఒకప్పుడు కార్మికులతో కళకళలాడిన ఇల్లందు ఈరోజు మూగబోయిందని ఉన్న బొగ్గు బావులు మూతపడి కార్మికులందరూ వేరే చోటుకి ట్రాన్స్ఫర్ అయిపోయాని, మళ్లీ తిరిగి ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఈ ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తూ అభివృద్ధి దిశగా ప్రయాణించడానికి కొత్తగూడెం ఎంఎల్యే కూనంనేని సాంబశివరావు ప్రజావాణిని అసెంబ్లీలో వినిపించడమే కాక ప్రభుత్వంతో మాట్లాడి ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేయాలని గుర్తు చేశారు. అదే విధంగా 21 ఫీట్ ఏరియా సింగరేణి నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఈ ప్రాంతాన్ని రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించి, కొమరారం, బోడు, సుదిమల్ల మండలాలుగా ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి నీటి వనరులు తీసుకువచ్చి ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ఈ ప్రభుత్వంపైన ఉందని వారు అన్నారు. ఈ ప్రచార జాతలో మహబూబాబాద్ పార్టీ జిల్లా కార్యదర్శి బి విజయసామిరెడ్డి, డిహెచ్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కాశిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు బాస శ్రీనివాసరావు, బొప్పిశెట్టి సత్యనారాయణ, బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉమ్మగాని హరీష్, మాజీ కౌన్సిలర్ రవీందర్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి దాసరి రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/ఖమ్మం : కమ్యూనిస్టులతోనే అనేక హ క్కులు సాధించబడ్డాయని భూ పంపిణీ, బ్యాంకుల జాతీయకరణ సహా అనేక చారిత్రాత్మక ఘట్టాలకు కమ్యూనిస్టుల పోరాటమే కారణమని శాసన మండలి సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లికంటి సత్యం తెలిపారు. వందేళ్ల సుదీర్ఘ పోరాటంలో సామ్రాజ్యవాదానికి స్వాతంత్ర్య అనంతరం తెలంగాణ రాచరికానికి వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు పార్టీకే ఉందని ఆయన అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా గద్వాల్‌లో బయలుదేరిన సిపిఐ శతాబ్ది ఉత్సవ ర్యాలీ శుక్రవారం ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లా సరిహద్దు పైనంపల్లి వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, కర్నాటి భానుప్రసాద్, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మిడికంటి వెంకటరెడ్డి, ఏనుగు గాంధీ, కూచిపూడి రవి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం, వి.వెంకటాయపాలెం, కొణిజర్ల, వైరా, ఏన్కూరు ద్వారా పయనించి జాతా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశించింది. ఖమ్మం తొలి శాసన సభ్యుడు కర్నాటి కృష్ణయ్య స్మారక స్తూపానికి సిపిఐ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ పార్టీ పతాకాన్ని బాలనర్సింహా ఆవిష్కరించారు. సభలలో బాగం హేమంతరావు నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాలమల్లేష్ తదితరులు ప్రసంగించారు. సిపిఐ నేతలు మాట్లాడుతూ జాగీర్‌దార్లు, జమీందార్లకు వ్యతిరేకంగా పోరాడి సమాజ చైతన్యానికి కృషి చేసిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. అనేక మంది యోధుల అనన్య త్యాగాలతో ఈ జెండా ఎరుపెక్కిందన్నారు. దారి పొడవునా సిపిఐ పతాకాలను ఆవిష్కరిస్తూ జాతా ముందుకు సా గిందని. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, మ హ్మద్ సలాం, బిజి క్లెమెంట్, సిపిఐ జిల్లా కా ర్యవర్గ స భ్యులు దొండపాటి రమేష్, పగడాల మల్లేష్, మే కల శ్రీ నివాసరావు, పలువురు జిల్లా కౌన్సిల్ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, నూనె శశిధర్, వరదా నర్సింహారా వు, ఎం. వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## అసమాన త్యాగాలు,వీరోచిత పోరాటాలు సిపిఐదే

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు
బాల నరసింహ



ప్రజాపక్షం/ముదిగొండ: అసమాన త్యాగాలు, విరోచిత పోరాటాలు చేసి దేశ స్వాతంత్రం, తెలంగాణలో నైజాం విముక్తి, కార్మిక చట్టాలు తెచ్చిన ఘనత సిపిఐ దేనని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలనరసింహ అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో డిసెంబరు 26న నిర్వహించే శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని కోరుతూ గద్వాల నుంచి కొత్తగూడెం వరకు నిర్వహించే ప్రచార జాతా 7వ రోజు ముదిగొండకు శుక్రవారం చేరుకుంది. సిపిఐ, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ప్రచార జాతా ప్రతినిధులుగా విచ్చేసిన ఎంఎల్‌సి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలనరిసింహలకు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌లు జాతాను ముందుండి నడిపారు. ముందుగా మండల కేంద్రంలోని ప్రధాన కూడలి ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌కు పూలమాల వేశారు. అనంతరం ముదిగొండ అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) భారతదేశంలో ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్యమాల ఖిల్లా ఖమ్మం పట్టణంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి శతాబ్ది ఉత్సవ ముగింపు భారీ బహిరంగ సభకు ఊరూ వాడ కదలి జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతాలలో ఒకటైన జాతాకు ఘన స్వాగతం పలికిన సిపిఐ ముదిగొండ మండల సమితికి, వామపక్షవాదులకు అభినందనలు తెలిపారు. స్వాతంత్ర ఉద్యమ కాలం నుండి 100 సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. స్వాతంత్రం కోసం ఎంతో మంది నాయకులు, యువత ప్రాణాలర్పించారన్నారు. స్వతంత్ర ఉద్యమ కాలంలో బ్రిటిష్ వారు కుట్ర కేసులు పెట్టి నిర్భందించినప్పటికీ ఉద్యమాలకు వెనుకాడ లేదన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ఆర్థిక అసమానతలు తొలగించాలని, వ్యవసాయ కార్మిక, యువజన సంఘాల సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం, దున్నేవాడిదే భూమి కావాలని, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, ఆనా డు సాయుధ రహితంగా పోరాటం నడిపించిన ఘనత కమ్యూనిస్టు పార్టీలదే అన్నారు.

## బస్టాండ్‌ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

మంత్రి పొన్నంకు ఎమ్మెల్యే రాగమయి విజ్ఞప్తి



ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గం లోని బస్టాండ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కు సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద విజయ్ కుమార్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, మండలాల్లో గల బస్టాండ్ లను అభివృద్ధి చేయాలని, మౌలిక వసతులు కల్పనకు అవసరమైమ రూ.1.90 లక్షల నిదులు విడుధల చేయాలని కోరారు.మంత్రి పొన్నం త్వరలోనే నిధులు మంజూరు చేసి బస్టాండ్ లను అభివృద్ధి చేసి, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తానన్నట్లు తెలిపినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటన విడుధల చేసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కలుసుకుని రైతుల సమస్యలు, ఆయన దృష్టికి తీసుకెళ్ళారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మండల విద్యాశాఖ అధికారి బి. చలపతిరావు

ప్రజాపక్షం/నేలకొండపల్లి : విద్యార్థులు మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవడంతోపాటు సమాజాభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి బాలిన చలపతి రావు, మండల పరిషత్ పర్యవేక్షణ అధికారి సిహెచ్ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం జన విజ్ఞాన వేదిక నేలకొండపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ను వారు ప్రారంభించారు. టాలెంట్ టెస్టులో మండల వ్యాప్తంగా 17 ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానాన్ని గౌతమ్ కాన్సెప్ట్ స్కూల్, ద్వి తీయ స్థానాన్ని కొత్త కొత్తూరు ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్, తృతీయ స్థానాన్ని చెరువుమాదారం చైతన్య భారతి విద్యాలయం గెలుచుకున్నాయి. పోటీలలో గెలుపొందిన విజేతలకు జన విజ్ఞాన వేదిక వారు బహుమతులు అందజేశారు. ఎన్ .జయరాజు,ఇ.వెంకటేశ్వర్లు, బి రవి, కన్నెగంటి వెంకటయ్య, బి.తిరుమల ప్రసాద్, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్‌కు ముందే చీరల పంపిణీ

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి
తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎన్నికల నోటిఫికేషన్ నాటికి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇంటికి వెళ్లి బొట్టుపెట్టి ఇందిరమ్మ చీర అందించాలని ఆయన సూచించారు. శుక్రవారం రఘునాథపాలెం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెంలో సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకానికి అనుసంధానంగా సబ్ స్టేషన్ నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. సంక్రాంతి నాటికి సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయ్యేలా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు.కామేపల్లి,రఘునాథపాలెం మండలంలోని చెరువులను వేసవి నాటికి నింపాలని తుమ్మల అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగును పెంచాలని ఆయిల్ పామ్‌తో పాటు అంతర్ పంటలను సాగు చేయాలన్నారు. గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ సంక్రాంతి నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో జరగాలని అధికారులను ఆదేశించారు.డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ మహేందర్, ల అధికారులు పాల్గొన్నారు.

## వైరాలో సిపిఐ జాతాకు ఘనస్వాగతం

బైక్ ర్యాలీతో కొనసాగిన బస్సు యాత్ర




ప్రజాపక్షం/వైరా: సిపిఐ వంద సంవత్సరాల పండుగ ముగింపు సభ నేపద్యంలో చేపట్టిన బ స్సు జాతా కార్యక్రమం శుక్రవారం వైరా నియోజకవర్గంలో కొనసాగింది. కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని బ్రౌన్స్ కాలేజ్ వద్ద వైరా నియోజకవర్గ సిపిఐ నాయకులు, కార్యకర్తలు ఈ బస్సు జాత నాయకులు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలనరసింహ, ఎమ్మెల్సీ నేలకంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి రమేష్, సిపిఐ జిల్లా కార్య సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డితో పాటు పలువురు సిపిఐ జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు స్వాగతం పలికారు. బస్సు జాత తనికెళ్ల, కొణిజర్ల, పల్లిపాడు , వైరా స్టేజిపినపాక మీదుగా కొనసాగింది. తనికెళ్ల గ్రామంలో కామ్రేడ్ స్వర్గీయ గడల సీతారామయ్య స్థూపానికి కొణిజర్లలో కామ్రేడ్ స్వర్గీయ దొండపాటి వెం కయ్య స్థూపానికి నివాళి అర్పించారు. ఈ నెలన ఖమ్మంలో జరిగే సిపిఐ 100 సంవత్సరాల ముగింపు సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయ వ తంం చేయాలని అన్నారు. సిపిఐ పార్టీ ప్రజా ఉద్యమాల్లో 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ ఎన్నో సమస్యల కోసం పోరాటాలు చేసి ప్రజల పక్షాన నిలబడిన పార్టీ అని వారు అన్నారు. ఎ ంతోమంది అమరులు ప్రజా ఉద్యమాల్లో ప్రాణాలను సైతం వదిలారని గుర్తు చేశారు. సిపిఐ నాయకులు యర్ర బాబు, దొండపాటి రమేష్, వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, పివి.రావు, మనిగ కోటేశ్వరరావు, అచ్చన శ్రీనివాసరావు, మిట్టపల్లి రాఘవరావు, రామకృష్ణ, బండారు ముత్తయ్య పాల్గొన్నారు.

## వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్

ఎన్‌సిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: గుండాలలో వోల్టేజ్ సమస్య లేకుండా గుండాల, ఆళ్లపల్లి సబ్ స్టేషన్లలో 5 ఎంవిఎ బూస్టర్లు ఏర్పాటు చేశామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. వీటి ఏర్పాటుతో ఎటువంటి లో వోల్టేజ్ సమస్య ఉండదని వివరించారు. వినియోగదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గుండాల, ఆళ్లపల్లి మండలాలలో వివిధ గ్రామాలలో(లింగగూడెం, సాయన్‌పల్లి, గుండాల, ముత్తాపురం, మామకన్ను)పర్యటించిన సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త వ్యవసాయ సర్వీసుల మంజూరుకు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా మంజూరుకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. గృహ సర్వీసులకు జుగాలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎక్కడ అంతరాయం లేకుండా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/కొడకండ్ల:** మండల కేంద్రంలోని బయన్న వాగుపై రూ.9కోట్ల 35 లక్షల వ్యయంతో నిర్మించబోయే రెండు చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంలో చెక్‌డ్యామ్‌లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. బయన్న బాగుపై నిర్మించబోయే ఈ రెండు చెక్ డ్యామ్‌లు నీటి నిల్వ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి, పరిసర గ్రామాల గ్రౌండ్ వాటర్ స్థాయిలను మెరుగుపరుచనున్నాయన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత ప్రాంతంలో శాశ్వత నీటి వనరులు అందుబాటులోకి వచ్చి, వ్యవసాయ రంగం మరింతగా పుంజుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, మండల అధ్యక్షులు సురేష్ నాయక్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాయికృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు, రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి




**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశం అని రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సమాచార హక్కు చట్టం, అప్పీళ్ల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల పౌర సమాచార అధికారులతో సమీక్షా సమావేశాన్ని రాష్ట్ర సమాచార కమిషనర్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల పౌర సమాచార అధికారులు తమ తమ శాఖల పరిధిలో సమాచార హక్కు చట్టం కింద దాఖలైన వాటి సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తులు, ఇంకా పరిష్కరించాల్సిన వాటి గురించి రాష్ట్ర సమాచార కమిషనర్ కు వివరించారు. సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను ప్రభుత్వ కార్యాలయాల పౌర సమాచార అధికారులు అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డి ఆర్ ఓ గణేష్, ఆర్డీఓ రమేష్ రాథోడ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం పెండింగ్ లో ఉన్న ఆర్టీఐ దరఖాస్తులపై ఆర్టీఐ కమిషనర్ విచారణ నిర్వహించారు. సంబంధిత పీఐవో అధికారులు, దరఖాస్తుదారుల నుండి వివరాలు స్వీకరించి పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేశారు.హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో సమాచార కమిషనర్ అయోధ్య రెడ్డి పాల్గొనగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ రాథోడ్ రమేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో సమాచార హక్కు చట్టం దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి: ఎమ్మెల్యే రేవూరి



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల పట్టణంలోని కుంకుమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మహా రుద్ర యాగం కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలను వెలకట్టలేమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం కుంకుమేశ్వర స్వామి ఆలయంలో పారిశుధ్య కార్మికుల కు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని వారికి బట్టల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా ఆ ప్రాంతంలో వారు చేసిన పనికి ప్రజలు మెచ్చుకున్నారని ఆయన తెలిపారు. వారు చేసిన కష్టం మొదట్లో వర్షార్పణం కాగా రెండవసారి గట్టి పట్టుదలతో దేవాలయ కమిటీ , ఇతర ఉన్నతాధికారులు , ఇతర శాఖలకు చెందిన అధికారులు , పారిశుద్ధ్య కార్మికులు ఎంతో శ్రమకోర్చి పనులను చేశారని ఆయన కొనియాడారు. పరకాల పట్టణాన్ని పారిశుద్ధ్య కార్మికులు ఎంతో కష్టపడి వచ్చి పరిశుభ్రంగా ఉంచుతున్నారని వారి సేవలను ఆయన మెచ్చుకున్నారు. పొద్దున్నే లేచి పట్టణాన్ని జల్లెడ పట్టి ఎక్కడ అపరిశుభ్రత కనిపించిన పట్టుదలగా ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేసే వరకు వదిలి వెళ్ళని వాళ్ళ శ్రమను పరకాల ప్రజలు అందరూ గౌరవించాల్సిందేనని ఎమ్మెల్యే రేవూరి అన్నారు.అదేవిధంగా ఈ కార్యక్రమానికి పరకాల కుంకుమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కొలుకూరి రాజేశ్వరరావు, మహా రుద్రయాగ అధ్యక్షుడు ఎర్రం లక్ష్మణ్ , ఆలయ కమిటీ సభ్యులు తోట రవి. సుష్మతో పాటుగా కాంగ్రెస్ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## విధి నిర్వహణతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచాలి: సిపి

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్:** శాంతి భద్రతల పరిరక్షణకై నిరంతరం శ్రమించే పోలీసులు తమ వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ మెడికవర్ హాస్పటల్ సహకారంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్, ఫిజిషియన్, న్యూరాలజిస్ట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ విభాగాలకు చెందిన వైద్య నిపుణులచే ఈ శిబిరానికి తరలి వచ్చిన పోలీసులు వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేపట్టడంతో పాటు వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి బిఎండి టెస్ట్ (బోన్ మినరల్ డెన్సిటీ),లిపిడ్ ప్రొఫైల్), ఈసీజి (ఎలక్ట్రోకార్డియోగ్రామ్),2డి ఈకో, ఎల్ఎఫ్‌టి టెస్ట్ (లివర్ ఫంక్షన్ టెస్ట్),జిఆర్‌బిఎస్ (రాండమ్ బ్లడ్ షుగర్),సిబిపి (కంప్లీట్ బ్లడ్ పిక్చర్)లాంటి వైద్య నిర్వహించారు. ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మెడికవర్ యాజమాన్యం తో పాటు ఇందులో పాల్గొన్న వైద్య నిపుణులు, సిబ్బంది కి పోలీస్ కమిషనర్ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, బాల స్వామితో పాటు వైద్య ఆరోగ్య అధికారి అప్పయ్య,ఆర్. ఐ లు, ,మెడికవర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వయోవృద్ధులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ: అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/ములుగు:** వయోవృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికి ఉందని వారి హక్కులను ప్రతి ఒక్కరు గౌరవించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంపత్‌రావు అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం 2025ను పురస్కరించుకొని వయోవృద్ధులు స్థానిక ప్రపంచ చర్యను నడిపిస్తున్నారు మా ఆశయాలు, మా శ్రేయస్సు, మా హక్కులు అనే థీమ్‌తో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ సంపత్‌రావు మాట్లాడుతూ వయోవృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. వారే మన కుటుంబ వ్యవస్థకు మూలాధారమని అన్నారు. వయోవృద్ధుల సంరక్షణ కొరకు ప్రభుత్వం 2017లో తీసుకువచ్చిన చట్టాన్ని 2022లో సవరించడం జరిగిందని, ఈ చట్టం ప్రకారం జిల్లాలోని వయోవృద్ధులు వారికి ఏమైనా సమస్యలు ఉంటే రెవెన్యూ డివిజనల్ అధికారికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం జిల్లా సంక్షేమాధికారి తుల రవి మాట్లాడుతూ వయోవృద్ధులే మన దేశానికి వెలకట్టలేని సంపద అని, వారే మన భవిష్యత్తుకు బలమైన పునాది అని, అలాంటి వారిని బలహీనులుగా చూడకుండా వారి హక్కులను ప్రతి ఒక్కరు గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ ఫోరం జిల్లా అధ్యక్షుడు పాశం రామ్మూర్తి, కె శిరీష, ఈపి ప్రేమలత, దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రమేష్, ఓంకార్, నాగేంద్ర, పాల్గొన్నారు.

## అణగారిన వర్గాలకు
# పోరుబాట చూపింది కమ్యూనిస్టులే

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** దోపిడీ ,వివక్షతలు అసమానతలపై అణగారిన వర్గాలకు పోరుబాట చూపించింది కమ్యూనిస్టులేనని సిపిఐ మాజి జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ వందేళ్ళ ఉత్సవాల ప్రచార బస్సు జాత శుక్రవారం కురవి కి చేరుకున్న సందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి పూలమాలలు వేయగా, నాయకులు అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి, కోలాటాలు ,డప్పు చప్పుళ్ల తో ప్రదర్శనగా గుడి సెంటర్‌వచ్చారు. అనంతరం జరిగిన సభకు జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అధ్యక్షత జరిగిన సభలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 6దశాబ్దాలుగా ప్రజలు, కార్మికుల త్యాగాతో నిరమించిన ప్రభుత్వ రంగ సంస్థలను ఎల్ఐసి, బ్యాంకులు, టెలికాం, గనులు చవిరికి రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేటీకరణకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. దేశ సంపదను అదాని, అంబాని కార్పోరేట్ సంస్థలకు దొచిపెడుతన్న బిజెపి సర్కార్‌కు కేంద్రంలో సరైన గుణపాఠం చెప్పేరోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు. రైతులను, కార్మికులను పెట్టుబడి దారులకు కట్టు బానిసలుగా మార్చే చట్టలు రూపుమాపే వరకూ సిపిఐ పోరాటాలు ఆగవని చాడ హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ వందేళ్ల సిపిఐ ప్రస్థానంలో అణగారిన వర్గాలకు కార్మికులకు తమ హక్కుల కోసం తిరుగుబాటు తత్వాన్ని నేర్పి పాలకవర్గాలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు రక్షణగా నిలుస్తున్న పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, మతతత్వ ధోరణులు విపరీతంగా పెరిగి ప్రాంతీయ విద్వేషాలతో ప్రజలను మాయ చేస్తున్న పాలక బిజెపి పార్టీ విధానాలను ఎండగట్టడానికి ప్రగతిశీల శక్తులు ప్రజాస్వామ్యవాదులు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలోజరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని కార్యకర్తలకు, వామపక్ష వాదులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ జాతా ప్రచార యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్, ఏఐఎస్‌ఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ , డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి, అజయ్, నెల్లూరి నాగేశ్వర్ రావు, తురక రమేష్ , బుర్ర సమ్మయ్య, బుడమ వెంకన్న బొల్లం ఉప్పలయ్య కలగూర నాగరాజు, పాల్గొన్నారు.

## బస్సు జాతతో మహబూబాబాద్ పట్టణ
# సిపిఐ నేతలు బైక్ ర్యాలీ

డిసెంబర్ 26న ఖమ్మంకు కదలిరావాలని అజయ్ సారథి రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన సిపిఐ బస్సు జాత రాత్రి పట్టణంలో బసవేసిన సందర్భంగా శుక్రవారం మహబూబాబాద్ సిపిఐ బృందం బస్సు జాత తో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం జాత తో కలిసి కురవి, డోర్నకల్, గార్ల వరకు వెళ్లి మహబూబాబాద్ జిల్లా నుండి కొత్తగూడెం జిల్లాకు వారిని సాగనంపారు. ఈ సందర్భంగా ఈ అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ సిపిఐ బస్సు జాతా ను జయప్రదం చేసిన వారికి అభినందనలు తెలియజేస్తూ ఖమ్మంలో జరిగే 26న సిపిఐ 100 సంవత్సరాల శతాబ్ది సభను పట్టణం నుండి భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిస్తూ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ వెంట వెళ్లి కొరవి డోర్నకల్ గార్ల జాతాలో పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, దేశ పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపల్లి వెంకన్న, తండా సందీప్, బీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, బానోత్ లింగ్య నాయక్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, ఎండి మహమూద్, తండ శ్రీనాథ్, గార రవిచంద్రబోస్, గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, పుల్లకండం రమేష్, రాజు వంగూరి నాగేంద్రబాబు, పులి యాకయ్య, వేణు, మంద శీను, నిధిగొండ సత్యం, ఉస్మాన్ పాల్గొన్నారు.



## పత్తి కొనుగోలును వేగవంతం: కలెక్టర్



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** పత్తి కొనుగోలును మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మార్కెటింగ్, సీసీఐ అధికారులు, మిల్లుల యాజమాన్యంను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ఇంద్రనగర్ పరిధిలో ఉన్న భవానీ కాటన్ ఇండస్ట్రీస్ లో పత్తి కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఇక్కడ ఉన్న వే బ్రిడ్జి కాంటా వద్ద కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంతాజీ, వైస్ ఛైర్మన్ స్రవంతి, పత్తి రైతు శ్రీనివాస్ లు కొబ్బరికాయలు కొట్టారు. పత్తి ని తీసుకువచ్చిన వాహనం వద్ద రిబ్బన్ కట్ చేసి పత్తి కొనుగోలు ను ప్రారంభించారు. భవానీ కాటన్ ఇండస్ట్రీస్‌కు ఇప్పటి వరకు ఎంత పత్తి వచ్చింది, ఎన్ని క్వింటాల పత్తి వస్తుంది, పత్తిలో సగటుగా తేమ శాతం ఎంత ఉంటుందనే వివరాలను అధికారులు, జిన్నింగ్ మిల్లు యాజమాన్యంను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఎన్ని ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారని, సాగుకు ఎంత ఖర్చు అయ్యిందని, ఎంత దిగుబడి వచ్చింది, పత్తి కి ఎంత మొత్తం రాబడి వస్తుందని పత్తి రైతు శ్రీనివాస్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ ప్రసాదరావు, ఎల్కతుర్తి మార్కెట్ కార్యదర్శి అశోక్, సీసీఐ అధికారి పంకజ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేసి..
# జిల్లాను ప్రగతి పథంలో నడపాలి

ఎంపి పోరిక బలరాం నాయక్



**ప్రజాపక్షం/వరంగల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి.. జిల్లాను ప్రగతి పథంలో నడపాలని మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ఇటివల డిల్లీలో దక్షిణ భారతదేశంలో జల సంరక్షణ కేటగిరి 2లో వరంగల్ జిల్లాకు మొదటి స్థానం దక్కిన నేపథ్యం లో డిల్లీ లో నిర్వహించిన కార్యక్రమం లో అవార్డుతో పాటు రూ. కోటి దక్కించుకొని అవార్డు కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన విషయమై దిశ వే దికగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరా జు లు శాలువలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా వ్యవసాయ, విద్య, వైద్యం, ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, నీటిపారుదల,జాతీయ రహదారుల విభాగం, గ్రామీణ అభివృద్ధి, మెప్మా, రోడ్ల భవనాలు, జిల్లా పరిషత్, గ్రామీణ తాగునీటి సరఫరా, విద్యుత్, జిడబ్ల్యుఎంసి, మున్సిపల్ తదితర శాఖల ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎంజిఎన్ఆర్జిఎస్), నేషనల్ ఫుడ్ సేఫ్టీ (ఎన్ ఎఫ్ ఎస్), నేషన్ సోషల్ అసిస్టెంట్ ప్రోగ్రాం (ఎన్ఎస్ఏపి), దీన్ దయాల్ ఉపాధ్యాయ అంత్యోదయ యోజన (డిడిఏవై), దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన ( డిడియుజికే వై), స్వచ్ఛ భారత్ మిషన్, గ్రామీణ్ (ఎస్‌బిఎంజీ), ప్రధానమంత్రి కృషి సించాయి యోజన, అమృత్ 2.0, 15వ ఆర్థిక సంఘం, ఎంపీ లాడ్స్, ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ పోర్టల్ (ఈ నామ్), ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పిఎంఈజీపి), శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయ రూర్బన్ మి షన్ తదితర సంక్షేమ, అభివృద్ధి పథకాలు, వాటికి కేటాయించే నిధులతో కొనసాగుతున్న పనులపై అవి ప్రజలకు గ్రౌండింగ్ అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, విజయ లక్ష్మి , జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు ప్రతిపాదనలు సిద్ధం

కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సరస్వతి అంత్యపుష్కరాలు దిగ్విజయంగా నిర్వహించడానికి భక్తులకు చేయాల్సిన సౌకర్యాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం కాళేశ్వరం ఈఓ కార్యాలయంలో సరస్వతి అంత్యపుష్కరాలు, కాళేశ్వరం అభివృద్ధికి మాస్టర్ ప్రణాళిక తదితర అంశాలపై రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఆర్అండ్‌బి, పంచాయతి, పంచాయతి రాజ్ ఇంజినీరింగ్, విద్యుత్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సంవత్సరం కాళేశ్వరంలో మే 21 నుండి జూన్ 1 వరకు జరగనున్న సరస్వతి అంత్యపుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు చేయాల్సినఏర్పాట్లపై ముందుగానే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారిగా చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన ప్రణాళికలు, అంచనా నివేదికలు, మార్పులు,చేర్పుల వివరాలను తయారు చేసి త్వరితగతిన సమర్పించాలని సూచించారు. ఈ సంవత్సరం మే 15 నుండి 26వ తేదీ వరకు జరిగిన సరస్వతి పుష్కరాలను వైభవంగా నిర్వహించామని, భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించాలని తెలిపారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తాత్కాలిక సౌకర్యాల ఏర్పాటు, వసతి, వైద్య సదుపాయాలు తదితర అంశాలను శాఖల వారిగా సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, కాటారం డిఎస్పీ సూర్యనారాయణ, దేవాలయ ఈఓ మహేష్, రమేష్, వెంకటేశ్వర్లు, పాపిరెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రామారావు, ప్రకాష్, అశోక్ కుమార్, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

## రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళినాయక్



**ప్రజాపక్షం/గూడూరు:** రైతు పక్షపాతి ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపించుకుందని పేదింటికల సహకారం చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్‌కే దక్కిందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ అన్నారు.శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం వేంగపేట గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం గూడూరు మండలం చక్రు తండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గోన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటపై తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తూ రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం చేప్రతి రైతు కుటుంబానికి మద్దతు లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుపడి ఉందని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు న్యాయమైన పద్ధతిలో మద్దతు ధర అందుతుందని అన్నారు. రైతులు దైర్యంగా ముందుకు సాగాలని రైతు కష్టానికి విలువ ఇవ్వడం మా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన తెలిపారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదింటి కల నెరవేరింది**

కాంగ్రెస్ ప్రభుత్వం పేదింటి కల నెరవేరిందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ అన్నారు.శుక్రవారం గూడూరు మండలం చక్రితండాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మించిన కోత్త గృహాలకు లబ్దిదారుల కుటుంబాలతో కలిసి మహబూబాబాద్ ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలు పాల్గోన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మరిన్ని అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు పథకాన్ని విస్తరింప చేస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు కార్యకర్తలు పాల్గోన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో మీడియా పాత్ర కీలకం

కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ:** ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అమలులో మీడియా పాత్ర కీలకమని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. జనగామ జిల్లాకు వివిధ అంశాల్లో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అవార్డులు వచ్చిన నేపథ్యంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారం అందించిన జిల్లా మీడియా మిత్రులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రారంభించే ప్రతి సంక్షేమ పథకం ప్రతి గడపకు చేరవేయడంలో మీడియా పాత్ర కీలకమైందన్నారు. జిల్లాలో ఏ కార్యక్రమం మొదలు పెట్టినా సహకరిస్తూ అన్ని విశయాల్లో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డిసిపి రాజమహేంద్రనాయక్, ఆర్‌డిఇ వెంకన్న, డిపిఆర్‌ఓ పల్లవితో పాటు మీడియా మిత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లు కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు.

## స్థానిక సమరం.. పల్లెల్లో ఎన్నికల సందడి

రిజర్వేషన్లపై అధికారుల సమాలోచనలు

డిసెంబర్‌లోనే పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం

**ప్రజాపక్షం/జనగామ:** స్థానిక సమరం మొదలైంది. పంచాయితీ ఎన్నికలకు పల్లెలు సిద్ధం అవుతున్నాయి. రిజర్వేషన్లపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. మూడు విడతల్లో ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. డిసెంబర్‌లోనే పూర్తి కానుండడంతో ఆశావాహుల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. 42 శాతం బిసి రిజర్వేషన్ల ప్రకారం ఇటీవల ప్రకటించగా అవి పూర్తిగా మారిపోనున్నాయి. మళ్లీ కొత్తగా రిజర్వేషన్లు ప్రకటించనున్నారు. ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలు అన్ని ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. జనగామ జిల్లాలోని 12 మండలాల్లో 280 గ్రామ పంచాయతీలకు 2వేల 534 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. గతంలో జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వయిస్తామని ప్రకటించగా ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలు నిర్వయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండడంతో గ్రామాలపై రాజకీయ నాయకులు దృష్టి పెడుతున్నారు.

**రిజర్వేషన్లపై సమాలోచనలు**

ఎన్నికలు జరిపేందుకు అవకాశాలు ఉండడం, ఎన్నికల కమీషన్ కలెక్టర్లలో సమావేశాలు నిర్వయించడంతో అధికారులు మరోమారు రిజర్వేషన్లపై కసరత్తు ప్రారంభించారు. గతంలో ప్రకటించిన రిజర్వేషన్లు కాకుండా మళ్లీ రిజర్వేషన్లు ప్రకటించనున్నారు. అయితే ఏఏ గ్రామాల్లో ఏఏ సామాజిక వర్గాల ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉందనే దానిపై కసరత్తు మొదలైంది. గతంలో రిజర్వేషన్లు, ఇప్పటి నిబంధనల ప్రకారం చేయాల్సిన రిజర్వేషన్లపై అధికారులు జాబితాలు తయారు చేస్తున్నారు. అయితే రాజకీయ పార్టీల సమక్షంలోనే ప్రకటించే అవకాశాలు ఉన్నప్పటికి ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.

**జనగామలో మొదలైన బిఆర్‌ఎస్ ప్రచారం**




ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్ధం అన్నట్లు జనగామ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ ప్రచారం మొదలైంది. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువన్నపేట, పోసాన్‌పల్లి, తపాస్‌పలిల, ఐనాపూర్, రసూలాబాద్, కొమురవెల్లి, రాంసాగర్, గైరాయపల్లి, మర్రిముత్యాల, లెనిన్‌నగర్, కిష్టంపేట, గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. శనివారం ముస్త్యాల, రాంపూర్, ఆకునూర్, కాశగుడిసెలు, కొత్తదొమ్మాట, కడవేరుగు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపురి, శభాష్‌గూడెం గ్రామాల్లో ప్రచారం చేయనున్నారు. గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసి కార్యడర్‌ను చైతన్య పరిచే పనిలో పల్లా ఉన్నారు. ఇక అన్ని రాజకీయ పార్టీలు సైతం పల్లెలకు పయనం అయ్యాయని చెప్పాలి.

# రీల్



## డిసెంబర్‌లో అన్నగారు వస్తారు

స్టార్ హీరో కార్తి నటిస్తున్న తాజా చిత్రం 'వా వాతియార్' తెలుగు ప్రేక్షకుల ముందుకు 'అన్నగారు వస్తారు' టైటిల్‌తో రాబోతోంది. ఈ సినిమాను డిసెంబర్‌లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. 'అన్నగారు వస్తారు' చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యూత్‌ఫుల్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా హీరో కార్తి నటిస్తున్న 'అన్నగారు వస్తారు' సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే రిలీజైన ఈ సినిమా టీజర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. కార్తి కెరీర్‌లో 'అన్నగారు వస్తారు' మరో బ్లాక్ బస్టర్ మూవీ అవుతుందనే ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి. కార్తి, కృతి శెట్టి, సత్యరాజ్, మధుర్ మిట్టల్, ఆనంద రాజ్, రాజ్ కిరణ్, శిల్పా మంజునాథ్, కరుణాకరణ్, తదితరులు నటిస్తున్నారు.



## గోవా ఫిలిం ఫెస్టివల్‌లో 'అమరన్'

ఇంటర్నేషనల్ గోవా ఫిలిం ఫెస్టివల్‌లో స్క్రీనింగ్ తమిళ సినిమా అమరన్ ఎంపిక అయింది. కార్తికేయన్, సాయి పల్లవి హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా ఒక మిలిటరీ అధికారి జీవిత కథ ఆధారంగా రూపొందించారు. తమిళ రంగంతో పాటు ఇతర భాషల్లో కూడా సక్సెస్ ఫుల్‌గా ఆడిన ఈ సినిమా ఇప్పుడు గోవాలో జరిగే అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో ఇండియన్ పనోరమా క్యాటగిరీ కింద ఎంపిక చేశారు. ఇండియన్ పనోరమా కేటగిరీలో మొట్ట మొదటి సినిమాగా అమరన్ సినిమాను ప్రదర్శించనున్నారు. ఈ సినిమా ఎంపిక అయినా నేపథ్యంలో హీరో, హీరోయిన్ గోవాకు చేరుకున్నారు. వీరితో పాటు ప్రముఖ నటుడు కమల్ హాసన్ కూడా గోవా ఫిలిం ఫెస్టివల్ లో అతిథిగా పాల్గొంటున్నారు.

## నన్ను కామెడీ ఆర్టిస్ట్‌గా నిలబెట్టింది

విజయ్ భాస్కర్



తెలుగు సినిమా రంగంలో తన దైన శైలిలో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్న నటుడు విజయ్ భాస్కర్. ఇదివరకెన్నో సినిమా రంగంలో ప్రయాణం చేస్తూనే ఉన్న విజయ్ భాస్కర్ ఎన్నో ఏళ్ల నుంచో ఎదురుచూస్తున్న మంచి కమర్షియల్ హిట్ ఇప్పుడు వచ్చింది. హీరోగా, విలన్‌గా, సపోర్టింగ్ యాక్టర్‌గా ఇలా అన్ని రకాల పాత్రలు చేస్తూ ఇండస్ట్రీలో తనకంటూ ఒక పేజీని ఏర్పరచుకున్నారు. సినిమా ఇండస్ట్రీలో ఉన్న ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా ఉంటూ అవకాశాలు దక్కించుకుని ఎదిగారు. ఇప్పుడు అల్లరి రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏనుగుతొండం ఘటికాచలం' సినిమా సినిమాతో మంచి కమర్షియల్ హిట్ అందుకున్నారు విజయ్ భాస్కర్. ఏనుగుతొండం ఘటికాచలం సినిమా ఈటివి విన్ లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ మీడియాతో చిట్ చాట్ చేశారు. ఏనుగు తొండం ఘటికాచలం సినిమాలో విజయ్ భాస్కర్ తొలిసారిగా కామెడీ నటుడిగా కనిపించారు. ఇంతవరకు చేసిన హీరోగా, విలన్, సపోర్టింగ్ క్యారెక్టర్స్ కంటే కూడా ఇందులో కమెడియన్‌గా మెప్పించాడని చెప్పవచ్చు. ఏనుగు తొండం ఘటికాచలం సినిమాలో వన్ ఆఫ్ ద లీడ్ రోల్‌లో కనిపించారు విజయ్ భాస్కర్. ఈటీవీ విన్‌లో ఈ సినిమాను చూసి విజయ్ భాస్కర్‌ను పలకరిస్తే .... అనేక విషయాలు చెప్పుకొచ్చారు. నా జీవితంలో చేసిన మొట్ట మొదటి టీవీ సీరియల్ 'లేడీ డిటెక్టివ్'. ఈ సీరియల్ ఈటీవీలో ప్రసారం అయింది. ఇందులో చిన్న రోల్ చేసినప్పటికీ చాలా మంచి పేరు వచ్చింది. నా తొలి చిత్రం '16 టీన్స్' ఈటీవి సంస్థలో వచ్చింది. నా మొదటి ఓటీటీ చిత్రం 'ఏనుగుతొండం ఘటికాచలం' ఈటీవి విన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. తన కెరీర్ లో మొదటి సీరియల్, సినిమా, చివరికి ఓటీటీ సినిమా కూడా ఈటీవి తోనే జర్నీ స్టార్ట్ కావడం చాలా సంతోషంగా ఉందని విజయ్ భాస్కర్ అంటున్నారు. ఈటీవి సంస్థ నిర్మించిన 'ఆనందం' సినిమాలో ఒక మంచి రోల్ చేశాను. ఈ సినిమా సూపర్ హిట్టయింది. దీంతో వంద రోజుల ఫంక్షన్‌లో ఈటీవి అధినేత రామోజీ రావు గారి చేతుల మీదుగా షీల్ అందుకోవడం నా జీవితంలో మరచిపోలేని రోజుగా గుర్తుండిపోయింది. నేను నటించిన మరో చిత్రం 'నా మనసుకేం' సినిమా కూడా ఈటీవి వల్లే కొన్నారు. సినిమా రంగంలో నా ఎదుగుదలకు ఈటీవి ఎంతో తోడ్పడింది. ఇప్పుడు ఏనుగుతొండం ఘటికాచలం సినిమాను కూడా ఈటీవి విన్ తీసుకోవడం నిజంగా నాకు చెప్పలేనంత సంతోషంగా ఉంది. ఈ సినిమాను తెరకెక్కించిన రవిబాబు గారికి, ఈ సినిమాను స్ట్రీమింగ్ చేస్తున్న ఈటివి యాజమాన్యానికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.




## 23న రాజా సాబ్ పాట విడుదల

ప్రభాస్ హీరోగా మారుతీ దర్శకత్వంలో పీపుల్స్ మీడియా బ్యానర్‌పై నిర్మిస్తున్న సినిమా రాజా సాబ్ విడుదలకు ముస్తాబవుతోంది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ మొదలు పెట్టిన దర్శక నిర్మాతలు తాజాగా ఓ పాటను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 23న రాజా సాబ్ పాటను విడుదల చేయనున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ సరసన ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వినోదాత్మకమైన ప్రేమకథగా తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ కథలో సస్పెన్స్, హర్రర్ కూడా జోడించారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బొమ్మను ఇరానీ, మరో కీలకపాత్ర పోషిస్తున్నారు. థమన్ సంగీతం అందించిన ఈ సినిమాకు సంబధించిన అన్ని పనులు పూర్తి చేసి జనవరి 9వ తేదీన సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ఆ క్యారెక్టర్స్ చాలా ఇష్టం

### మీడియా చిట్ చాట్‌లో భాగ్యశ్రీ బోర్సే



రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలోకి వస్తుంది. ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఆంధ్ర కింగ్‌లో నేను మహాలక్ష్మి క్యారెక్టర్‌లో కనిపిస్తాను. తను కాలేజ్ గోయింగ్ గర్ల్. సాగర్ తో ప్రేమలో ఉంటుంది. అంతకుమించి ఇప్పుడు ఎక్కువ క్యారెక్టర్ గురించి రివిల్ చేయకూడదు. కథలో తన క్యారెక్టర్ చాలా ఇంపార్టెంట్. మీరు సినిమా చూస్తున్నప్పుడు మీకే అర్థమవుతుంది. ఈ క్యారెక్టర్ ఆడియన్స్ గుర్తుపెట్టుకునేలా వుంటుంది. అభిమానం అనేది డివైన్ ఎమోషన్. నేను నార్త్ నుంచి సౌత్ కొచ్చినప్పుడు ఇక్కడ అభిమానుల అభిమానం చూసిన తర్వాత ఒక స్టార్‌ని ఇంత గొప్పగా ఆరాధిస్తారో ప్రేమిస్తారో ప్రత్యక్షంగా చూశాను. అది నిజంగా చాలా గొప్ప ఎమోషన్. ఎలాంటి రిలేషన్ లేకుండా పరిచయం లేకుండా ఒక వ్యక్తిని అంతలా ఎలా అభిమానిస్తారు అనిపించేది. మహేష్ ఈ కథ చెప్పిన తర్వాత ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది.ఉపేంద్రతో ఒక కాంబినేషన్ సీన్ ఉంది. ఆయన వెరీ హంబుల్ యాక్టర్. చాలా డౌన్ టు ఎర్త్. ఆయనతో వర్క్ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.ఇందులో ప్రేమ కథ చాలా స్వచ్ఛంగా ఉండబోతుంది. నువ్వుంటే చాలు, చిన్ని గుండెలో పాటలు మీరు చూసే ఉంటారు. ప్రేమలో ఉన్న గొప్ప ఎమోషన్ ఇందులో ఉంటుంది. రామ్‌తో నటించడం అద్భుతమైన అనుభవం. వెరీ ఎనర్జిటిక్ పెర్ఫార్మర్. ఆయన ఎనర్జీ మ్యాచ్ చేశానని అనుకుంటున్నాను. లవ్ స్టోరీ, డైలాగ్స్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంటాయి. రామ్ చాలా పాజిటివ్‌గా ఉంటారు. సినిమా ఆల్బమ్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పాటలన్నీ ఇష్టం. అయితే నాకు ఫేవరెట్ నువ్వుంటే చాలు. ఇది 2000లో జరిగే కథ, డైరెక్టర్ కాస్ట్యూమ్స్, ఆర్ట్ వర్క్ అన్నిటి పరంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు.ఇందులో ఒక ఇంపార్టెంట్ సీన్ ఉంది. డైరెక్టర్ చేసి చూపించారు. నేను ఎలా అనుకుంటున్నానో చేసి చూపిస్తానని డైరెక్టర్‌కు రిక్వెస్ట్ చేశాను. నేను చేసింది అందరికీ నచ్చింది. అంత క్రియేటివ్ స్పేస్ ఇవ్వడం నాకు చాలా ఆనందంగా అనిపించింది. రవి, నవీన్ నేను కలిసిన ఫస్ట్ ప్రొడ్యూసర్స్. వాళ్లతో వర్క్ చేయాలని ఎప్పటినుంచో ఉంది. ఈ సినిమాతో వారితో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్నిచ్చింది. చాలా పాషన్ ప్రొడ్యూసర్స్. ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాని తీశారు. ఒక షెడ్యూల్ కోసం రాజమండ్రి వెళ్ళాం. అక్కడ చాలా వేడిగా ఉంది. అయితే ఒక టీంగా సినిమా కోసం వర్క్ చేయడంలో చాలా ఎంజాయ్ చేశాం. నాకోసం ఎలాంటి కథలు రాసిపెట్టి ఉన్నాయో నాకు తెలియదు. అయితే వచ్చిన ప్రతి క్యారెక్టర్ కి వంద శాతం ఇచ్చి ఒక వెర్సటైల్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకోవాలని ఉంది. అనుష్క అరుంధతిలో చేసినటువంటి క్యారెక్టర్స్ చాలా ఇష్టం. అలాంటి పాత్రలు నాకు వస్తాయని ఆశిస్తున్నాను.

## డిసెంబర్ 12నే మోగ్లీ విడుదల

రోషన్ కనకాల తొలి చిత్రం బబ్లుగం సక్సెస్ కాకపోయినా రెండో ప్రేమకథగా వస్తున్న మోగ్లీ 2025 పై రోషన్ భారీగానే ఆశలు పెట్టుకున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, కలర్ ఫోటో ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామా. ఈ సినిమా గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. హాయిగా సంతోషంగా జీవితాన్ని గడపాలనుకునే యువకుడు మోగ్లీ. ఓ అందమైన అమ్మాయిని ప్రేమించిన తర్వాత అతని ప్రపంచం ఒక మలుపు తిరుగుతుంది. రామసీతల ప్రేమకథలా వీరిద్దరి ప్రేమ కూడా అందంగా ఉంటుంది. వీరి సంతోషంలో రాక్షసుడు లాంటి పోలీస్ ఆఫీసర్ ఎంటరౌతాడు. దీంతో అంతా యుద్ధ భూమిగా మారుతుంది. ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ మైథాలజీ ఫీల్ మోడరన్ ఎమోషన్‌తో మిళితం చేస్తుంది. సినిమాటోగ్రాఫర్ రామ మారుతి ఎం అద్భుతమైన విజువల్స్ అందించారు.





# దేశంపై మతోన్మాద భూతం

(మొదటి పేజీ తరువాయి)

బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టు నేతలను హతమార్చడం సరైంది కాదని, శాంతి చర్చలకు సిద్ధమని చెబుతున్నప్పటికీ ఈ మారణహోమానికి తెగబడటం పైచాచికమని, మావోయిస్టుల హత్యలపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు ఆచరణీయమైనవని, మనుష్యులను హతమార్చినంత మాత్రాన సిద్ధాంత పునాదులను కదిలించలేరన్నారు. సిపిఐ భారతదేశంలో ఆవిర్భవించి వందేళ్ళవుతోందని, భారత స్వతంత్ర సంగ్రామంలో కూడా తనదైన పాత్ర పోషించి స్వదేశ కాంక్ష రగిలించిందని గుర్తు చేశారు. ఈ వందేళ్లపాటు ప్రజా సమస్యల పరిష్కారం, పేదలు, కార్మికులు, రైతుల పక్షాన నిరంతర పోరాటాలు సాగించిన ఘనత సిపిఐదే అన్నారు. మరో వందేళ్లయినా ప్రజా క్షేత్రంలో మనగలమని, ఇదే స్ఫూర్తితో నిరంతర పోరాటాలు నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం మరిన్ని బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం కేంద్రంగా సిపిఐ శతవసంత ఉత్సవ ముగింపు సభ ఐదు లక్షల మందితో జరగనుంది. ఈ ముగింపుకు 45 దేశాల నుండి ప్రతినిధులు తరలివస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిస్టుల పనైపోయిందని అవాకులు చెవాకులు పేలే వారికి ఈ వేడుక కనువిప్పు కావడంతో పాటు దేశ చరిత్రలోనే ఓ మైలురాయిగా మిగిలిపోతుందని చెప్పారు. దీనిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా బస్సు జాతాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ జాతా శనివారం భద్రాచలంలో ముగుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనీల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠారెడ్డి, రాష్ట్ర నాయకులు రెహమాన్, లక్ష్మి నారాయణ, మనరాటి ప్రసాద్, అడుసుమెల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, సుధాకర్, నిమ్మల రాంబాబు, విశ్వేశ్వరరావు, పద్మజా, సుంకిపాక ధర్మ, జి రామకృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యత అనివార్యం

(మొదటి పేజీ తరువాయి)

దర్పాన్ని ప్రదర్శిస్తోందని, దేశంలో ఓటాన్ అకౌంట్ పద్ధతి ప్రవేశపెట్టాలన్నారు. సిపిఐది దేశంలో వందేళ్ల ఘన చరిత్ర అని, ఆ నాటి నుండి నేటి వరకు ప్రజలతో మమేకంపై ఉన్న ఏకైక పార్టీ అని చెప్పారు. దేశస్వాతంత్ర్య సమరంలో ప్రజలను చైతన్య పరుస్తూ బ్రిటీష్ సామ్రాజ్యవాదుల నుండి దేశాన్ని దక్కించుకునేందుకు చారిత్రాత్మక పాత్ర పోషించిందన్నారు. ఇంతటి కీర్తి గల సిపిఐ చరిత్ర, త్యాగాలు, పోరాటాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అమరుల త్యాగాల స్ఫూర్తి మరో వందేళ్ల పాటు ప్రజాక్షేత్రంలో పోరాట పటిమతో ముందుకు సాగుదామని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో అడవుల్లో ఉన్న సహజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు మోడి సర్కార్ మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తోందని, వారిని ముందుగానే పట్టుకుని చిత్రహింసలకు గురిచేసి అతిదగ్గరి నుండి కాల్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులను పతనం చేయాలని చూసిన వారు ఎందరో కాలగర్భంలో కలిసిపోయారని, దౌర్జన్యాలు, హత్యలకు పాల్పడుతూ వ్యక్తులను చంపినా ఉద్యమ శక్తి బ్రతికే ఉంటుందన్నారు. తాము లొంగిపోతామని పదే పదే మావోయిస్టులు చెబుతున్నప్పటికీ తాము విధించిన 2026 మార్చి నెలాఖ గడువునాటికి అంతం చేస్తామని బహిరంగ ప్రకటనలు చేస్తూ చంపడమే ధ్యేయంగా పెట్టుకున్నారని మండిపడుతున్నారు. ప్రక్కనే ఉన్న పాకిస్థాన్‌తో శాంతి చర్చలకు అంగీకరించిన వారు మన దేశ పౌరులతో ఎందుకు చర్చలకు ఒప్పుకోరని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం ఎన్‌కౌంటర్ల పేరిట సాగిస్తున్న హత్యలపై న్యాయవిచారణ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, ఎం బాలనర్సింహా మాట్లాడుతూ.. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సాగుతున్న ప్రచారజాత కొత్తగూడెంతో ముగిసిందని, డిసెంబర్ 26న ఉద్యమాల ఖిల్లా ఖమ్మం జిల్లా కేంద్రంలో ఐదు లక్షల మందితో జరిగే శతవసంత ముగింపు సభను జయప్రథం చేయాలని, ఇందు కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున కృషి చేయాలని కోరారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ఖమ్మం జిల్లాకార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ.. ఈ వేడుకకు 45 దేశాల నుండి ప్రతినిధులు, దేశవిదేశాల నుండి కవులు, కళాకారులు, మేధావులు తరలివస్తున్నారన్నారు. జరగనున్న ఈ వేడుక దేశచరిత్రలోనే సువర్ణ అధ్యాయంగా మిగిలిపోనుంది. కమ్యూనిస్టుల పని అయిపోయింది అంటూ అవాకాలు చెవాకులు పేలిన వారి నోళ్లు మూతపడేలా, కనీవినీఎరుగని రీతిలో ఈ శతవసంత ముగింపు సభ జరగనుందన్నారు. చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళీ, సలిగంటి శ్రీనివాసరావు, భూక్యా ధస్రు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నాయకులుల కంచర్ల జమలయ్య, జి వీరస్వామి, కందుల భాస్కర్, చంద్ర నరేంద్రకుమార్, ఎస్‌కే ఫహీమ్, కొమారి హన్మంతరావు, గెద్దాడు నగేష్, వంగా వెంకట్, వట్టికొండ మల్లిఖార్జునరావు, ఎస్‌వి రమణమూర్తి, నెరేళ్ల రమేష్, కే రత్నకుమారి, మాచర్ల శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిడుగు శ్రీను, మునిగడప వెంకన్న, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాణ చారి తదితరు పాల్గొన్నారు.

## బెట్టింగ్ యాప్‌లో సిఐడి విచారణకు శ్రీముఖి, నిధి, అమృత



ప్రజాపక్షం/హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు రాష్ట్రంలో సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో టాలీవుడ్ హీరోయిన్ నిధి అగర్వాల్, ప్రముఖ యాంకర్ శ్రీముఖి, అమృత చౌదరిలు శుక్రవారం సిఐడి విచారణకు హాజరయ్యారు. ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు సెలబ్రిటీలు ఎంత డబ్బు తీసుకున్నారు, ఆ యాప్స్ నడిపిన వ్యక్తులతో వారి సంబంధం ఏమిటి, డబ్బుల లావాదేవీలు ఎలా జరిగాయి అనే విషయాలపై సిఐడి అధికారులు వారిని ప్రశ్నించినట్టు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే టాలీవుడ్ ప్రముఖ నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్ రాజ్‌తో పాటు మరికొంతమంది సెలబ్రిటీలను సిఐడి విచారించింది. అక్రమ ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు సెలబ్రిటీలపై చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ యాప్స్ ద్వారా పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిని ప్రచారం చేసిన సెలబ్రిటీల పాత్రను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు.

# మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే

### మూసీ ప్రక్షాళన వెంటనే చేపట్టాలి

పశ్య పద్మ



ప్రజాపక్షం/వలిగొండ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల నిండిన సందర్భంగా ఈనెల 15న రాష్ట్రవ్యాప్తంగా ప్రచార జాత ఆదిలాబాద్ బాసర నుండి బయలుదేరి శుక్రవారం ఉదయం 10 గంటలకు వలిగొండ మండల కేంద్రంలోకి చేరుకుంది. ఈ జాతాకు నాయకత్వం వహించిన పశ్య పద్మ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ వలి ఉల్లా ఖాద్రి, రాష్ట్ర రైతు సంఘం ఉప కార్యదర్శి డిజి నరేంద్ర ప్రసాద్‌లకు పూలమాలవేసి వలిగొండ సిపిఐ మండల సమితి ప్రజా సంఘాలు స్వాగతం పలికాయి. అనంతరం మండల కేంద్రంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ ప్రజల హక్కులు సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐకి ఉన్నదని పోరాటాల ద్వారా అనేక హక్కులను చట్టాలను సాధించుకున్నామని వివరించారు. ఎన్నికల కమిషన్ నుంచి అన్ని సంస్థలను బిజెపి ప్రభుత్వం తమకు అనుకూలంగా లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. దేశంలోని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజలను విచ్ఛిన్నకరం చేస్తున్నారన్నారు. మేధావులపై దాడి చేస్తున్నారని, ప్రశ్నించే గొంతులను ఉద్యమకారులను అక్రమ కేసులతో నిర్బంధిస్తున్నారన్నారు. మావోయిస్టు పార్టీ నాయకులను పట్టుకొని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అంటూ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, బూటకపు ఎన్‌కౌంటర్లు బిజెపి చేస్తున్న మానవ హననానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులు రోడ్ల పైకి రావాలని అన్నారు. మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగోని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, వేషాల అశోక్, ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి సరిగంజి వీరస్వామి, సిపిఐ ఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, బీసీ సంఘం జిల్లా నాయకులు సాయిని యాదగిరి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, రామన్నపేట మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ, పోచంపల్లి మండల కార్యదర్శి గోడల నాగభూషణ్, నాయకులు ఎలగందుల అంజయ్య, సల్వాద్రి రవీందర్,బాలగోని సత్యనారాయణ, పోలే పాపీక యాదయ్య, నరిగ యాదయ్య, కట్ల యాదగిరి, సాయికుమార్, మారోజు నరసిమాచారి, కనక పోయిన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక నిధులు కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయని యాదవ్ చెప్పారు. అధిక ఖర్చులు, తగినంత సంస్థాగత సామర్థ్యం లేకపోవడం వంటి సమస్యలు ఆయా దేశాలను వెంటాడుతున్నాయని చెప్పారు. కాగా, భారత్ తన జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రణాళికల ద్వారా 'పర్యావరణ అనుకూలత'ను ప్రధాన ప్రవాహంగా మార్చి, దేశీయ వనరుల మద్దతుతో ముందుకు తీసుకెళ్తోందని యాదవ్ వివరించారు. జిడిపితో పోలిస్తే, భారతదేశం ఈ చర్యలకు సంబంధించిన వ్యయం 2016–17 నుంచి 2022–23 వరకు 150 శాతం పెంచిందని పేర్కొన్నారు. కాప్30లో తీసుకున్న ముఖ్య నిర్ణయాలను ప్రస్తావిస్తూ, వాతావరణ అనుకూలత, కాలుష్య నియంత్రణ అనే రెండు ప్రధాన అంశాలు పారిస్ ఒప్పందంలోని పరస్పరపూరక స్తంభాలని వ్యాఖ్యానించారు. కాప్31 సదస్సు ప్రారంభానికి, గతంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసే దిశగా బలమైన అడుగులు పడాలని ఆయన సూచించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధుల అందుబాటును సులభం చేయడం, లావాదేవీ ఖర్చులను తగ్గించడం , గ్రాంట్ల రూపంలోనే నిధులు ఇవ్వడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు.

## రాజ్యాంగాన్ని సవరించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నేతలు, కుల సంఘాల అధ్యక్షులు, మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, విద్యార్థి, యువజన సంఘాల నేతలు, మహిళ నేతలతో పాటు ముఖ్య అతిథులుగా మాజీ గవర్నర్ దత్తాత్రేయ, మాజీ ఎంపి వి.హనుమంతరావు, జస్టిస్ చంద్రకుమార్, డైరెక్టర్ శంకర్, తెలంగాణ విఠల్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా బిసి రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు బిసి జెఎసి చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్ గౌడ్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బిసి జెఎసి ప్రకటించింది. బిసి రిజర్వేషన్ల సాధన కోసం బిసి జెఎసి ఆధ్వర్యంలో అష్టాంగ ఆందోళన కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 25న రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దగ్ధం, 30న బిసిల రాజకీయ యుద్ధబేరి పేరుతో ఛలో హైదరాబాద్, డిసెంబర్ 8, 9 తేదీలలో ఛలో ఢిల్లీ పేరుతో పార్లమెంట్ ముట్టడి తదితర ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. చట్టబద్ధమైన 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయకుండా నిర్వహించే ఎన్నికలను తక్షణమే నిలిపివేయాలని, బిసి రిజర్వేషన్ల అంశంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బిసి సంఘాలు, మేధావులతో చర్చించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానితో రిజర్వేషన్లపై చర్చించడంతో పాటు డిసెంబర్ 1వ తేదీ నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాలలో కాంగ్రెస్ పార్టీ నుంచి బిసి రిజర్వేషన్లపై ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com